www.andhrajyothy.com
పేజీలు: 14
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 301
మంగళవారం | 6-1-2026
శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: తదియ ఉ.8.02 తదుపరి చవితి, నక్షత్రం: ఆశ్లేష మ.12.18 తదుపరి మఖ, వర్జ్యం: రా.12.07-1.41, దుర్ముహూర్తం: ఉ.9.02-9.46, రా.10.07-10.57, అమృతఘడియలు: ఉ.10.46-12.18, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 5.51
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కోనసీమ జిల్లా ఇరుసుమండలో బ్లో ఔట్. నిలువెత్తున లేచిన మంటలతో తగలబడిన కొబ్బరిచెట్లు



కాలి బూడిదైన కొబ్బరి చెట్లు, పంట పొలాలు

ఇరుసుమండ గ్యాస్ లీక్‌తో భయాందోళన

మూసివేసిన బావిలో మరింత లోతుకు డ్రిల్లింగ్

తొలుత అధిక పీడనంతో లీకైన గ్యాస్.. తర్వాత మరో విస్ఫోటం.. ప్రాణ భయంతో జనం పరుగులు

జనావాసాలకు దూరంగా ఉండడంతో తప్పిన ప్రాణనష్టం.. 2 గ్రామాల ప్రజల తరలింపు

కోనసీమలో బ్లో ఔట్..!

100 అడుగుల ఎత్తుకు ఎగసిపడుతున్న అగ్నికీలలు

అమలాపురం/మలికిపురం, రాజమహేంద్రవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పచ్చని కోనసీమలో మరో సారి 'బ్లో ఔట్' మంటలు చెలరేగాయి. డ్రిల్లింగ్ చేస్తున్న రిగ్ వద్ద గ్యాస్ లీకై... ఒక్కసారిగా మంటలు పుట్టాయి. అధిక పీడనంతో కూడిన గ్యాస్ తీవ్రతకు వంద అడుగుల ఎత్తు వరకు అగ్నికీలలు ఎగసి పడుతున్నాయి. తొలుత గ్యాస్ లీకై... అరగం టలోనే పెద్ద శబ్దంతో మంటలు వ్యాపించాయి. 25 మీటర్ల వ్యాసార్థంలో విస్తరించి విరుచుకుపడుతు న్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామ సమీ పంలోని 'మోరి ఫీల్డ్-5'లో సోమవారం మధ్యాహ్నం మొదలైన ఈ బ్లో ఔట్... ఒకప్పటి పాశర్లపూడి 'బ్లోఔట్'ను గుర్తుకు తెస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో పరుగులు తీశారు. జిల్లా

మిగతా 14వ పేజీలో...

ముంబై నుంచి ప్రత్యేక బృందం

బ్లో ఔట్ నియంత్రణకు టైం పట్టొచ్చు

వెలికితీత పనిలోఉన్న డీప్ ఇండస్ట్రీస్ సామర్థ్యంపై అనుమానాలు

పచ్చని కోనసీమలో 'అగ్ని'కీలలు!

మూడు దశాబ్దాల్లో పలు ఘటనలు

పాశర్లపూడి విస్ఫోటానికి 30 ఏళ్లు



ప్రపంచ తెలుగు మహాసభలపై పోస్టల్ కవరు విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని, గోవా గవర్నర్ అశోక్‌గజపతి, స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, గజల్ శ్రీనివాస్ తదితరులు

మన భాషను మరవొద్దు

ఇజ్రాయెల్ యూదుల్లా శక్తిమంతం కావాలి

తెలుగు జాతి అగ్ర స్థానంలో నిలవాలి

టెక్నాలజీతో తెలుగుకు వచ్చిన ముప్పు లేదు

పైగా టెక్నాలజీతోనే మరింత పురోగతి సాధ్యం

ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం ఉద్ఘాటన

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): "సంక్రాంతి పండగకు ముందే అమ్మ భాషా పండగ వచ్చింది. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలన్నదే నా జీవితాశయం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇజ్రాయెల్ యూదుల్లా తెలుగు జాతి కూడా 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతంగా తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు సార స్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్య అతిథిగా సోమవారం ఆయన హాజర య్యారు. హిందీ తరువాత ఎక్కువ రాష్ట్రాల్లో మాట్లాడే రెండో భాష తెలుగు అని, అంత గొప్ప భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు. అమ్మ భాష లేకపోతే జీవితానికి అర్థమే లేదని, ప్రతి ఒక్కరూ మాతృభాషను నేర్చుకోవాలని కోరారు. "మన దేశంలో ఆరు భాషలకు ప్రాచీన హోదా ఉంది. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాతి స్థానం తెలుగుభాషదే. సామెతలు, పొడుపు కథలు, నానుడులు మన భాషలోనే చూస్తాం. దేశంలో ఒకరి భాషను మరొకరు గౌరవించుకోవాలి. ఏ భాషా ఎక్కువా, తక్కువా కాదు. మాతృ భాషలో అభ్యసించినవారే అత్యంత ప్రతిభావంతులు

మిగతా 13వ పేజీలో...



కూర్చుని మాట్లాడుకోండి!

గోదావరి వివాదాన్ని మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు సుప్రీంకోర్టు సూచనలు

పరిష్కారానికి 3 ప్రత్యామ్నాయాలు

హైపవర్ కమిటీ నివేదిక వచ్చేదాకా వీటిపై దృష్టిపెట్టండి

రిట్ పిటిషన్ కాదు.. సివిల్ దావా వేయండి

ఉభయులూ మాట్లాడుకుని పరిష్కరించుకోండి

కమిటీ ముందు అభ్యంతరాలు చెప్పుకోండి

ఆ ప్రాజెక్టును ఆపే నిర్ణయాధికారాన్ని మేం ఆ కమిటీకే ఇచ్చే అవకాశముంది: సీజేఐ

నిబంధనల మేరకే నల్లమలసాగర్

విభజన సమయంలో హైదరాబాద్‌ను తీసేసుకున్నారు

ఇప్పుడు సముద్రంలో కలిసే నీళ్లనూ వాడుకోనివ్వరా?

అనుమతులు తీసుకోవడానికేగా పీఎఫ్ఆర్ తయారీ

మా భూభాగంలో ప్రాజెక్టు కట్టుకోవడానికి నివేదిక రూపొందించుకుంటే అడ్డుకోవడమేంటి?

ఏపీ తరఫు సీనియర్ న్యాయవాదుల వాదనలు

నల్లమలసాగర్‌పై స్టే ఇవ్వండి

వరద జలాల పేరిట 200 టీఎంసీలు తరలించే కుట్ర

విభజన చట్టం, ట్రైబ్యునల్ నిబంధనల ఉల్లంఘన

ధర్మాసనం ముందు తెలంగాణ ప్రభుత్వం వాదన

తదుపరి విచారణ 12వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న గోదావరి జల వివా దాన్ని కలిసి కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవా లని ఉభయరాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. న్యాయ పోరాటాల కంటే.. సామరస్యపూర్వకంగా, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడమే ఉత్తమమని పేర్కొంది. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ విచారణార్హతను ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 131వ అధికరణ కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సలహా ఇచ్చింది. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్రం ఇప్పటికే హైపవర్ కమిటీ వేసినందున దాని ముందుకు వెళ్లి చెప్పుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం

మిగతా 11వ పేజీలో...

జల వివాదాలకు శాశ్వత పరిష్కారం

ఇదే నా లక్ష్యం: చంద్రబాబు

విభేదాలొద్దు.. ఐక్యతతోనే తెలుగుజాతి పురోగతి

సాగునీటి వ్యవస్థకు దారి చూపించింది ఎన్టీఆరే

ఆయన, నేను ఎన్నో నీటి ప్రాజెక్టులు చేపట్టాం

గోదావరిలో పుష్కలంగా నీరు.. ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా కొరతే ఉండదు

విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు.. గంగా-కావేరి సంధానం జరగాలి: సీఎం

13



వారం క్రితం అమెరికా వెళుతూ విమానంలో కృష్ణ కిశోర్, భార్య, పిల్లల సెల్ఫీ

అమెరికాలో ఘోర ప్రమాదం 12

భారత్ నుంచి వెళ్లిన పాలకొల్లు టెకీ దంపతుల మృతి

కారులో ఇంటికి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో ఘటన

పిల్లలిద్దరికీ తీవ్ర గాయాలు



రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న అత్యాధునిక యంత్రాలు

గిన్నిస్ స్పీడ్‌తో రోడ్

అత్యంత వేగంగా బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం

నిరంతరాయంగా ఏడు రోజుల్లో 52 కి.మీ రోడ్డు

పుట్టపర్తి మండలంలో రోడ్డు పనులకు శ్రీకారం 12

నాలుగు గిన్నిస్ రికార్డులు సాధించేందుకు ప్రయత్నం



కొండెక్కిన కోడి

విశాఖలో రికార్డు స్థాయికి ధర

బ్రాయిలర్ స్కిన్‌లెస్ కిలో రూ.300

బెజవాడలో అంతకు మించిన రేటు

కోళ్ల కొరతే కారణం: వ్యాపారులు

మరింత పెరిగే అవకాశం? 12

'ఎర్రబస్సూ' రాదన్నది ఎవరు జగన్?

'భోగాపురం'పై నాడో మాట.. నేడో మాట

విమానాశ్రయం ఎందుకని నాడు ఎగతాళి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములు ఇవ్వొద్దని రైతులను రెచ్చగొట్టిన వైనం

అనుమతులు, భూసేకరణ, శంకుస్థాపన అన్నీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే

జగన్ వచ్చాక పనులు గాలికి

ఇచ్చిన వాటిలో 500 ఎకరాలు వెనక్కి

కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్‌కు బెదిరింపులు

తీరా ఎన్నికల ముందు మళ్లీ శంకుస్థాపన

ఇప్పుడు భోగాపురం ఘనత తనదేనని జగన్, ఆయన రోతపత్రిక గొప్పలు

పైగా చంద్రబాబుపై నిస్సిగ్గుగా నిందలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'ఎర్ర బస్సు' కూడా రాని చోటికి ఎయిర్‌బస్సు ఎందుకని గేలి చేసిన వ్యక్తి..

భోగాపురానికి భూములు ఇవ్వొద్దు.. అని రైతులను పదేపదే రెచ్చగొట్టిన వ్యక్తి..

'మేం వస్తే భూములన్నీ వెనక్కి ఇచ్చేస్తాం'.. అని భూసేకరణకు అడ్డుపడిన వ్యక్తి..

విశాఖలో ఒక విమానాశ్రయం ఉండగా 45 కిలోమీటర్లలోనే మరొకటి ఎందుకని ప్రశ్నించిన వ్యక్తి..

ఇప్పుడు 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్ర యాన్ని' స్వాగతించారు. అంతేకాదండోయ్... ఆ ఘనత అంతా తనదేనని చెప్పుకొన్నారు. అంత టితో ఆగకుండా... చంద్రబాబు 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని చిత్రాలు పోయారు. తన రోత పత్రి కలో విచిత్రమైన కథనాలు ప్రచురించారు. ఆయనే... వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్! కానీ... నిజం దాచాలన్నా దాగదు! భోగాపురం విమానాశ్రయంపై ఆయన

మిగతా 13వ పేజీలో...

నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు!



నన్ను సంతోషపెట్టేందుకు భారత్ ప్రయత్నిస్తోంది

కానీ, రష్యా నుంచి చమురు కొనుగోలును ఇలాగే కొనసాగిస్తే భారత్‌పై టారిఫ్‌లు పెంచేస్తా

అమెరికా భద్రత కోసం మాకు గ్రీన్‌లాండ్ కావాలి: ట్రంప్

గ్రీన్‌లాండ్‌పై పెత్తనం కుదరదు: డెన్మార్క్ ప్రధాని

ట్రంప్ వద్ద మోదీ మోకరిల్లుతున్నారు.. మిత్రుడిని సంతోషపెట్టేందుకు దేశానికి హాని చేస్తారా?: కాంగ్రెస్

అపరాధిని కాను.. నేను వెనెజువెలా అధ్యక్షుడిని!

బంధించి తీసుకొచ్చారు.. కోర్టుకు మదురో నివేదన

సహకరించకుంటే మదురో కంటే దారుణమైన గతి

కొత్త అధ్యక్షురాలు రోడ్రిగ్స్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి సంచ లన వ్యాఖ్యలు చేశారు. తాను సంతోషంగా లేననే విషయం భారత ప్రధాని మోదీకి తెలుసున న్నారు. తనను సంతోషపరిచేం దుకు భారత్ ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. మోదీ మంచి వ్యక్తి అని, కానీ.. రష్యా నుంచి

మిగతా 2వ పేజీలో...

అమెరికాలో హైదరాబాద్ యువతి

దారుణ హత్య

చేసింది మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ!

అనంతరం భారత్‌కు రాక.. అరెస్ట్ 2

బంగ్లాదేశ్‌లో హిందూ వితంతువుపై

అత్యాచారం

చెట్టుకు కట్టేసి జుత్తు కత్తిరింపు

సామాజిక మాధ్యమాల్లో వీడియో

విశ్వాసం కలకాలం ఉంటుంది



దానిని లాప్స్ అవనివ్వకండి

ఎల్ ఐ సి ఆఫ్ ఇండియా సమర్పిస్తోంది
వడ్డీలో రాయితీతో కూడిన
స్పెషల్ రివైవల్ క్యాంపెయిన్
వ్యవధి 1 జనవరి, 2026 నుండి 2 మార్చి, 2026 వరకు

త్వరపడండి!
ఈ అవకాశం వదులుకోకండి.

ల్యాప్స్ అయిన మీ పాలసీని పునరుద్ధరించుకోండి.
బీమా రక్షణ మరియు దాని ప్రయోజనాలు పొందుతూనే ఉండండి.*
*నియమ నిబంధనలు వర్తిస్తాయి

మొత్తం చెల్లించవలసిన ప్రీమియం	వడ్డీలో రాయితీ %	రాయితీలో గరిష్ట పరిమితి**
₹ 1,00,000 వరకు	30%	₹ 3,000
₹ 1,00,001 నుంచి ₹ 3,00,000 వరకు	30%	₹ 4,000
₹ 3,00,001 మరియు అంతకు మించి	30%	₹ 5,000

**నియమ నిబంధనలు వర్తిస్తాయి

పాలసీ నిబంధనలకు లోబడి ప్రీమియం బకాయి పడిన తేదీ నుండి 5 సంవత్సరముల లోపు రివైవ్ చేయవచ్చును.
కనెక్ట్ అయివుండండి. ఎల్ఐసిలో మీ మొబైల్ నంబరు, ఇ-మెయిల్, ఎన్ఇఎఫ్‌టి మరియు పాన్‌ను అప్‌డేట్ చేసుకోండి.
వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి/సందర్శించండి www.licindia.in లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా


మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి
డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital
సందర్శించండి: licindia.in
కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827
మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512
LIC/ P1/2025-26/30/Tel

నకిలీ ఫోన్ కాల్స్ మరియు కాల్పనిక/కపట ప్రతిపాదనలకు లొంగకుండా జాగ్రత్తపడండి. ఐఆర్‌డిఎఐ బీమా పాలసీలు విక్రయించడం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియంలు పెట్టుబడి పెట్టడం లాంటి పనులు చేయదు. ఇలాంటి ఫోన్‌కాల్స్‌ని అందుకునే ప్రజలను పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. నష్టాంశాలు, నియమ నిబంధనలపై మరిన్ని వివరాల కొరకు, దయచేసి పాలసీని విక్రయించడానికి ముందు అమ్మకాల బ్రోచర్‌ని జాగ్రత్తగా చదవండి.

'పెట్రో డాలర్'ను ఎదిరించినందుకే..

వెనెజువెలా అధ్యక్షుడికి అమెరికా శిక్ష

('ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధి)



ప్రపంచ చమురు విపణిపై ఆధిపత్యం.. తమ కరెన్సీ అయిన డాలర్‌కు ప్రత్యామ్నాయ మారకంలో చమురు క్రయవిక్రయాలు జరగకుండా అడ్డుకోవడం.. అమెరికా విదేశాంగ విధానంలో కీలకం. అందులో భాగంగానే.. తమను ఎదిరించే చమురు ఉత్పాదక దేశాధినేతలను పదవీచ్యుతులను చేయడం లేదా వారి ప్రాణాలు తీసి ఆయా దేశాలలో అంతర్యుద్ధం సృష్టించడం, అక్కడ తోలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటుచేయడం అగ్రరాజ్యానికి అలవాటు అనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను నిర్బంధించి తమ దేశానికి తీసుకెళ్లడం అందులో భాగమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మదురో నిర్బంధం అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనలో.. వెనెజువెలాతో అమెరికాకు కలిగిన నష్టాల గురించి కాకుండా ఆ దేశంలోని చమురు ఉత్పత్తి గురించి ప్రధానంగా ప్రస్తావించడం ఇందుకు ఉదాహరణ అని వారు గుర్తుచేస్తున్నారు. వెనెజువెలా చైనాకు యువాన్లలో (చైనీస్ కరెన్సీ) చమురును విక్రయిస్తుండడాన్ని అమెరికా సహించలేకపోతోంది. వెనెజువెలా చమురుకు చైనా ప్రధాన దిగుమతిదారు. వాస్తవానికి ప్రపంచంలోకెల్లా అత్యధిక చమురు నిల్వలు (సౌదీ కన్నా ఎక్కువ) కల్గిన దేశమైనా.. చమురు ఉత్పత్తి, ఎగుమతి విషయంలో వెనెజువెలా వెనుకబడి ఉండడానికి ప్రధాన కారణం అమెరికా ఆంక్షలే. అమెరికా నిఘా సంస్థలు, వివిధ రకాల (18) ఏజన్సీల సమాచారం ప్రకారం.. అగ్రరాజ్యానికి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేసే ప్రధాన రూట్లలో వెనెజువెలా లేదు. ఆ దేశంలోని రెండు ప్రధాన డ్రగ్ సిండికేట్లతో అధ్యక్షుడు మదురోకు సంబంధాలున్నట్లుగా ఆధారాలు కూడా లేవు.

ఇరాక్, లిబియాపైనా..

వెనెజువెలా తరహాలోనే.. చమురు ఉత్పత్తి దేశమైన ఇరాక్ కూడా గతంలో అమెరికా డాలర్‌ను వ్యతిరేకించింది. ఐక్యరాజ్య సమితి ఆహారానికి చమురు పథకం కింద.. డాలర్లలో కాకుండా యూరోలకు చమురును విక్రయించి లబ్ధి పొందింది. అందుకే 2003లో మారణాయుధాల పేర ఇరాక్‌ను దురాక్రమించి.. అప్పటి అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను పదవిచ్యుతుణ్ని చేసి, ఉరి తీసి చంపింది. కానీ, అమెరికా ఆరోపించినట్టు ఇరాక్‌లో ఏలాంటి మారణాయుధాలూ లభించలేదని ఆ తర్వాత యూఎన్ పరిశీలన బృందాలు, అమెరికా, బ్రిటన్ కలిపి ఏర్పాటుచేసిన 'ఇరాక్ సర్వే గ్రూప్', పలు స్వతంత్ర కమిషన్లు ధ్రువీకరించాయి. మరో కీలక చమురు ఉత్పత్తి దేశమైన లిబియా కూడ అమెరికా డాలర్‌కు వ్యతిరేకంగా గళమెత్తి ముందుకు వెళ్లడంతో ఆ దేశ అధ్యక్షుడు కల్నల్ గడ్డాఫీని పదవిచ్యుతుణ్ని చేసి హతమార్చారు. గడ్డాఫీ అనంతరం లిబియా పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిగా మారింది. ఇటీవలికాలంలో రష్యా పలు దేశాలకు డాలర్‌కు బదులుగా తమ కరెన్సీ అయిన రూబుల్స్ మారకం ద్వారా చమురును ఎగుమతి చేస్తుండడంతో తమ ఆధిపత్యానికి ఎక్కడ గండిపడుతుందోనని అమెరికా ఆందోళన చెందుతోంది. అందుకే రష్యా నుండి చమురును కొనుగోలు చేసే దేశాలను సుంకాల పేర దండిస్తోంది. భారత్‌పై కూడా.. తమ వద్ద నుండి చమురు కొనుగోళ్లను పెంచాల్సిందిగా దౌత్యపరమైన ఒత్తిడి తెస్తున్న సంగతి తెలిసిందే.

పీఎఫ్ వేతన పరిమితి సవరణను పరిశీలించండి

» 4 నెలల్లోగా నిర్ణయం తీసుకోండి..కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 5: పదకొండేళ్లుగా సవరించని ఉద్యోగుల భవిష్య నిధి పథకం(ఈపీఎఫ్‌వో) వేతన పరిమితిని సవరించే అంశంపై 4నెలల్లోగా ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. ఈపీఎఫ్‌వో ప్రస్తుతం నెలకు రూ.15వేలకన్నా ఎక్కువ జీతం ఉన్న వారిని కవరేజ్ నుంచి మినహాయించిందని పేర్కొంటూ నవీన్ ప్రకాష్ నౌటియల్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస వేతనం.. నెలకు రూ.15వేలుగా ఉన్న ఈపీఎఫ్‌వో పరిమితి కన్నా ఎక్కువగా ఉందని పిటిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు!



(మొదటి పేజీ తరువాయి)

చమురు కొనుగోలును భారత్ ఇలాగే కొనసాగిస్తే మాత్రం భారత్‌పై త్వరలోనే టారిఫ్‌లు పెంచేస్తానని హెచ్చరించారు. ఆదివారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు భారత్‌పై టారిఫ్‌లు తగ్గించాలంటూ అమెరికాలో భారత రాయబారి వినయ్‌మోహన్ క్వాత్రా తమను కోరారని అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం తెలిపారు. గత నెలలో తాను వినయ్‌మోహన్‌ను ఆయన నివాసంలో కలిసిన సందర్భంలో ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చారని, 25 శాతం టారిఫ్ నుంచి భారత్‌ను ఉపశమనం కలిగించాల్సిందిగా కోరారని చెప్పారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ తగ్గించుకునేలా చేసేందుకే ట్రంప్ ఈ టారిఫ్ విధించారని గ్రాహం అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యవహారశైలిని ప్రతిపక్ష కాంగ్రెస్ తప్పుబట్టింది. అమెరికా సెనేటర్ చేసిన వ్యాఖ్యలు.. ట్రంప్ వద్ద మోదీ మోకరిల్లుతున్న తీరును స్పష్టం చేస్తున్నాయని 'ఎక్స్'లో పేర్కొంది. ట్రంప్ కోసం చిరకాల మిత్ర దేశమైన రష్యా నుంచి చమురు కొనుగోలును కూడా మోదీ నిలిపివేశారని ఆరోపించింది. వ్యక్తిగత పరపతి పెంచుకునేందుకు, ట్రంప్‌ను సంతోషపరిచేందుకు దేశానికి ఎందుకు హాని చేస్తున్నారని ప్రశ్నించింది.

బెదిరింపులు మానుకోవాలి: డెన్మార్క్

అమెరికా భద్రత కోసం తమకు గ్రీన్‌లాండ్ కూడా కావాలని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా వ్యూహాత్మక రక్షణ స్థావరంగా, ఖనిజ సంపద పరంగా తమకు ఆ ప్రాంతం అవసరమని పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను డెన్మార్క్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపులు మానుకోవాలని, గ్రీన్‌లాండ్‌ను నియంత్రించాలన్న అమెరికా కోరిక కలగానే మిగిలిపోతుందని అన్నారు. ఇదిలా ఉండగా, రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసం లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసిందంటూ వచ్చిన వార్తలను ట్రంప్ ఖండించారు. దీనిపై రష్యా చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. అలాంటి లక్ష్యంతో దాడి జరగలేదని తమ అధికారులు ధ్రువీకరించినట్టు చెప్పారు.

ప్రపంచ శాంతికి విఘాతం: జిన్‌పింగ్

ప్రపంచం గడిచిన శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత కుదుపులకు లోనవుతోందని, అనిశ్చితితో ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఏకపక్ష, బెదిరింపు ధోరణి చర్యలు ప్రపంచ శాంతిని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న దేశాల అభివృద్ధి విధానాలను, మార్గాలను పెద్ద, అభివృద్ధి చెందిన దేశాలు గౌరవించాలన్నారు. మదురోను అమెరికా బంధించి తీసుకువెళ్లడంపై జిన్‌పింగ్ ఈ మేరకు స్పందించారు. సోమవారం ఆయన ఐర్లాండ్ ప్రధాని మిచెల్ మార్టిన్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అమెరికా జెండా రంగులతో గ్రీన్‌లాండ్ మ్యాప్



అమెరికా జెండా రంగులతో గ్రీన్‌లాండ్ చిత్రపటాన్ని రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. డెన్మార్క్ దేశంలో స్వయంప్రతిపత్తి ప్రాంతంగా కొనసాగుతున్న గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలుపుకొంటామంటూ ట్రంప్ చెబుతున్న నేపథ్యంలో ఈ పోస్టుకు ప్రాధాన్యం ఏర్పడింది. ట్రంప్ ప్రభుత్వంలో డిప్యూటీ చీఫ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న స్టీఫెన్ మిల్లర్ భార్య కాటీ మిల్లర్ శనివారం ఈ పోస్టు పెట్టారు. వెనెజువెలాపై అమెరికా మిలటరీ ఆపరేషన్ చేపట్టిన కొద్ది గంటల్లోనే ఆమె ఈ పోస్టు పెట్టారు. 'త్వరలో'(సూన్) అని క్యాప్షన్ పెట్టారు. వలసలు, ఇతర అంతర్గత వ్యహారాల్లో స్టీఫెన్ మిల్లర్ అధ్యక్షుడు ట్రంప్‌నకు సలహాదారుగా ఉన్నారు.

జేడీ వాన్స్ ఇంటిపై దాడి

వాషింగ్టన్, జనవరి 5: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇంటిపై దాడి జరిగింది. ఒహాయోలోని ఆయన నివాసంపై అర్ధరాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి దాడి చేయడంతో పలుచోట్ల కిటికీలు ధ్వంసమయ్యాయి. అమెరికా సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని భారీగా మోహరించారు. ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడి సమయంలో వాన్స్ కుటుంబసభ్యులు ఇంట్లో లేరని అధికారులు ధ్రువీకరించారు. ఇటీవల వెనిజువెలాపై అమెరికా సైనిక ఆపరేషన్ సమయంలో కూడా జేడీ వాన్స్ భద్రతా కారణాల దృష్ట్యా ఫ్లోరిడా వెళ్లకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో వాన్స్ నివాసం చుట్టుపక్కల అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు.



32 మంది క్యూబా అధికారులూ మృతి

» వెనెజువెలాపై అమెరికా దాడిలో హతం

హవానా, జనవరి 5: వెనెజువెలా దేశంలో అమెరికా చేపట్టిన మిలిటరీ ఆపరేషన్‌లో 32 మంది క్యూబా అధికారులూ మరణించారు. క్యూబా ప్రభుత్వం ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే, ఆ సమయంలో క్యూబా అధికారులు వెనెజువెలాలో ఏం చేస్తున్నారన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. వెనెజువెలా క్యూబాకు మిత్రదేశం. వెనెజువెలా ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆ దేశంలో నిర్వహిస్తున్న ఒక మిషన్‌లో పాల్గొనేందుకు క్యూబా ప్రభుత్వం తమ మిలిటరీ, పోలీసు అధికారులను పంపింది. వెనెజువెలా ఏళ్ల తరబడి నిర్వహించే ఆపరేషన్లలో వీరు సహకారం అందిస్తున్నట్టు క్యూబా టీవీ చానళ్లు తాజాగా వెల్లడించాయి.

నేను అపరాధిని కాను

ఇంకా వెనెజువెలా అధ్యక్షుడినే

» మా ఇంటి నుంచి నన్ను బంధించి తీసుకొచ్చారు.. కోర్టులో మదురో వెల్లడి

న్యూయార్క్, జనవరి 5: వెనెజువెలా పదవీచ్యుత అధ్యక్షుడు మదురో.. అమెరికా తనను నిర్బంధించిన తర్వాత తొలిసారి న్యూయార్క్ డిస్ట్రిక్ట్ కోర్టులో నోరు విప్పారు! "నేను అమాయకుణ్ని. అపరాధిని కాను. చాలా మంచి మనిషిని" అని తన కేసును విచారిస్తున్న జడ్జికి చెప్పారు. 'మీరెవరో చెప్పండి' అని జడ్జి అల్విన్ కె హెల్వర్‌స్టెయిన్ (92) అడిగిన ప్రశ్నకు.. "నేను వెనెజువెలా అధ్యక్షుణ్ని. కారకాస్‌లోని మా ఇంటి నుంచి అమెరికా నన్ను కిడ్నాప్ చేసి తీసుకొచ్చింది" అని ఆయన బదులిచ్చారు. మదురో భార్య సిలియా కూడా.. తాను వెనెజువెలా అధ్యక్షుడి భార్యనని, ఆ దేశ ప్రథమ మహిళలనని చెప్పారు. తాను అమాయకురాలినని, అపరాధిని కానని జడ్జికి తెలిపారు. వారిద్దరికీ అమెరికాలో ఉన్న వెనెజువెలా కాన్సులేట్‌తో మాట్లాడే హక్కు ఉందని జడ్జి చెప్పడంతో.. ఆ హక్కును వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. మదురో తరపున వాషింగ్టన్ డీసీకి చెందిన ప్రముఖ న్యాయవాది బ్యారీ జే పొలాక్ వాదనలు వినిపించారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే వంటివారి తరపున వాదించిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రస్తుతానికి మదురో బెయిల్ కోరాలని అనుకోవట్లేదని ఆయన కోర్టుకు తెలిపారు. అయితే, ఆయనకు కొన్ని అనారోగ్య సమస్యలున్నాయని చెప్పారు. ఇక.. అమెరికా నిర్బంధించే సమయంలో సిలియాకు గాయాలయ్యాయని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. జడ్జి హెల్లర్‌స్టెయిన్ తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేశారు.

కుంటుతూ కోర్టుకు..

న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురోను.. అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) ఏజెంట్లు సోమవారం ఉదయం హెలికాప్టర్‌లో మన్‌హట్టన్ హెలీపోర్టుకు తరలించారు. అక్కణ్నుంచీ పెద్ద సంఖ్యలో మోహరించిన సాయుధ పోలీసుల భద్రత నడుమ.. ఆయన్ను ఒక బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ఎక్కించి సమీపంలోని ఫెడరల్ కోర్ట్‌హౌస్‌కు తీసుకెళ్లారు. ఖైదీలు ధరించే జంప్‌సూట్, కాషాయరంగు బూట్లు వేసుకున్న మదురో.. చేతికి బేడీలతోనే హెలికాప్టర్ నుంచి దిగి బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో ఎక్కడానికి వెళ్లేటప్పుడు కుంటుతూ నడవడం గమనార్హం.

మాక్కావాల్సింది చేయకపోతే..

మదురో స్థానంలో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్స్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.



మదురోను డిటెన్షన్ సెంటర్ నుంచి న్యూయార్క్ డిస్ట్రిక్ట్ కోర్టుకు తీసుకువెళ్తున్న అధికారులు

"(వెనెజువెలాకు) ఏది మంచిదో, అది చేయకపోతే ఆమె భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. బహుశా మదురో కన్నా ఎక్కువగా" అని 'ద అట్లాంటిక్' మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ హెచ్చరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. అమెరికాకు అనుకూలంగా వ్యవహరించకపోతే మదురోకన్నా దారుణమైన గతి పడుతుందని తేల్చిచెప్పారు! అయితే.. డెల్సీ రోడ్రిగ్స్ ఇప్పటికే అమెరికా ముందు మోకరిల్లడం గమనార్హం! వెనెజువెలా పురోగతి కోసం తమతో కలిసి పనిచేయాలంటూ ఆమె అమెరికాకు సోషల్ మీడియా సాక్షిగా ఆహ్వానం పంపారు. బయటి ఒత్తిళ్లేవీ లేకుండా ప్రశాంతంగా ఉండాలని వెనెజువెలా కోరుకుంటున్నట్టు ఆమె ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు.. తమదేశంలో మదురోకు ఉన్న ఆస్తులను స్తంభింపజేస్తున్నట్టు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రకటించింది.

జడ్జి నేపథ్యమిదీ..

మదురో కేసును విచారిస్తున్న "యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఫర్ ద సదరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్" జడ్జి అల్విన్ కె.హెల్లర్‌స్టెయిన్‌ను.. 1998లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ నియమించారు. ఆయన తన కెరీర్‌లో పలు హైప్రొఫైల్ టెర్రరిజం కేసులను, జాతీయభద్రతకు సంబంధించిన కేసులను విచారించారు. 2001లో అమెరికాలోని జంటహర్మ్యాలపై అల్‌కాయిదా జరిపిన దాడులకు సంబంధించిన కేసులను కూడా ఆయన విచారించారు. ట్రంప్ హష్ మనీ కేసు కేసు విచారణను ఫెడరల్ కోర్టుకు మార్చాలన్న ట్రంప్ అభ్యర్థనను తోసిపుచ్చింది ఈ న్యాయమూర్తే.

నోబెల్ శాంతి బహుమతే అధ్యక్ష పదవికి అడ్డంకి!

మదురో నిర్బంధం తర్వాత విపక్ష నేత మచాడోకే వెనిజువెలా అధ్యక్ష పీఠం దక్కుతుందని చాలా మంది భావించారు. ఆమె కూడా.. 'ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వేచ్ఛ లభించింది. దేశాన్ని తిరిగి నిర్మిస్తాం' అంటూ ప్రకటన చేశారు. కానీ.. ఈ ఏడాది శాంతి నోబెల్ బహుమతిని ఆమె అంగీకరించడమే ఆమె అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి అడ్డంకిగా మారిందని.. ట్రంప్ ఆమెను ఆమోదించడానికి ఇష్టపడలేదని వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ 'వాషింగ్టన్ పోస్ట్' ఒక కథనంలో పేర్కొంది. "నోబెల్ శాంతి బహుమతికి ట్రంపే అర్హుడని ఆమె చెప్పి ఉంటే వెనెజువెలా అధ్యక్షురాలై ఉండేది" అని ఒక అధికారి పేర్కొన్నట్టు తెలిపింది.

బంగ్లాదేశ్‌లో హిందూ వితంతువుపై ఇద్దరి అత్యాచారం

» చెట్టుకు కట్టేసి జుత్తు కత్తిరింపు

ఢాకా, జనవరి 5: బంగ్లాదేశ్‌లో హిందూ మహిళలపై సయితం దాడులు జరుగుతున్నాయి. 40 ఏళ్ల వితంతువుపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడడంతో పాటు, ఆమెను చెట్టుకు కట్టేసి, జుత్తు కత్తిరించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. జెనాయిద్ జిల్లా కలియా గంజ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆమె రెండున్నరేళ్ల క్రితం షాహిన్, ఆయన సోదరుడి నుంచి నందిపారాలో మూడు సెంట్ల స్థలం, రెండంతస్తుల భవనాన్ని 20 లక్షల టాకాలకు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి షాహిన్ ఆమెపై కన్నేసి అసభ్యకర ప్రతిపాదనలు చేస్తూ పలు రకాలుగా వేధించడం ప్రారంభించాడు. శనివారం సాయంత్రం ఆమె స్వగ్రామం నుంచి కొందరు బంధువులు వచ్చిన సమయంలో షాహిన్, అతడి స్నేహితుడు హస్సన్‌లు ఇంట్లోకి బలవంతంగా చొరబడ్డారు. ఆమెపై అత్యాచారం చేశారు. పైగా 50వేల టాకాలు (రూ.37,000) ఇవ్వాలని డిమాండు చేశారు.. కేకలు వేస్తూ రోదిస్తున్న ఆమెను బయటనున్న చెట్టుకు కట్టేసి, జుత్తును కత్తిరించారు. స్పృహ కోల్పోయేవరకు కొట్టారు. నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు.

మరో హిందూ దారుణ హత్య

బంగ్లాలోని జషోర్ జిల్లాలోని మణిరాంపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాణాప్రతాప్ బైరాగి(45) అనే జర్నలిస్టును దారుణంగా హత్య చేశారు. తుపాకీతో తలపై కాల్పులు జరిపి, కత్తితో గొంతు కోశారు. రాణాప్రతాప్ నరాయిల్ జిల్లాలో బి.డి.కబోర్ అనే పత్రికను నిర్వహిస్తూ యాక్టింగ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

అమెరికాలో హైదరాబాద్ యువతి దారుణ హత్య

హైదరాబాద్, చెన్నై, న్యూఢిల్లీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగమ్మాయి గొడిశాల నిఖిత అమెరికాలో దారుణ హత్యకు గురైంది. కొత్త సంవత్సర వేడుకల నుంచి కనిపించకుండాపోయిన ఆమె.. జనవరి 3న మేరీల్యాండ్‌లోని తన మాజీ రూమ్ మేట్ అర్జున్ శర్మ అపార్టుమెంట్‌లో విగతజీవిగా కనిపించింది. నిజానికి, నిఖిత కనిపించడం లేదంటూ అర్జున్ శర్మ జనవరి 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ వెంటనే అతడు భారత్‌కు వెళ్లిపోయాడు. దాంతో, నిఖితను అతనే చంపి ఉంటాడని పోలీసులు అనుమానించారు. భారత అధికారుల సమన్వయంతో ఇంటర్‌పోల్ అధికారులు అర్జున్ శర్మను తమిళనాడులో అరెస్ట్ చేశారు. హైదరాబాద్ తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన నిఖిత 2016-21 వరకు జేఎన్‌టీయూలో ఫార్మసీ చదివారు. నాలుగేళ్ల కిందట ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లారు.

ఢిల్లీ అల్లర్లు-హింస కేసులో..

ఉమర్, షర్జీల్‌కు నో బెయిల్

మిగతా ఐదుగురికి మంజూరుచేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, జనవరి 5: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) నిరసిస్తూ ఐదేళ్ల కిందట ఢిల్లీలో సంభవించిన అల్లర్లు, హింసాకాండకు సంబంధించిన కుట్ర కేసులో నిందితులైన ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. వారు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని అభియోగాలకు ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ కేసులో మిగతా ఐదుగురికి బెయిల్ మంజూరుచేసింది. ఈ మేరకు జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలు 2020 ఫిబ్రవరి నెలాఖరులో ఈశాన్య ఢిల్లీలో హింసాత్మక రూపం దాల్చాయి. ఈ సందర్భంగా 53 మంది ప్రాణాలు కోల్పోవడం, 700 మందికిపైగా గాయపడడం తెలిసిందే. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల వ్యతిరేక చట్టం (యూఏపీఏ) కింద ఢిల్లీ పోలీసులు కేసులు నమోదుచేశారు. ఈ వ్యవహారంలో నిందితులందరినీ ఒకేగాటన కట్టలేమని.. ఒక్కొక్కరూ వేర్వేరు పాత్రలు పోషించారని ధర్మాసనం తెలిపింది. ఈ హింసాకాండలో ఇతర నిందితులతో పోలిస్తే ఉమర్, షర్జీల్ కీలకమైన, నిర్మాణాత్మక పాత్ర పోషించారని పేర్కొంది. అందుకే గుల్‌ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫాయుర్ రెహ్మాన్, మొహ్మద్ సలీం ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు బెయిల్ ఇస్తున్నట్లు వెల్లడించింది. అయితే సాక్షుల విచారణ పూర్తయ్యాక.. లేదంటే ఏడాది తర్వాత బెయిల్ కోసం కీలక నిందితులైన ఉమర్, షర్జీల్ కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. 'చెదురుమదురుగా, స్థానికంగా జరిగే దాడులకు మించి వీరిద్దరూ ప్రణాళికాబద్ధంగా, ఉద్దేశపూర్వకంగా జనసమీకరణ చేయడం.. అల్లర్లకు వ్యూహాత్మక నిర్దేశం చేయడం వంటి కీలక పాత్ర పోషించారనడానికి ప్రాథమిక ఆధారాలున్నట్లు ప్రాసిక్యూషన్ తేల్చింది' అని స్పష్టంచేసింది. ఇదే సమయంలో బెయిల్ ప్రక్రియను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఆ ఐదుగురికీ 11 షరతులతో బెయిల్ మంజూరుచేసింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తర్వాత ఉమర్ తన భాగస్వామి భాను జ్యోత్స్న లహిరితో మాట్లాడారు. ఇక జైలే తన జీవితమని.. మిగతా ఐదుగురికి బెయిల్ రావడం తనకు ఉపశమనం ఇచ్చిందని వ్యాఖ్యానించారు.

తగ్గిన యూరియా ఉత్పత్తి.. రెట్టింపైన దిగుమతి

న్యూఢిల్లీ, జనవరి 5: దేశీయంగా ఉత్పత్తి తగ్గడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి 8 నెలల్లో విదేశాల నుంచి యూరియా దిగుమతులు రెట్టింపు పెరిగాయి. 2025 ఏప్రిల్ నుంచి నవంబరు వరకూ 7.17 మిలియన్ టన్నుల యూరియా దిగుమతైందని భారత ఫర్టిలైజర్ల సంఘం (ఎఫ్ఏఐ) సోమవారం తెలిపింది. 2024-25 ఏప్రిల్-నవంబరు మధ్య యూరియా దిగుమతి 3.26 మిలియన్ టన్నులతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దిగుమతి 120.3% ఎక్కువ. దేశీయంగా 2024-25తో పోలిస్తే యూరియా ఉత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల్లో 25.40 మిలియన్ టన్నుల నుంచి 19.75మిలియన్ టన్నుల (2.3%)కు పడిపోయింది.

కుమార్తెపై రేప్.. నిందితుడికి ఉరి

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కన్నకుమార్తెపై అత్యాచారానికి ఒడిగట్టి, ఆమె గర్భవతి అయ్యేందుకు కారణమైన వ్యక్తికి తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో కోర్టు ఉరి శిక్ష విధించింది. తిరునల్వేలి జిల్లా వల్లియూర్‌కు చెందిన ఓ వ్యక్తి, తన రెండో భార్యకు జన్మించిన 15 ఏళ్ల బాలికపై 2024లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చింది. తండ్రే తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆ బాలిక చెప్పగా.. పోలీసులు కేసు నమోదు చేసి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. తండ్రే నిందితుడని తేలింది.

ఢిల్లీ గాలిలో మందులకు లొంగని బ్యాక్టీరియా

» అన్నిచోట్లా స్టాఫిలోకోక్కై బ్యాక్టీరియా

» జేఎన్‌యూ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 5: అసలే విపరీతమైన వాయు కాలుష్యంతో కునారిల్లుతున్న దేశ రాజధాని ఢిల్లీ వాతావారణంలో.. శక్తిమంతమైన యాంటీబయాటిక్ మందులకు సైతం లొంగని సూపర్ బగ్స్ వ్యాపిస్తున్నాయని జేఎన్‌యూకు చెందిన స్కూల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. బయటి వాతావరణంలోనే కాదు.. ఇళ్లల్లో ఉండే గాలిలో కూడా మందులకు లొంగని 'స్టాఫిలోకోక్కై' అనే బ్యాక్టీరియా ఆనవాళ్లు కనిపించాయని వారు పేర్కొన్నారు. వారు సేకరించిన 100 నమూనాలకుగాను 73 నమూనాల్లో బ్యాక్టీరియా సింగిల్ డ్రగ్ రెసిస్టెంట్ (అంటే ఒకరకం యాంటీబయాటిక్ ఔషధానికి లొంగనివి) కాగా.. 36 నమూనాల్లో మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ (అంటే పలు రకాల యాంటీబయాటిక్స్‌కు నిరోధకత సంతరించుకున్న) బ్యాక్టీరియా ఉన్నట్టు ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన మాధురీ సింగ్ తెలిపారు. కాగా.. డబ్ల్యూహెచ్‌వో సూచించిన పరిమితి ప్రకారం.. గాలిలో స్టాఫిలోకోక్కై లోడ్ 1000 సీఎఫ్‌యూ/ఎం3 (ప్రతి ఘనపు మీటరుకూ 16 వేల కాలనీస్ ఫర్ యూనిట్) లోపే ఉండాలి. కానీ ఢిల్లీ గాలిలో.. 16,000 సీఎఫ్‌యు/ఎం3 ఉండడం ఆందోళన కలిగిస్తోంది. స్టాఫిలో కోక్కై బ్యాక్టీరియా సాధారణంగా మన చర్మంపైన, ముక్కులోపల ఉండే మ్యూకస్ పొరల్లోనూ ఉంటుంది. మనలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే.. మొటిమల వంటి చిన్న సమస్య నుంచి.. న్యూమోనియా, సెప్సిస్, సెప్టిసీమియా వంటి తీవ్ర సమస్యల దాకా రకరకాల అనారోగ్యాలకు కారణమవుతుంది. రోగనిరోధక శక్తి అంతగా ఉండని వృద్ధులు, చిన్నపిల్లలు, క్యాన్సర్ బాధితులు, అవయవమార్పిడి చేయించుకున్నవారికి ఈ బ్యాక్టీరియా చాలా ప్రమాదకరం.

పీవోకేను భారత్‌లో విలీనం చేయాలి

1992లోనే '370'ని రద్దుచేయాల్సింది: బ్రిటన్ ఎంపీ



న్యూఢిల్లీ, జనవరి 5: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను పూర్తిగా భారత్‌లో విలీనం చేయాలని బ్రిటన్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ అన్నారు. జమ్ముకశ్మీర్ విషయంలో భారతదేశ వైఖరికి తాను ఎప్పటి నుంచో మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. పీవోకేను పూర్తిగా భారత్‌లో విలీనం చేయాలని ఆయన నొక్కి చెప్పారు. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించడాన్ని, నియంత్రణను కొనసాగించడాన్ని తాను ఖండిస్తున్నానని వ్యాఖ్యానించారు. భారత్‌లో పర్యటిస్తున్న ఎంపీ బ్లాక్‌మన్.. ఆదివారం జైపూర్‌లోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో నిర్వహించిన హై-టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలని తాను 1992లోనే కోరినట్టు తెలిపారు. కశ్మీర్ పండిట్ల వలసలు ప్రారంభం కాకముందే ఆర్టికల్ 370ని రద్దు చేసి ఉండాల్సిందని, నాటి ఘటనలను తాను అప్పట్లోనే ప్రశ్నించానన్నారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ కొనసాగడం మంచిదే అయినా, ఇది ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేమని, మళ్లీ యుద్ధం వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.

'గ్రూప్-1' అనుబంధ పిటిషన్లపై ముగిసిన వాదనలు

» నిర్ణయం వాయిదా వేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనం కేసులో అనుబంధ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. అప్పీళ్లను తిరిగి ఓపెన్ చేసి విచారణ జరపాలని ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులు అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. అప్పీళ్లను తిరిగి ఓపెన్ చేసిన ధర్మాసనం అనుబంధ పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. సోమవారం విచారణలో అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు సాగదీయడంపై ధర్మాసనం ఆక్షేపించింది. కోర్టు సమయాన్ని వృథా చేసేందుకే అనుబంధ పిటిషన్లు వేసినట్లు కనపడుతోందని అసహనం వ్యక్తం చేసింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో ఈ పిటిషన్లపై నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు వెల్లడించింది.

అభ్యర్థులు కోరింది ఇదే..

2021 నవంబరు నుంచి 2022 జూన్ మధ్య జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు నియమించిన అధ్యాపకుల జాబితాకు సంబంధించిన రికార్డులతో అఫిడవిట్ దాఖలు చేసేలా ఆదేశించాలి. ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్ స్లిప్‌లకు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందుంచాలి. కోర్టు నియమించిన కమిటీ పరిశీలించిన ఓఎంఆర్ షీట్స్, కంట్రోల్ బండిల్స్‌పై ఉన్న సంతకాలు, చేతిరాతపై ఫోరెన్సిక్ పరిశీలనకు ఆదేశించాలి. జవాబుపత్రాలకు జతచేసిన ఓఎంఆర్ షీట్ల పరిశీలన సందర్భంగా కమిటీ గుర్తించిన అంశాలను, పరిశీలించిన వాస్తవాలను నివేదికలో భాగం చేయాలి.





కందుకూరులో టిడ్కో గృహాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి

▸▸ మంత్రి నారాయణ

కందుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 163 పట్టణాలు, నగరాలలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాలను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సోమవారం కందుకూరు మునిసిపాలిటీలో ఆయన ఆకస్మికంగా పర్యటించి, టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి 7లక్షల గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. గత ఐదేళ్లలో కనీసం 50 వేల ఇళ్లను కూడా జగన్ సర్కారు పూర్తిచేయలేకపోయిందని ఎద్దేవా చేశారు.

గవర్నర్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం గవర్నర్ పుట్టిన రోజును పురస్కరించుకుని.. సంపూర్ణ ఆరోగ్యంతో సుదీర్ఘకాలం ప్రజాజీవితంలో కొనసాగాలని సీఎం ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ కూడా గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వర్సిటీల ర్యాంకులు మెరుగుపడాలి

▸▸ సమానత్వం ప్రవేశాల్లోనే కాదు... విజయాలు, జీవన ఫలితాల్లోనూ కనిపించాలి

▸▸ కంఠస్థం కాదు... సృజనాత్మక ఆలోచన అవశ్యం

▸▸ విద్యార్థులకు ఆ దిశగా విద్యాబోధన జరగాలి

▸▸ అక్షరాస్యత తక్కువగా ఉండటం ప్రతికూల పరిణామం

▸▸ మానవ వనరుల బలోపేతంపైనే రాష్ట్ర భవిష్యత్తు

▸▸ వీసీల సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో మెరుగుపడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో జరిగిన ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేవలం ఆంధ్ర విశ్వవిద్యాలయం మాత్రమే మొదటి 50 ర్యాంకుల్లో స్థానం సాధించింది. ఈ పనితీరు ర్యాంకుల మెరుగుదల ఆవశ్యకతను సూచిస్తోంది. యూనివర్సిటీ విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలను ప్రోత్సహించే విద్యా వాతావరణాన్ని సృష్టించాలి. నాణ్యతను అంతర్గత సంస్కృతిగా చూడాలి. కేవలం పాఠాలు కంఠస్థం చేయడం కాదు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా బోధన జరగాలి. మన యూనివర్సిటీల్లో విద్యార్థులు ధైర్యంగా, నైపుణ్యంతో కోర్సు పూర్తిచేసేలా చేయడం ప్రధాన సవాలు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థుల అవసరాలపై విశ్వవిద్యాలయాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమానత్వం అనేది కేవలం ప్రవేశాలకు పరిమితం కాకుండా వారి విజయాలు, జీవన ఫలితాల్లోనూ ప్రతిఫలించాలి. ప్రస్తుతం మనం జీవిస్తున్న సాంకేతిక యుగంలో కేవలం డిగ్రీ సరిపోదు. విద్యార్థులు నైపుణ్యాలను, డిజిటల్ అవగాహనను పెంచుకునేలా ఉండాలి. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం తక్కువగా ఉండటం ప్రతికూల పరిణామం. గ్రామీణ, గిరిజన విద్యార్థుల్లో అక్షరాస్యతను పెంచాల్సిన ఆవశ్యకతను అక్షరాస్యత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో జీఈఆర్ 36.5గా ఉంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. ఈ విజయాలు ప్రశంసనీయమైనప్పటికీ తర్వాత దశలో నాణ్యతా ప్రమాణాలు పెరగాల్సిన అవసరం ఉంది. నాణ్యత అనేది బలమైన ఉన్నత విద్యకు మూల స్తంభం. విద్య సామాజిక బాధ్యతను పెంపొందించాలి. విశ్వవిద్యాలయాలు బోధనా కేంద్రాలుగా మాత్రమే కాకుండా జ్ఞానం సృష్టించే ఇంజన్లుగా కూడా వ్యవహరిస్తాయి. వీసీలు కీలక స్థానాల్లో ఉంటారు. మీ నాయకత్వం సంస్థలను తీర్చిదిద్దుతుంది. వేలాది మంది విద్యార్థులను ప్రభావితం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మానవ వనరుల బలోపేతంపై ఆధారపడి ఉంది" అని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు.

మన డిగ్రీలకు విలువ పెరగాలి

సిలబస్ ఎప్పటికప్పుడు నవీకరించాలి: మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉప కులపతులు విద్యారంగాన్ని నడిపించే నాయకులుగా, సంస్కరణల అంబాసిడర్లుగా పనిచేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. సోమవారం విజయవాడలో జరిగిన వీసీల సదస్సులో ఆయన మాట్లాడారు. 'విజ్ఞాన సమాజాన్ని సృష్టించడంలో విశ్వవిద్యాలయాలదే కీలక పాత్ర. చాలా మంది ఉన్నత విద్యను పూర్తిచేసి బయటికొచ్చినప్పుడు గందరగోళ పరిస్థితుల్లో మిగిలిపోతున్నారు. అందుకే ఐదు అంశాలపై విశ్వవిద్యాలయాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని లోకేశ్ పేర్కొన్నారు.



విజయవాడలో జరిగిన ఉపకులపతుల సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి లోకేశ్

ఐదు సవాళ్లు

- ▸▸ మన డిగ్రీలకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ తక్కువ. పాఠ్యాంశాల మార్పులపై దృష్టిపెట్టి, డిగ్రీలకు విలువ పెరిగేలా చేయాలి.
- ▸▸ తగిన ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌లు, ప్లేస్‌మెంట్ వ్యవస్థలు లేక మన డిగ్రీలకు విశ్వసనీయత తగ్గుతోంది.
- ▸▸ పరిశోధన, ఆవిష్కరణ, జ్ఞాన ప్రభావం మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. మన స్టార్టప్ ఎకోసిస్టమ్‌లు బలహీనంగా పనిచేస్తున్నాయి.
- ▸▸ విద్య కంటే పరిపాలన అంశాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అధ్యాపకుల లోటు ఉంది. విద్యా ప్రమాణాలపై ఇంకా ఎక్కువ సమయం కేటాయించాలి.
- ▸▸ విద్యార్థుల అనుభవంలో సమానత్వం, నిలకడ లోపిస్తోంది. వారికి మార్గదర్శకం, సంక్షేమం, మానసిక మద్దతు లేమి పెద్దసవాలుగా ఉంది.

పరిశోధన వర్సిటీల ఆత్మ

"పాతకాలం పాఠ్యాంశాలను బోధించడం అంటే విద్యార్థులకు ద్రోహం చేయడమే. మన దగ్గర డిగ్రీలు పొందినా, ఆ తర్వాత 4 నెలలు అమీర్‌పేట్‌లో శిక్షణ తీసుకుని ఉద్యోగాలు పొందుతున్నారు. ఇది విద్యార్థుల వైఫల్యం కాదు, సంస్థల వైఫల్యం. పరిశోధన అనేది విశ్వవిద్యాలయాల ఆత్మ. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు మన లక్ష్యం' అని లోకేశ్ అన్నారు. ఈ సదస్సులో ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఉన్నతాధికారులు కోన శశిధర్, బుడితి రాజశేఖర్, సౌరభ్ గౌర్, భరత్‌గుప్తా పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

ఆర్థిక ఒత్తిడిని అధిగమించేందుకు వర్సిటీలు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేయాలి. ఫార్చ్యూన్ 500 కంపెనీల సీఈవోలలో మన పూర్వ విద్యార్థులున్నారు. రాబోయే దశాబ్దానికి ఉపయోగపడేలా సిలబస్‌లో మార్పులు చేయాలి. నాలెడ్జ్ చాలా వేగంగా మారుతోంది. రాబోయే పదేళ్లలో వచ్చే ఉద్యోగాల్లో 80 శాతం మనకు తెలియనవి ఉంటాయి. మొత్తం విద్యా విధానం ప్రక్షాళన కావాలి. నాణ్యత కొలమానంగా మార్పులు రావాలి' అని లోకేశ్ అన్నారు.



సోమవారం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో రైతునేస్తం ఫౌండేషన్ దశమ వార్షికోత్సవంలో ఉప్పుటూరి చినరాములను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శివసేవకులకు ఆన్‌లైన్‌లో అవకాశం

▸▸ శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందించే శివసేవకులు ఇకపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్టు ఆలయ ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల సేవకులే కాకుండా దేశం నలుమూలల నుంచి శివభక్తులు చేసిన వినతులను పరిశీలించి దేవదాయశాఖ ఈ అవకాశం కల్పించిందన్నారు. దేవస్థానం పరిపాలనా భవనంలో సోమవారం అధికారులతో ఈవో సమావేశమై... ఆన్‌లైన్‌లో సేవకుల నమోదు, విధివిధానాల అమలుపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



కనకదుర్గమ్మను దర్శించుకున్న మారిషస్ అధ్యక్షుడు ధర్మబీర్ గోకుల్

విజయవాడ,జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం మారిషస్ దేశ అధ్యక్షుడు ధర్మబీర్ గోకుల్ దంపతులు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం దేవస్థానం వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కాగా, మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు రానున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుంటారు.

ఆరు రోజుల్లో 4.59 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం

▸▸ హుండీ ద్వారా రూ.24.61 కోట్ల కానుకలు

తిరుమల, జనవరి5(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆరురోజుల్లో 4.59 లక్షల మంది భక్తులు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్నారు. డిసెంబరు 30 నుంచి వైకుంఠద్వార దర్శనాలు మొదలైన విషయం తెలిసిందే. 30న 67,053 మంది, 31న 70,256, జనవరి1న 65,225, 2న 83,032, 3న 88,662, 4న 85,179 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని వైకుంఠద్వార ప్రవేశం చేశారు. గత ఏడాది వైకుంఠద్వార దర్శనాల్లో తొలి ఆరు రోజుల్లో 4.07 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది 52 వేల మంది అదనంగా దర్శనం చేసుకున్నారు. ఇక, ఈ ఆరు రోజుల్లో రూ.24.61 కోట్ల హుండీ ఆదాయం లభించగా, 1.43 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. జనవరి 8 అర్ధరాత్రి వరకు వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయి. .

బీసీ సంక్షేమశాఖ పరిధిలోకి నూర్‌బాషా కార్పొరేషన్

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీ నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ కార్పొరేషన్‌ను ఏపీ సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం నుంచి తొలగించి బీసీ సంక్షేమశాఖ పరిధిలోని కో-ఆపరేటివ్ సహకార చట్టం కిందకు తెచ్చారు. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ కార్పొరేషన్‌ను ఏపీ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం-2001 కింద రిజిస్టర్ చేశారు. అనాదిగా ఆ కులానికి చెందిన వారు రాష్ట్రంలో దూది వడకటం, పత్తి సాగు, కాటన్ ఫ్యాబ్రిక్ తయారు, పరుపుల తయారు తదితర పనులు చేస్తున్నారని, అయితే టెక్నాలజీ అభివృద్ధి చెందిన తర్వాత వారు ఉపాధి కోల్పోయారని బీసీ సంక్షేమశాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వారి అభివృద్ధికి వృత్తిపరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ కార్పొరేషన్‌ను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సూచించింది.

ఎస్సీ హాస్టళ్లు, గురుకులాల్లో అంబేడ్కర్ విగ్రహాలు!

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సాంఘిక సంక్షేమ బోర్డు చర్చించింది. తాడేపల్లిలోని ఏపీ గురుకుల సొసైటీ కార్యాలయంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన సాంఘిక సంక్షేమ బోర్డు సమావేశమైంది. రాష్ట్రంలో 15 డిగ్రీ కళాశాలల ఏర్పాటు, అన్ని గురుకులాల్లో విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ కోర్సు, సోలార్‌రూఫ్‌టాప్ ఏర్పాటు, ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో విద్యార్థులకు వాషింగ్‌మెషిన్ సౌకర్యం తదితర అంశాలు చర్చకు వచ్చాయి.

వంట సిబ్బంది నియామకం

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 133 మంది సిబ్బందిని థర్డ్‌పార్టీ సంస్థ ద్వారా నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అదనంగా 28 మంది వంటవాళ్లను, 105 మంది కామాటిలను నియమించింది.

ఆంధ్రప్రదేశ్ పవర్ జెనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్
విద్యుత్ సౌధ: విజయవాడ
APGENCO

ఆఖరి నోటీసు

శ్రీమతి ఏ.స్రవంతి, AEE (ID.1073631) విధులకు **24.10.24** నుండి గైర్హాజరవుతున్నది. ఆమెకు పంపిన నోటీసులు చిరునామాకు చేరకుండా తిరిగి వచ్చినవి. వివరములకు ఏపిజెన్కో వెబ్‌సైట్ www.apgenco.gov.inను చూడవచ్చును. ఈ నోటీసు వెలువడిన 20 రోజుల్లోగా ఆమె **O/o S.E/Enquiries/APGENCO/Vijayawada** కు హాజరు కావలెను లేని యెడల విచారణ ఏకపక్షముగా జరుగును.
DIPR RO No.4724PP/CL/ADVT/1/1/2021-22, Dt: 05.01.2026

GOVERNMENT OF ANDHRA PRADESH
School Education Department

Notice for Eggs Tender

NIT Nos.01/2026 to 26/2026 (Total 26 Nos.)
The Director, Mid Day Meal & School Sanitation, Andhra Pradesh invites tenders from interested Poultry Farmers for procurement and supply of Eggs to all Govt. Schools covered under Dokka Seethamma Madhyahna Badi Bhojanam Scheme of School Education Department and all Anganwadi centres under Balasanjeevani scheme of WD&CW Department for the year 2026-2027. The details can be seen in the e-procurement portal of **https://tender.apeprocurement. gov.in from 07/01/2026 by 10.00 AM.**
Sd/- Director, Mid Day Meal & School Sanitation, Andhra Pradesh
DIPR RO No.4723PP/CL/ADVT/1/1/2021-22, Dt: 05.01.2026

గుంటూరు నగరపాలక సంస్థ
ఇ.టి.నెం. 39,53,67,68,70,71/2025-26, తేది.05.01.2026

"ఇ"-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాటఫర్మ్ ద్వారా టెండర్ పద్ధతిన రిజిష్టరు కాంట్రాక్టు దారుల నుండి టెండర్ కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.apeprocurement.gov.in (e procurement platform) వద్ద చూడవచ్చును.

(A) "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఇ.టి. నెం.39,68,70/2025-26

షార్ట్ టెండర్ నోటీసు

మొత్తం పనుల సంఖ్య	- 04
అంచనా మొత్తం	- 4,63,90,000/-
పని వివరములు	- రోడ్లు, కాలువలు మరియు ఇతర అభివృద్ధి పనులు
టెండరు బిడ్ కనబడు తేది	- 03.01.2026, ఉదయం:10:30 AM
టెండరు బిడ్‌లను వేయుటకు ఆఖరు తేది	- 07.01.2026, మధ్యాహ్నం:3:00 PM
టెండరు బిడ్‌లను తెరచు తేది	- 07.01.2026, మధ్యాహ్నం:3:15 PM

(B) "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఇ.టి. నెం.53,67,70,71/2025-26

టెండర్ నోటీసు

మొత్తం పనుల సంఖ్య	- 75
అంచనా మొత్తం	- 26,80,20,000/-
పని వివరములు	- రోడ్లు, కాలువలు మరియు ఇతర అభివృద్ధి పనులు
టెండరు బిడ్ కనబడు తేది	- 03.01.2026, ఉదయం:10:30 AM
టెండరు బిడ్‌లను వేయుటకు ఆఖరు తేది	- 17.01.2026, మధ్యాహ్నం:3:00 PM
టెండరు బిడ్‌లను తెరచు తేది	- 17.01.2026, మధ్యాహ్నం:3:15 PM


మిగిలిన వివరములు ఆఫీసు పనిచేయు వేళలో పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, నగరపాలక సంస్థ, గుంటూరు

శ్రీ మహానందీశ్వరస్వామి వారి దేవస్థానము, మహానంది, నంద్యాల జిల్లా.
ఇ-టెండరు ప్రకటన
ఆర్.సి.నెం:బి2/1155/2025, తేది:05-01-2026
దేవస్థానము నందు లడ్డు ప్రసాదము తయారీకి మరియు నిత్య పూజలకు అవసరమైన ఆవు నెయ్యి ఒక సంవత్సర కాలపరిమితికి అనగా తేది:01-02-2026 నుండి తేది: 31-01-2027 వరకు ఆవు నెయ్యి ఉత్పత్తి చేసే కో-ఆపరేటివ్ సొసైటీలు / పాల ఉత్పత్తిదారుల సంఘాలు / రైతు ఉత్పత్తిదారుల సంస్థలు/ రైతు పరస్పర సహాయ సహకార పాడి పరిశ్రమల ఆర్గనైజర్స్ వారి నుండి మాత్రమే సరఫరా చేసుకొనుటకు ఇ-టెండర్లు నిర్వహించబడుచున్నవి. కావున ఇతర వివరముల కొరకు **www.tender.apeprocurement.gov.in** నందు ఫోన్: 08514-234726 ను సంప్రదించగలరు.
సం/- ఎస్.శ్రీనివాస రెడ్డి, కార్యనిర్వహణాధికారి.

ANDHRA PRADESH CENTRAL POWER DISTRIBUTION CORPORATION LTD
Vidyut Nilayam, Corporate Office, ITI College Road, Vijayawada - 520 008
e-Procurement Tender Notice
Tenders are invited from APCPDCL with (i) Tender No: CPMPT-31/25-26 for Procurement of 3000 KM of 55Sqmm AAA Conductor (ii) Tender No.CPMPT-32/25-26 for procurement of 220.4kVAR ,7.3kV Capacitor Bank cells-339Nos and 440.7kVAR, 7.3kV Capacitor Bank cells-123Nos to all the circles of APCPDCL through AP e-procurement. For further details please visit **https://tender.apeprocurement.gov.in** from **06-01-2026.** Ph: **0866-2955455** & Email: **cgmpmm.cpdcl@apcpdcl.in**
Sd/- Chief General Manager/P&MM, APCPDCL: Vijayawada

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
నెం.12/2025-26, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు** తేది: 01.01.2026
పని పేరు: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామం (ఫేజ్-2) ఆర్& ఆర్ కాలనీ, పిడిఎఫ్‌లకు పోలేరమ్మ ఆలయం నుండి ఫేజ్-1 ప్రధాన రహదారి వరకు బ్యాలెన్స్ సిసి రోడ్డు, సిసి డ్రెయిన్ మరియు కల్వర్టు నిర్మాణం. పని విలువ రూ.1,28,62,741/-. షెడ్యూల్ డౌన్‌లోడ్ ఆఖరు తేది: 19.01.2026,మ.3.00గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ **https://tender.apeprocurement.gov.in** లో చూడగలరు. ఫోన్ నం.9490165319.
సం/- పర్యవేక్షక ఇంజనీరు,కన్‌స్ట్రక్షన్ సర్కిల్, ఒంగోలు
DIPR RO No.18665/CL/ADVT/1/1/2021-22, Dt: 05.01.2026

ANDHRA PRADESH FOREST DEVELOPMENT CORPORATION LTD.,
(A Government of Andhra Pradesh Undertaking)
REGIONAL OFFICE: Pinakini Vana Vihar Forest Complex, Chandramouli Nagar, 2nd Street, Opp. Nippo Factory, Andhra Kesari (A.K.) Nagar Post, Nellore-524004.
జీడి మామిడి తోటలలో ఫల సాయము వేలము
Ref.No.2.1.19/2026 Season/NLR/1062, Date: 03.01.2026
ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ, నెల్లూరు ప్రాంతీయ కార్యాలయము పరిధిలో గల **బాపట్ల, కావలి నార్త్, కావలి సౌత్, నాయుడుపేట, సత్యవేడు** డివిజన్లలోని జీడి మామిడి తోటల నుండి (01) సంవత్సరం, అంటే 2026 సీజన్‌లో ఫలసాయము పొందు హక్కును ఈ-టెండర్లు మరియు ఈ-వేలం ద్వారా విక్రయించబడును. ఈ-వేలం **"కొనుగోలు"** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ-పోర్టల్ (https://www.konugolu.ap.gov.in) మరియు (https://www.apfdcl.ap.gov.in) నందు **21.01.2026 తేదీ ఉదయం 11.00 AM నుండి మధ్యాహ్నం 02:00 PM** వరకు నిర్వహించబడుతుంది. ఆ రోజు వేలంలో అమ్ముడుకాని లేదా నిర్ధారణ చెందని యూనిట్లను **04.02.2026 తేది, 18.02.2026 తేది, 28.02.2026 తేది మరియు 09.03.2026 తేదీలలో ఉదయం 11.00 AM నుండి మధ్యాహ్నం 02:00 PM** వరకు తిరిగి వేలం నిర్వహించబడుతుంది.
Sd/- Sri P. Vivek, I.F.S., Regional Manager, APFDC Ltd., Nellore
DIPR R.O.No.4728PP/CL/ADVT/1/1/2021-22, Dt.05.01.2026



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విషధార..!

ఒకటా, రెండా... ఏకంగా ఏడుసార్లు 'క్లీన్‌సిటీ' అవార్డు అందుకున్న ఇండోర్‌లో ఇంతటి ఘోరావిపత్తు సంభవించడం ఆశ్చర్యం. నేల కింద నీరు కాదు, విషం పారుతోందన్న నిజాన్ని బేఖాతరుచేస్తూ, ఉపరితలంలో కనిపిస్తున్నదానికే మురిసిపోతూ ఈ నగరానికి ఇన్నిసార్లు అవార్డులు ఇచ్చేశారా? స్వచ్ఛత పురస్కారాలకు, ఎంపిక ప్రాతిపదికలకే కళంకం తెచ్చే ఘటన ఇది. మెరిసిపోతున్న రోడ్లకింద మంచినీటితో పారుతున్న ఆ పైపుల్లో మలమూత్రాలు కలగలసి అనేకమంది ప్రాణాలు పోయాయి. ఆస్పత్రుల్లో చేరినవారిలో కొందరి పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. వందలాదిమంది ఆరోగ్యాలు ఇంకా కుదుటపడలేదు. పేదలు నివసించే భగీరథపురలో జరిగిన ఈ ఘటన తాగేనీటి హక్కుల్లోనూ ఆర్థిక తారతమ్యాలు ఉంటాయని తెలియచెప్పింది.

ఈ దుర్ఘటనపర్యవసానం తరువాత, ఈ అవార్డుల నగరానికి అన్నీఇన్నీ మరకలు కావంటూ పలు ప్రత్యేక కథనాలు వెలుగుచూస్తున్నాయి. నీటి నాణ్యత బాగోలేదని, కలుషిత నీటిమీద ఫిర్యాదులు వస్తున్నా పరిష్కారానికి నెలలు పడుతోందని, ట్యాంకులు, పైపుల నిర్వహణ సక్రమంగా లేదని, అనేక ప్రాంతాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని కాగ్ గతంలోనే చీవాట్లు పెట్టిందట. ఇండోర్‌లో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గుర్తించి, హెచ్చరించిన యాభైనిమిది కలుషితనీటి ప్రమాదం గల ప్రాంతాల్లో భగీరథపుర ఒకటి. అందువల్ల, ఇది అనూహ్యమైనదీ కాదు, ఆకస్మికంగా జరిగిపోయినదీ కాదు. మూలాలు తెలియకుండా, ఊహకు అందకుండా ఊడిపడ్డ ప్రమాదమేమీ కాదు. ఈ ఘోరం ఎలా, ఎందుకు జరిగిందో అర్థమైన నేపథ్యంలో, ఇంతమంది ప్రాణాలు పోయేవరకూ ఎందుకు ఊరుకున్నారన్నదే అసలు ప్రశ్న. కనీసం స్థానికుల మొర ఆలకించినా ప్రమాదం నివారించగలిగేవారేమో. తాము తాగుతున్న మంచినీటి రంగు, రుచి, వాసన బాగా మారిపోయాయంటూ వారంరోజులుగా స్థానికులు చేస్తున్న ఫిర్యాదులు అధికారులు పెడచెవిన పెట్టారు. పేద ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నామని తెలిసికూడా ఇంతటి నిర్లక్ష్యం ప్రదర్శించడం అమానుషం. పరిస్థితి పూర్తిగా విషమించి, కొందరి ప్రాణాలు పోతేగానీ అధికారుల్లో చలనం రాకపోవడం, రంగంలోకి దిగకపోవడం దుర్మార్గం. మంచినీటి పైపుల్లోకి మురుగునీరు ప్రవేశించే అవకాశమూ, ప్రమాదమూ అత్యధిక నగరాల్లో ఉంది. మరీ ముఖ్యంగా, రెండు పూర్తి భిన్నమైన లక్ష్యాలకు ఉద్దేశించిన ఈ పైప్‌లైన్లు ఒకదానికి ఒకటి దూరంగా కాక, పక్కపక్కనే సాగుతుంటే, అవిదెబ్బతిన్నాటివి కూడా అయితే ప్రమాదం మరీ ఎక్కువ. నీటిసరఫరా లేని వేళల్లో మంచినీటి పైపుల్లోకి చేరిన మురుగునీరు ఆ తరువాత జనం గొంతుల్లోకి విషంగా దిగుతుంది, అత్యంత ప్రమాదకర వ్యాధులతో వారిని మంచాన పడవేస్తుంది, ప్రాణాలు హరిస్తుంది. అనేక పాతనగరాల్లో మాదిరిగా ఇండోర్‌లోనూ వందేళ్ళకు పైబడిన మంచినీటి పైపులనే ఇప్పటికీ మరమ్మత్తులు చేస్తూ నెట్టుకొస్తున్నారట. వలసపాలకులలోనో, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లోనో వేసిన పైపులే ఇప్పటికీ చాలా నగరాలకు దిక్కు.

ఇటువంటి దురదృష్టకర ఘటనలు జరిగినప్పుడు రాజకీయనాయకుల మాటల యుద్ధానికి అంతం ఉండదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విపక్షనేతలు అంటారు. మహా విషాదాన్ని రాజకీయం చేయవద్దని అధికారపక్షం అంటుంది. నేడు ఇండోర్‌లో మరింత తీవ్రంగా ఉండవచ్చును గానీ, పలు నగరాల్లో తాగేనీరు ప్రాణాంతకంగా పరిణమించిన సందర్భాలు గత రెండేళ్ళకాలంలోనే అనేకం చూశాం. అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతలేనితనం దీనికి ప్రధాన కారణం. వందలకోట్ల ఖర్చుతో ఏకంగా నదులనే ప్రక్షాళిస్తామంటున్న పాలకులు ప్రజలకు మంచినీళ్ళను సక్రమంగా అందించలేకపోతున్నారు. స్వచ్ఛభారత్, జల్‌జీవన్ వంటివి దూకుడుగా అమలవుతున్నప్పటికీ, సామాన్యజనానికి ఈ నీటి బాధలు తప్పడం లేదు. స్మార్ట్‌సిటీలు, క్లీన్‌సిటీలు అంటూ సాగుతున్న హడావుడిని, అవార్డులను, రివార్డులను ఇండోర్ ఘటన ప్రశ్నిస్తోంది. తాగేనీటిని విషంగా మార్చుతున్న వ్యవస్థాగత వైఫల్యాల్ని ఎత్తిచూపుతోంది. ఉపరితలంలో కనిపిస్తున్నదీ, మెరుస్తూ మనలను మురిపిస్తున్నదీ నిజం కాదని, కాళ్ళకింద నేలలో కాలకూటం ఉన్నదనీ హెచ్చరిస్తోంది.

లక్ష్యం చైనా.. అస్త్రం వెనెజువెలా!




■ రాహుల్ కుమార్

కొత్త సంవత్సరం కొత్త ఆశలను మోసుకొస్తుందని అందరమూ అమాయకంగా నమ్ముతాం. కొత్త ఆశల సంగతేమో గానీ పాత ఆశలను తుంచేసే రీతిలో దాని గమనం మొదలైంది. పాలకులు నియంతలైనా, అప్రజాస్వామికులైనా వారిని మార్చివేసే హక్కును ఆ దేశాల ప్రజలకే వదిలివేయాలన్నది ఆధునిక రాజకీయాల్లో మౌలిక సూత్రం. దీనికి గండికొడుతూ వెనెజువెలాపై అమెరికా దాడి చేసింది. అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యనూ అరెస్టుచేసి అమెరికాకు తరలించింది. మాదకద్రవ్యాల రవాణాలో మదురోకు కీలకపాత్ర ఉందని ఆరోపించి, ఆ మేరకు ఎప్పుడో కోర్టు ఉత్తర్వులు పొంది అంతా సజావుగా, చట్టబద్ధంగా చేశామని అమెరికా సమర్థించుకోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. తన భద్రతకు ప్రమాదంగా పరిణమించాయని ఆరోపిస్తూ ఇష్టంలేని ప్రభుత్వాలను కూలదోయటం అమెరికాకు ఇది తుదీ కాదు.. మొదలూ కాదు.

భారీ జనవిధ్వంసక ఆయుధాలను దాస్తోందన్న ఆరోపణలతో ఇరాక్‌పై దాడిచేసి సద్దాంహుసేన్ ప్రభుత్వాన్ని అమెరికా కూల్చివేసింది. దీంతో మధ్యప్రాచ్యం అగ్నిగుండమైంది. జనవిధ్వంసక ఆయుధాలు ఇరాక్‌లో లేనేలేవని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ నిపుణులు తేల్చిచెప్పినా తాననుకున్న విధంగా సైన్యాలను నడిపించి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. నిజానికి అమెరికా రెండో దాడి నాటికే (2003) ఇరాక్ అన్నివిధాలుగా బలహీనమైపోయింది. అమెరికా, యూరోపు దేశాలు విధించిన ఆంక్షలతో, యుద్ధ నష్టాలతో అప్పటికే సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణ మందులు సైతం అందక లక్షలాది పసిపిల్లలు ప్రాణాలను కోల్పోయారు. అమెరికా నేతృత్వంలో ఆరంభమైన మొదటి గల్ఫ్ యుద్ధంతోనే (1990–91) ఇరాక్ నవనాడులూ కుంగిపోయాయి. ఏమీ చేయలేని దుస్థితిలో ఇరాక్ ఉందని తెలిసినా ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆమోదం లభించకపోయినా అనుకున్నది చేసేశారు. అంతే.. అక్కడ కనీవినీ ఎరగని విధ్వంసం జరిగింది. అందులోంచి నుంచి ఐఎస్‌ఐఎస్ లాంటి ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు పుట్టుకొచ్చి దేశదేశాల్లో సమస్యలను సృష్టించాయి. అఫ్ఘానిస్థాన్‌లోకి ప్రవేశించిన (1979) సోవియట్ సైన్యాలను ఎదిరించటానికి.. ఇస్లాం ప్రమాదంలో పడిందంటూ ముజాహిదీ బృందాలను తయారుచేసి వెన్నుదన్నులు అందించటంతో మతతత్వ తీవ్రవాద భావజాలం 1980ల చివరినాటికే విపరీతంగా శక్తిని పుంజుకుంది. ఆ విపరిణామంలో అమెరికా నిర్వహించిన పాత్ర గురించి ఇప్పుడెవరికీ సందేహాల్లేవు. దానిపై వందల వేల విశ్లేషణలూ వచ్చాయి.

2003 నాటి ఇరాక్‌లాగే ఇప్పటి వెనెజువెలా పరిస్థితి ఉంది. ఆర్థికంగా దిగజారిపోయింది. భద్రతాపరంగా ఎవరికీ ముప్పుకలిగించే పరిస్థితిలోనూ లేదు. మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగపడే మార్గాలకు వెనెజువెలా ఉపయోగపడుతున్నా వాటి ఉత్పత్తికి ఇప్పటికీ అది కేంద్రం కాదు. కొలంబియా నుంచి ఇతరచోట్లకు మాదకద్రవ్యాలను చేరవేయటానికి వెనెజువెలా పనికివస్తోంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇందులో ప్రభుత్వాధినేత పాత్ర ఎంతో ఇదమిత్థంగా చెప్పలేం. కొందరు అధికారుల పాత్ర కచ్చితంగానే ఉండొచ్చు. కానీ నచ్చని ప్రభుత్వాలను మార్చటానికి దేశాధినేతలను దోషులుగా ముద్రవేయటం అమెరికా వ్యూహాల్లో ఎప్పుడూ కీలకంగానే ఉంటుంది. ఆర్థికవ్యవస్థలు అధోగతికి వెళుతున్నప్పుడు కొన్నిచోట్ల నిషేధిత మత్తుపదార్థాల వ్యాపారాలు విజృంభిస్తాయి. అఫ్ఘానిస్థాన్‌లో అదే జరిగింది. 1979 నుంచి ఇప్పటివరకూ అక్కడ ఏదో విధంగా రాజకీయ సంక్షోభం కొనసాగుతూనే ఉంది. ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడుదుడుకుల్లోనే నడుస్తోంది. ముజాహిద్ బృందాలకు నిధులను సమకూర్చటానికి మత్తుపదార్థాల వ్యాపార–రవాణాకు సీఐఏ అండదండలను అందించిందని అమెరికా జర్నలిస్టులే పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. ఒకనాటితో పోల్చితే ఆర్థికాభివృద్ధిపరంగా వెనుకపట్టుపట్టిన పంజాబులోనూ మత్తుపదార్థాల సమస్య తీవ్రంగానే ఉంది. దిగజారిన వెనెజువెలా ఆర్థిక పరిస్థితికి కారణమెవరని ప్రశ్నించుకుంటే వేలును ఒక్కవైపుగానే చూపించలేం.

చమురు నిల్వలు పుష్కలంగా ఉన్న దేశం ఆర్థికంగా పతనం అంచున ఉండటం విచిత్రంగానే అనిపించినా వెనెజువెలా విషయంలో అది కఠోర వాస్తవం. 1999లో హ్యూగో రాఫెల్ చావెజ్ అధికారంలోకి రావటం వెనెజువెలాలోనే కాదు దక్షిణ అమెరికా దేశాల చరిత్రలోనే మేలుమలుపుగా పరిగణించే వ్యాఖ్యానాలు చాలా వచ్చాయి. 1990ల్లో ఊపందుకున్న సరళీకృత ఆర్థిక విధానాలను వ్యతిరేకించే వారందరికీ చావెజ్ ఆశాకిరణంలా కనపడ్డారు. వెనెజువెలాతో పాటు బ్రెజిల్, అర్జెంటీనా, బొలివియా, చిలీల్లో (2002–2006) సరళీకృత విధానాలను వ్యతిరేకించే, సంక్షేమ కార్యక్రమాలకు ఎక్కువ నిధులను ఖర్చుపెట్టాలని కోరుకునే నాయకులు అధికారంలోకి వచ్చారు. వాగ్దానాల ప్రకారం కొన్ని సంక్షేమ పథకాలను అమలుచేసినా కావాల్సిన స్థాయిలో ప్రభుత్వ ఆదాయాలను పెంచుకోలేకపోయారు. తీవ్రంగా నిధులకొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. వెనెజువెలా పరిస్థితి ఘోరంగా దిగజారింది. చమురు అమ్మకాలపైనే ప్రధానంగా ఆధారపడుతూ ఇతర రంగాలను నిర్లక్ష్యం చేయటంతో వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. చమురుధరలు తగ్గిపోయినప్పుడు ఏమీచేయలేని దుస్థితిలో పడిపోయింది. దీనికి తోడు అమెరికాతో పాటు ఇతరదేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలతో కనీవినీ ఎరగని సంక్షోభంలో కూరుకుపోయింది. 2014లో 482–500 బిలియన్ డాలర్ల విలువ ఉన్న జీడీపీ 2025 వచ్చేసరికి 100–115 బిలియన్ డాలర్లకు పడిపోయింది. రుణాలు–జీడీపీ నిష్పత్తి 160 శాతానికి పెరిగింది. అంటే ఆదాయం వంద రూపాయలు ఉంటే రుణం 160 రూపాయలకు చేరింది. చమురు ఆదాయం బాగున్న కాలంలో (2000–2014) మొత్తం ప్రభుత్వ ఖర్చులో 45 శాతం నుంచి 65 శాతం వరకూ సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించారు. పెద్ద మొత్తం ఇలా ఖర్చుపెట్టటం వల్ల ఉత్పత్తి రంగాలకు నిధులను సమకూర్చలేకపోయారు. చమురుశుద్ధి కర్మాగారాల ఆధునికీకరణకూ, చమురు అన్వేషణలో, వెలికితీతలో కొత్త పద్ధతులనూ అనుసరించలేని అశక్త స్థితికి చేరుకున్నారు. మరోవైపు విదేశీపెట్టుబడులకు ఎప్పటి నుంచో ద్వారాలు మూసివేశారు. 2014 నుంచి క్రమేపీ చమురుధరలు తగ్గిపోవటంతో కరెన్సీని ఇబ్బడిముబ్బడిగా ముద్రించటం మొదలుపెట్టారు. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. ఆదాయం పడిపోవటంతో తలకుమించిన భారంగా అప్పులు చేయకతప్పలేదు. చెల్లింపుల సామర్థ్యం లేకపోవటంతో అవీ అనుకున్నంతగా దొరకలేదు. ప్రభుత్వ ఆదాయంలో పన్నుల ద్వారా వచ్చేది 15 నుంచి 20 శాతానికి మాత్రమే పరిమితమైంది. బ్రెజిల్ (85–90శాతం), అర్జెంటీనా (80–85శాతం), చిలీ (75–80శాతం), మెక్సికో (65–70శాతం)ల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆర్థిక ఆంక్షలు పరిస్థితిని విషమం చేసినా అసలు కారణాలు వెనెజువెలా అవలంబించిన విధానాల్లోనే ఉన్నాయి. చావెజ్ ఆరంభించిన విధానాలను.. మదురో ఏదోవిధంగా కొనసాగించటానికి ప్రయత్నించటమే మనకు కనపడుతుంది. అందుకే సంక్షోభం నుంచి గట్టెక్కలేకపోయారు. ఆదాయాన్ని పెంచే మార్గాల కంటే సంక్షేమ పథకాల పేరుతో పంచిపెట్టటమే ప్రధానమైన చోట జనాకర్షణ రాజకీయాలే కీలకంగా ఉంటాయి. అవి ఉన్న చోట వ్యక్తిపూజ కేంద్రంగా విపరీత ప్రవర్తనతో వ్యవహరించే నాయకులే ఉంటారు. దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడే విధానాలకు దూరంగా జరుగుతూనే ఉంటారు. చావెజ్, మదురోలు దీనికి మినహాయింపు కాదు. చావెజ్ హయాంలో సంక్షేమ పథకాలకు ఎక్కువ ఖర్చుపెట్టటం వల్ల ఆదాయ అసమానతలు కొంత తగ్గాయి. కానీ మొత్తంగా ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లో ఆరోగ్యకరరంగా అడుగులు వేయలేకపోవటం వల్ల అవి తాత్కాలికమే అయ్యాయి. ప్రస్తుతం అక్కడ 82 శాతం మంది దారిద్ర్యంలో జీవించటమే ఇందుకు నిదర్శనం.

మాదకద్రవ్యాల సరఫరాలో వెనెజువెలా అధ్యక్షుడి పాత్ర ఉందంటూ ఆక్రమణను సమర్థించుకోటానికి పైకి అమెరికా ఏదైనా చెప్పొచ్చు. దాడికి అసలు కారణాలు మాత్రం లోతైనవి. ప్రపంచవ్యాప్తంగా పలచనవుతున్న అమెరికా ఆధిపత్యంలోనే కీలకమంతా ఉంది. మారుతున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థలో, రాజకీయాల్లో అమెరికా పాత్ర తగ్గటమే గాని పెరిగే పరిస్థితి కనిపించటంలేదు. చైనా ధాటికి తట్టుకుని నిలబడటానికే అమెరికా అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే యూరపు భద్రతను ప్రధానంగా అక్కడి దేశాలే చూసుకోవాలని చెప్తోంది. మరోవైపు ఎన్ని ఆర్థిక ఆంక్షలను విధించినా రష్యా లొంగిరావటం లేదు. చేసేదిలేక ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించటానికి రష్యా డిమాండ్లన్నిటినీ అంగీకరించేలా యూరపు దేశాలపై ఒత్తిడి తెస్తోంది. ఆసియా, ఆఫ్రికాలో చైనా ప్రభావాన్ని తగ్గించటానికి చేసిన ఏ ప్రయత్నమూ ఫలించటంలేదు. భారత్‌తోనూ సంబంధాలు దిగజారాయి. దిగుమతులపై 50 శాతం సుంకాల భారం మోపటంతో కొన్ని రంగాల్లో మనకు గట్టి సమస్యలే వచ్చిపడుతున్నాయి. మరోవైపు లాటిన్ అమెరికా దేశాలూ చైనాతో సంబంధాలను పెంచుకుంటున్నాయి. అంతెందుకు వెనెజువెలా చమురును చైనానే కొనుగోలు చేయకపోతే పరిస్థితి చాలా అధ్వానంగా ఉండేది. 80 శాతం వెనెజువెలా చమురు ఎగుమతులు అక్కడికే వెళుతున్నాయి. లాటిన్ అమెరికా దేశాలకు చేసే ఎగుమతులను కూడా చైనా క్రమేపీ పెంచుకుంటోంది. 2023 నాటికే చైనా ఎగుమతులు 273 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అమెరికా ఎగుమతులతో (423 బిలియన్ డాలర్లు) పోల్చితే ఇవి తక్కువగా ఉన్నా ఏడాదేడాదికి పెరుగుదల రేటు బాగా నమోదవుతోంది. లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఇచ్చే రుణాలు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. దాదాపుగా 136 బిలియన్ డాలర్లను వివిధ రూపాల్లో రుణాలుగా ఇచ్చింది.

> **వెనెజువెలాలోని అమెరికా ప్రత్యక్ష పెట్టుబడులతో పోల్చితే చైనావి తక్కువే అయినా అవన్నీ చమురు, గనులు, ప్రాథమిక సౌకర్యాలు, ఇంధనం వంటి కీలకరంగాల్లో ఉన్నాయి. అమెరికా కన్నెర్ర చేయడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.**

ప్రత్యక్ష పెట్టుబడులు కూడా 160 బిలియన్ డాలర్లకు చేరాయి. వెనెజువెలాలోని అమెరికా ప్రత్యక్ష పెట్టుబడులతో (38శాతం) పోల్చితే చైనావి (5.7శాతం) తక్కువే అయినా అవన్నీ చమురు, గనులు, ప్రాథమిక సౌకర్యాలు, ఇంధనం వంటి కీలకరంగాల్లో ఉన్నాయి. అమెరికా కన్నెర్ర చేయడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.


ప్రపంచం మొత్తంలో వెనెజువెలాకున్న అపార చమురు నిల్వలపై (17–18శాతం) పట్టుని సంపాదించి లాభాలను పిండుకోవటమూ, చైనాతో ఆ దేశానికి బలపడుతున్న బహుముఖ బంధాలను నియంత్రించటమూ లక్ష్యంగా అమెరికా ప్రత్యక్ష దాడికి దిగింది. దీనికితోడు మొత్తంగా లాటిన్ అమెరికా దేశాలను తన అదుపాజ్ఞల్లో ఉంచుకోవటాన్ని అమెరికా ప్రాణావసరంగా భావిస్తోంది. అందుకే జాతీయ భద్రతా వ్యూహానికి సంబంధించిన తాజా పత్రంలో అమెరికా ఖండంపై ఇతర దేశాల జోక్యం వద్దని ప్రబోధించిన.. 200 ఏళ్ల నాటి మన్రో సిద్ధాంతాన్ని కొత్త వ్యాఖ్యానాలతో తెరపైకి తెచ్చింది. 1820ల్లో స్వాతంత్ర్యం పొందిన లాటిన్ అమెరికా దేశాలు తిరిగి యూరప్ ప్రభావంలోకి వెళ్లకుండా నియంత్రించటమే మన్రో సిద్ధాంతానికి ఆనాడు లక్ష్యమైంది. తర్వాతి కాలంలో లాటిన్ అమెరికాలో తన ఆధిపత్యాన్ని పెంచుకోటానికే అమెరికా దాన్ని ఉపయోగించుకుంది. ఇప్పుడదే సిద్ధాంతాన్ని వెలికితీసి పరోక్షంగా చైనాను ఎదుర్కోటానికి తయారైంది. ఆ దేశంతో ఆర్థికంగా సన్నిహితమైన వెనెజువెలా లాంటి దేశాలను లొంగదీసుకోటానికి అదే అస్త్రంగా మారింది. ఆర్థికంగా అగ్రగామిగా మారుతున్న ఆసియాపై ఆర్థిక ఆధిపత్యం సాధ్యం కాని నేపథ్యంలో వైట్‌హౌస్ విధానకర్తలకు లాటిన్ అమెరికాపై పట్టుబిగించి అడ్డంకులను తొలగించుకోవటమే అత్యవసరం అవుతోంది. అందుకు లాటిన్ అమెరికా–కరేబియాలోని 33 దేశాల్లో ఎన్ని వరుసగా సమిధలవుతాయో ఇప్పుడే చెప్పలేం! సార్వభౌమత్వాల స్థానంలో సామ్రాజ్యవాదం అంటే ఇదేనేమో!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> **వెనెజువెలాకున్న అపార చమురు నిల్వలపై పట్టుని సంపాదించి లాభాలను పిండుకోవటమూ, చైనాతో ఆ దేశానికి బలపడుతున్న బహుముఖ బంధాలను నియంత్రించటమూ లక్ష్యంగా అమెరికా ప్రత్యక్ష దాడికి దిగింది. దీనికితోడు మొత్తంగా లాటిన్ అమెరికా దేశాలను తన అదుపాజ్ఞల్లో ఉంచుకోవటాన్ని అమెరికా ప్రాణావసరంగా భావిస్తోంది. అందుకే... 200 ఏళ్ల నాటి మన్రో సిద్ధాంతాన్ని కొత్త వ్యాఖ్యానాలతో తెరపైకి తెచ్చింది.**

ఆయుర్వేదాన్ని పరిరక్షించుకుందాం

భారతీయ సనాతన ధర్మంలో ఆయుర్వేదం కేవలం చికిత్సా విధానం కాదు. అది ప్రకృతితో మమేకమైన ఒక సమగ్ర జీవన శైలి. అనాదిగా ఋషులు, మునులు అందించిన ఈ అద్భుతమైన ఆరోగ్య జ్ఞాన సంపదను, ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నవారే మన 'పరంపర వైద్యులు' లేదా 'అనువంశిక వైద్యులు'. కానీ, నేటి ఆధునిక వైద్యశాస్త్ర ఆర్భాటంలో, వేదాలకు పుట్టినిల్లు అయిన మన దేశంలోనే ఈ దేశీయ వైద్య నిపుణులు కనీస గుర్తింపునకు నోచుకోలేకపోవడం దురదృష్టకరం.



మన తెలుగు రాష్ట్రాలలో వేలాదిమంది నిష్ణాతులైన పరంపర వైద్యులున్నారు. పుస్తకాలకు ఎక్కని, ఆధునిక సైన్సుకు అందని ఎన్నో అరుదైన మూలికల రహస్యాలు, చికిత్సా విధానాలు వీరి వద్ద నిగూఢంగా ఉన్నాయి. వీరిని విస్మరించడం అంటే మన ప్రాచీన విజ్ఞానాన్ని మనమే చేజార్చుకోవడమే. ఈ జ్ఞానాన్ని మనం గ్రంథస్థం చేయకపోతే, విదేశీ సంస్థలు మన మూలికలపై పేటెంట్లు పొందే ప్రమాదం కూడా ఉంది.

అక్కడక్కడా జరిగే ఒకటి రెండు అశాస్త్రీయ ఘటనలను భూతద్దంలో చూపిస్తూ, మొత్తం పరంపర వ్యవస్థనే మూఢ నమ్మకంగా కొట్టిపారేయడం సరికాదు. విపరీతమైన రసాయన ఔషధాల వాడకం వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలు మన కళ్యెదుటే ఉన్నాయి. పరంపర వైద్యం పూర్తిగా ప్రకృతి సిద్ధమైనది, దుష్ప్రభావాలు లేనిది. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తక్కువ ఖర్చుతో కూడిన వైద్యం. దీనిలోని శాస్త్రీయతను ప్రభుత్వం గుర్తించాలి. ఆధునిక శాస్త్రవేత్తలు, పరంపర వైద్యులతో కలిసి పరిశోధనలు జరిపి, ఆ జ్ఞానాన్ని ధ్రువీకరించాలి.

జీవవైవిధ్యానికి వారసులు పరంపర వైద్యులు. వారు కేవలం చికిత్సకులు మాత్రమే కాదు, పర్యావరణ రక్షకులు కూడా. ఔషధాల కోసం అడవులపై ఆధారపడే వీరు, ఆ వనమూలికలను, అడవులను కన్నబిడ్డల్లా కాపాడుకుంటారు. వీరిని ప్రోత్సహించడం అంటే పరోక్షంగా పర్యావరణాన్ని రక్షించడమే. సంప్రదాయ వైద్య ప్రాముఖ్యాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గుర్తించింది. చైనా, జపాన్, దక్షిణ కొరియాతో పాటు పలు ఆఫ్రికా దేశాలు తమ దేశీయ వైద్యానికి పెద్దపీట వేస్తున్నాయి.

ప్రపంచమంతా తమ సంప్రదాయ వైద్యాన్ని ఇంతలా గౌరవించుకుంటుంటే, ఆయుర్వేదానికి జన్మభూమి అయిన భారతదేశంలో పరంపర వైద్యులు గుర్తింపు కోసం పోరాడాల్సి రావడం బాధాకరం. ఈ అమూల్యమైన ఆయుర్వేద జ్ఞానం అంతరించిపోకముందే ప్రభుత్వాలు మేల్కోవాలి. నిస్వార్థంగా సేవ చేస్తున్న సంప్రదాయ పేద వైద్యులను ఆదుకోవాలి. పరంపర/అనువంశిక వైద్యులను గుర్తించడానికి తక్షణమే ఒక ప్రక్రియను ప్రారంభించాలి. అవసరమైతే వారి నైపుణ్యాన్ని పరీక్షించడానికి ప్రామాణికమైన పద్ధతులను ప్రభుత్వం రూపొందించాలి. గతంలో ఉన్న ఆర్‌ఎంపీ వ్యవస్థ తరహాలో లేదా ఆయుష్ పరిధిలో వీరికి శిక్షణనిచ్చి, చట్టపరమైన అవగాహన కల్పించాలి. అధికారికంగా మెయిన్ స్ట్రీమ్ వైద్య విధానంతో అనుసంధానించాలి. ప్రతి జిల్లా లేదా మండల కేంద్రంలో పరంపర వైద్యశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేసి, నిష్ణాతులైన వైద్యులకు అవకాశం కల్పించాలి. వారి అనుభవానికి ఆధునిక సైన్సును జోడించి కొత్త ఆవిష్కరణలకు బాటలు వేయాలి.

– సింహాచలం లక్ష్మణస్వామి

రాష్ట్రాల హక్కులను కాలరాసే విద్యాబిల్లు

విద్యారంగంలో సంస్కరణలు చేపడతామని చెబుతూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్–2025' బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లు ద్వారా ఉన్నత విద్యపై కేంద్రం తన నియంత్రణ పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను కాలరాయడమే. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఏర్పడిన యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈలను రద్దు చేసి, వీటిని హెచ్‌ఈసీఐ పేరుతో ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా విద్య కేంద్రీకరణకు కేంద్రం పాల్పడుతోంది. అంతేకాదు, ఈ బిల్లుతో విద్య కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూనే, 'జ్ఞాన వ్యవస్థ' పేరుతో తన హిందూత్వ ఎజెండాను దేశంలో అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ బిల్లును పరిశీలిస్తే అందులోని అంశాలైన 'వికసిత్ భారత్ వినియమన్ పరిషత్ (నియంత్రణ), వికసిత్ భారత్ శిక్షా గుణవత్ పరిషత్ (అక్రిడేషన్), వికసిత్ భారత్ శిక్షా మానక్ పరిషత్ (ప్రమాణాలు)...' వంటి పదాల వినియోగం కూడా విద్య కాషాయీకరణను తెలియజేస్తోంది. ప్రస్తుతం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లును ప్రతిపక్షాల వ్యతిరేకత కారణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపారు. ఈ బిల్లును జేపీసీ క్షుణ్ణంగా సమీక్షించాల్సిన అవసరముంది. రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాలకు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి ఈ బిల్లు అనుగుణంగా ఉండేలా, ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను అరికట్టేలా కేంద్రానికి జేపీసీ తగిన సిఫార్సులు చేయాలి.

మొత్తంగా చూస్తే, ఎన్‌ఈపీ–2020 ఆలోచన పునాది అయితే, 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్–2025' బిల్లు దాని అమలు కోసం రూపొందించిన నియంత్రణ చట్టం. ఇది విద్యను విముక్తి సాధనంగా కాకుండా, కేంద్రంపై విధేయత పెంపొందించే వ్యవస్థలా మార్చే రాజకీయ ప్రాజెక్టు. ఈ కుట్రను అడ్డుకోకపోతే దేశంలోని విద్యా రంగం ప్రజల చేతుల్లోంచి శాశ్వతంగా జారిపోయే ప్రమాదముంది.

– **టి.నాగరాజు,** ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

పెట్టుబడుల సాధనలో అగ్రస్థానం!

పెట్టుబడుల సాధనపై ప్రపంచవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. అన్ని రాష్ట్రాలను అధిగమించి జాతీయ, అంతర్జాతీయ సంస్థల్ని ఆకట్టుకుని పెట్టుబడులు సాధించడం సామాన్యమైన విషయం కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన దూరదృష్టి, ప్రణాళిక, కృషి కారణంగా రాష్ట్రం పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారింది. దేశంలో పెట్టుబడులు సాధించడంలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో నిలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల పోటెత్తడానికి చంద్రబాబు బ్రాండ్, విశ్వసనీయతే ప్రధాన కారణం. ఏ రాష్ట్రం వేగంగా అనుమతులు ఇస్తుందో, ఏ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందో, ఏ ప్రభుత్వంపై నమ్మకం ఉంటుందో అక్కడికే పెట్టుబడులు బారులు తీరుతాయి. మిగతా రాష్ట్రాలు కళ్లు తెరిచే లోపే లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని ఛాంపియన్‌గా నిలిపిన ఒకే ఒక్కడు చంద్రబాబు. ఏపీకి పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడానికి కారణం రాష్ట్రంపై దేశీ–విదేశీ మార్కెట్ల విశ్వాసం. ప్రధానంగా విజన్ ఉన్న నాయకత్వం పాలనకు వచ్చిన గుర్తింపు. పరిశ్రమలే సంపద సృష్టిస్తాయి. పెట్టుబడిదారులకు అవసరమైనది స్థిరత్వం, స్పష్టత... ఈ రెండు రాష్ట్రంలో ఉన్నాయి. ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ పాలసీలు, సింగిల్ డెస్క్ క్లియరెన్స్ టైం బౌండ్ అనుమతులు, భూమి, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ సౌలభ్యం, వివిధ రంగాల్లో మౌలిక వసతులు విస్తరణతో పెట్టుబడిదారులకు రాష్ట్రం దారి చూపుతున్నది.

2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయని, ఇతర రాష్ట్రాల కంటే అధిక వాటాను ఏపీ సొంతం చేసుకుందని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ఇచ్చింది. ఒడిశా 13.1 శాతం, మహారాష్ట్ర 12.8 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలో ఈ 9 నెలల కాలంలో రూ.26.60 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని.. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో వచ్చిన పెట్టుబడుల కంటే ఇది 11.5శాతం ఎక్కువని నివేదిక తెలిపింది.

అయిదేళ్ళ జగన్‌రెడ్డి వికృత పరిపాలనలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా పడకేసింది. పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు, ఉపాధి కల్పన లేదు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం 14వ స్థానానికి పడిపోయింది. ఏది ఏమైనా ఏపీ పెట్టుబడుల మ్యాప్‌లో ముందంజలో ఉండటం రాష్ట్ర విజయమే కాదు. దేశానికి ఇచ్చే సందేశం కూడా.

● నీరుకొండ ప్రసాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఉపాధి హామీ అవకతవకలకు స్వస్తి!

గ్రామీణ ప్రాంతాల్లో కనీస ఉపాధిని చట్టబద్ధం చేస్తూ ఉపాధి హామీ పథకం ప్రారంభం అయింది. 2007–14 మధ్య 1660 కోట్ల పని దినాలకు 2.13 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసి 1.53 కోట్ల గ్రామీణ ఆస్తుల కల్పన జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. 2014–15 నుంచి 2025–26 వరకు 3029 కోట్ల పనిదినాలకు 8.54 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసి దాదాపు 9 కోట్ల గ్రామీణ ఆస్తుల సృష్టి జరిగింది. అంటే, ఈ పథకం ప్రవేశపెట్టిన యూపీఏ ప్రభుత్వం తమ పాలన 7 సంవత్సరాలకు సగటున సంవత్సరానికి రూ.30,500 కోట్లు ఖర్చు చేస్తే, ఎన్డీఏ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో సగటున సంవత్సరానికి 77,000 కోట్లు ఖర్చు చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్డీఏ హయాంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ క్రింద అందిన నిధులు 87 వేల కోట్లు (సీసీ రోడ్లు, కాలువలు, మరుగుదొడ్లు, ఫార్మ్ పాండ్లూ, అమృత్ సరోవర్, పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, గోకులం షెడ్ల కోసం). ఈ నిధులతో 262 కోట్ల పనిదినాలకు 52 వేల కోట్లు ఉపాధి హామీ వేతనాలు, 31 వేల కోట్లు మెటీరియల్ కాంపోనెంట్, 4 వేల కోట్లు సిబ్బంది వేతనాలు చెల్లించారు.

రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాలపై ఇరవై సూత్రాల అమలు (వికసిత్ భారత్– స్వర్ణాంధ్రప్రదేశ్) సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ పథకం అమలులో సంస్కరణలు అవసరం కనిపించింది. 2019–24 మధ్య ఉపాధి కూలీలుగా బోగస్ పేర్లతో కార్డులను భారీగా సృష్టించారు. కేవైసీ అమలు చేస్తే రాష్ట్రంలో 11 లక్షల బోగస్ కార్డులు దొరికాయి. వీటితో నిధులు దోచేశారు. తప్పుడు మస్టర్లతో పనిచేయడానికి రాని వారికి చెల్లింపులు చేశారు. పనిచేయడానికి వచ్చినా నిర్ణీత సమయం పని చేయలేదు. పనిచేయకుండానే చేసినట్లు రికార్డులలోకి ఎక్కించారు. పని తక్కువ చేసి ఎక్కువగా రికార్డులలో నమోదు చేశారు. ప్రామాణికతకు అనుగుణంగా పనులలో నాణ్యత లేదు. అలాగే వ్యవసాయ సీజన్‌లో కూలీలు దొరకక రైతులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పటివరకు గత 20సంవత్సరాలలో దేశంలో 10.67 లక్షల కోట్లు (ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు లక్ష కోట్లు పైగా) ఖర్చు చేస్తే, ఆస్తుల సృష్టి ఆ మేరకు జరగలేదు.

ఉపాధిహామీ పథకంలో బోగస్ కార్డులు, చెల్లింపులకు చెక్ పెట్టి గ్రామాలలో ఉపాధి, నాణ్యమైన ఆస్తుల కల్పన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఇవి నేటి పరిస్థితులకు అనుగుణంగా సత్ఫలితాల కోసం అవసరమైన నిర్ణయం. "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (VB–G RAM G)–2025" గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పనతో పాటు నాణ్యమైన ఆస్తుల సృష్టికి దోహదపడే విధంగా, నిధుల దుర్వినియోగాన్ని నివారిస్తూ, ఉన్నతమైన లక్ష్యంతో పారదర్శకంగా నిధులు వినియోగించే ఉద్దేశ్యంతో చేసిన చట్టం.



ప్రస్తుతం ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి హామీని, 125 రోజులకి పెంచడం ఒక కీలక సంస్కరణ. అలాగే, ఉపాధి హామీ పథకం కింద పని కోరిన వ్యక్తికి 15 రోజుల్లోగా ఉపాధి కల్పించని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భత్యం చెల్లించాల్సిన నిబంధనను కొత్త బిల్లు యథాతథంగా కొనసాగిస్తోంది. వ్యవసాయ కాలంలో కూలీల కొరతను దృష్టిలో ఉంచుకొని, ఈ సీజన్‌లో 60 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిలిపివేసే అవకాశం కల్పించింది. దీని ద్వారా గ్రామీణ కార్మికులకు ప్రభుత్వ పథకం కింద 125 రోజులు, వ్యవసాయ సీజన్‌లో అదనంగా 60 రోజుల ఉపాధి లభిస్తుంది. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 వ్యయ నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. దీంతో ఈ పథకం క్రింద వినియోగించే నిధుల పరిమాణం పెరిగి గ్రామీణ ఉపాధి విస్తరణకు, నాణ్యమైన ఆస్తుల సృష్టికి అవకాశం కలుగుతుంది. ఇది ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్ లక్ష్య సాధనకు బలమైన పునాదిగా నిలుస్తుంది.

తప్పుడు లావాదేవీలు, దుర్వినియోగాలను పూర్తిగా అరికట్టేందుకు ఈ బిల్లు ఆధునిక సాంకేతికత వినియోగాన్ని ప్రతిపాదిస్తోంది. అవి– లావాదేవీలకు బయోమెట్రిక్ ధృవీకరణ; ప్రణాళిక, పర్యవేక్షణకు భౌగోళిక సమాచార సాంకేతికత; రియల్‌టైమ్ పర్యవేక్షణకు మొబైల్ యాప్ ఆధారిత డ్యాష్‌బోర్డులు; వారానికోసారి ప్రజలకు వెల్లడించే సమాచార వ్యవస్థ. ఈ చర్యల ద్వారా పనిచేయకుండానే చెల్లింపులు, నకిలీ లావాదేవీలు, ఉపయోగం లేని పనులు పూర్తిగా తొలగిపోతాయి.

■ లంకా దినకర్
చైర్మన్, ఇరవై సూత్రాల కార్యక్రమం



3వ ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, జస్టిస్ బులుసు శివ శంకరరావు, కేంద్రమంత్రి పెమ్మసాని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

ఉచితాలతో తీవ్ర నష్టం

- మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు



గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉచిత పథకాలతో ప్రభుత్వంతో పాటు ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో మన తెలుగు భాష - అమృత భాషా సభలో ఆయన ముఖ్య అతిథి ప్రసంగించారు. ఉచితాలకు ప్రజలను అలవాటు చేస్తే ఆ వ్యవస్థ ఎక్కువ కాలం మనుగడ సాధించదన్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉన్నాయనే భ్రమలోనే ప్రజలు ఉంటున్నారన్నారు. ఉచిత బస్సు మహిళలు అడగలేదని.. ఏ కారణంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు అధికంగా ఉంటే విద్య, వైద్య ఉచితంగా ఇవ్వాలని సూచించారు. తెలుగు భాష గురించి అనేకమార్లు వేదికలపై ప్రసంగిం చానని, ఎన్నిసార్లు చెప్పినా భాష బతకాలంటే ప్రతి ఒక్క రూ ఇంటిలో, కుటుంబ సభ్యులతో మాతృ భాషలోనే మాట్లాడటానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పెద్దలతో మాట్లాడితే తెలుగు భాష మాధుర్యం తెలుస్తుందని, దురదృష్టవశాత్తు పిల్లలు తెలుగు భాషలో మాట్లాడితే..

(మిగతా 8లో)



తెలుగు మహాసభలకు హాజరైన ప్రజలు

తెలుగుకు పట్టాభిషేకం

- వైభవంగా ముగిసిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలు
- హాజరైన సీఎం చంద్రబాబు, జస్టిస్ ఎన్‌వీ రమణ..
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, పలువురు మంత్రులు
- తిరుగు ప్రయాణమైన దేశ, విదేశాల తెలుగు భాషాప్రియులు



గుంటూరు సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సాహిత్య పరంపర అక్షర వారసత్వాన్ని ప్రపంచ పటం పై మరోసారి ఘనంగా ప్రతిష్ఠిస్తూ నిర్వహించిన గుంటూరులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్తు మూడో ప్రపంచ తెలుగు మహా సభలు సోమవారం అత్యంత వైభవోపేతంగా ముగిశాయి. శతాబ్దాల సాంస్కృతిక సౌరభాన్ని, వాగ్మయ వైభవాన్ని, భావవైచి త్ర్యాన్ని ఏకకాలంలో ఆవిష్కరించిన ఈ మహోత్సవం కేవలం ఒక భాషా సభగానే కాకుండా, తెలుగు జాతి ఆత్మగౌరవానికి అద్దం పట్టిన చారిత్రక ఘట్టంగా నిలిచింది. మూడు రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన ఈ మహా సభల్లో మారిషస్ దేశాధ్యక్షుడు ధరంబీర్ గోకుల్, సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులు, ప్రముఖ పరిపాలనా అధికారులు, విశిష్ట మేధావులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొని సభలకు అపూర్వ శోభను సమకూర్చారు. న్యాయవ్యవస్థ నుంచి పాలన పీఠాల వరకు, సాహిత్యాసనాల నుంచి సాంస్కృతిక వేదికల వరకు తెలుగు భాషకు ఉన్న సమగ్ర గౌరవాన్ని ఈ మహాసభలు సాక్షాత్కరించాయి. భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాక ఒక జాతి సంస్కారానికి, సాంస్కృతిక చైతన్యానికి మూలాధారమనే సత్యాన్ని ఈ సభలు పదే పదే గుర్తుచేశాయి. తెలుగు భాష వికాసానికి ఎదురవుతున్న సవాళ్లు, మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్య పునరుత్థానం, నూతన తరం భాషా బాధ్యతలపై సాగిన చర్చలు మహాసభలకు గంభీర మైన ఆలోచనా లోతును అందిం చాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, కావ్య పఠనాలు, నాట్య సంగీత సమ్మేళనాలు, భాషా గౌరవాన్ని ప్రతిబింబించిన వేదికా కార్యక్రమాలు సభలంతటా తెలుగు వైభవానికి దర్పణంగా నిలిచాయి. తరతరాల వారసత్వాన్ని నూతన కాలానికి అనుసంధానించే ప్రయత్నంగా ఈ మహాసభలు రూపుదిద్దుకొని, తెలుగు భాష భవి ష్యత్ దిశకు స్పష్టమైన దారిదీపంగా నిలిచాయి. తెలుగు మహాసభలు, తెలుగు జాతి సాంస్కృతిక స్వాభిమానానికి..

(మిగతా 8లో)

మారిషస్, విశాఖలో తదుపరి తెలుగు మహాసభలు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్తు మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు సందర్భంగా తదుపరి సభలు జరిగే వేదికలను నిర్వాహకులు ప్రకటించారు. 2027 జనవరి 8, 9, 10 తేదీల్లో మారిషస్, 2029 విశాఖపట్టణంలో నాలుగు, ఐదు తెలుగు మహా సభలు నిర్వహిస్తామని వెల్లడించారు. అమరావతి రాజధానిలోని భాగమైన గుంటూరు మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు చక్కటి అతిథ్యమిచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు.







సాంస్కృతిక కార్యక్రమాలు



తెలుగు మహాసభలకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అసంపూర్ణం.. అంతరాయం

- మిర్చియార్డు వద్ద నత్తనడకన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- 10 రోజుల్లో మిర్చి సీజన్ ప్రారంభం
- లారీల రాకపోకలకు తప్పని తీవ్ర అంతరాయం



మిర్చియార్డు ఇన్‌వర్డ్ గేటు వద్ద నిర్మాణం పూర్తికాని ఫ్లైఓవర్ మధ్య భాగం

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి సీజన్ నాటికి నల్లపాడు రోడ్డులో మిర్చియార్డు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ మధ్యభాగం పూర్తి అసాధ్యంగా కనిపిస్తోంది. మధ్య భాగం పూర్తి చేసి లారీల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామని నేషనల్ హైవే అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు రెండు పిల్లర్ల మధ్యన శ్లాబు వేయడానికి అవసరమైన సెంట్రింగ్‌ని కూడా ఏర్పాటు చేయలేదు. అలానే సర్వీసు రోడ్డుని విశాలంగా మార్చలేకపోయారు. మరో పది రోజుల్లో మిర్చి సీజన్ ప్రారంభం కానుంది. కానీ, ఫ్లైఓవర్ పనులు మాత్రం నత్తనడకన కొనసాగడంపై మిర్చి రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి యార్డులోకి లారీలు నల్లపాడు రోడ్డులోని ప్రధాన గేటు నుంచి ప్రవేశిస్తాయి. సీజన్‌లో వందల సంఖ్యలో లారీలు, ట్రక్ ఆటోలు, ట్రాక్టర్లలో రైతులు మిర్చిని తీసుకొస్తారు. గతంలోనే సరుకు ఎక్కువ వచ్చిన రోజు దాదాపుగా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయి నల్లపాడు రోడ్డులో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఇప్పుడు ఫ్లైఓవర్ పనుల కారణంగా సమస్య మరింత జఠిలంగా మారే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వద్ద చర్చలు జరగగా.. మిర్చి సీజన్ నాటికి నల్లపాడు రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తామని ఆ శాఖ అధికారులు చెప్పారు. సర్వీసు రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించడంలో నిర్లక్ష్యం వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గం చూడాలి

ఫ్లైఓవర్ పనులు జాప్యం అవుతోన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అన్వేషించాల్సిన పరిస్థితి తలెత్తింది. గతేడాది యార్డులోని అన్ని గేట్లను తెరిచి కొంత ట్రాఫిక్ సమస్యని పరిష్కరించారు. ఈ సంవత్సరం చిలకలూరిపేట రోడ్డులో ఉన్న గేట్ల ద్వారా లారీలు లోపలికి వచ్చే ఏర్పాట్లు చేసుకోవాలి. లేకుంటే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి ఉత్పన్నమవుతుంది.




ఇరుకుగా మారిన సర్వీసు రోడ్డు

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు



ఉరుసు మహోత్సవాలకు సిద్ధమైన శ్రీ హజరత్ కాలే మస్తాన్‌షా దర్గా

గుంటూరు(తూర్పు) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 134వ ఉరుసు మహోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. సోమవారం దర్గా ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాబా సమాధిపై నూతన చాందిని అలంకరణ, రాత్రి గంధం ఊరేగింపు, 7న గంధం పంపిణీ, దీపారాధన, 8న ఖురాన్ పఠనం, బాబా వారి ప్రసాదం పంపిణీ, 9న ఫకీర్లకు బాబావారి శేష వస్త్రాల పంపిణీ, 10న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. వీటితో పాటు విశేషపూజలు, భక్తులకు నిత్య అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు.



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం

చేదుకో కోటయ్య.. చేరుకునేది ఎలాగయ్యా!

కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్ల ఊసెత్తని యంత్రాంగం

- 40 రోజుల్లో త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల
- రాష్ట్ర పండుగ హోదా కల్పించినా నిధుల కరువే
- ఏటా పండగ రోజు భారీగా ట్రాఫిక్ జామ్..
- రోడ్లు, వసతులు, ఏర్పాట్లలో దేవదాయశాఖ విఫలం

(కోటప్పకొండ, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) కోటప్పకొండ తిరునాళ్ల సమీపిస్తోంది. పోలీసు, దేవదాయ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువన, కొండ ఎగువన కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. స్వామిని భక్తులు సులువుగా..

(మిగతా 6లో)

> ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే తిరునాళ్ల దేశంలోనే ప్రసిద్ధి. లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పండగ రోజు కోటయ్య స్వామి తిరునాళ్ల జరగనుంది. ఏకాదశి రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీనికి ఇంకా 40 రోజులే సమయం ఉంది. అయినా.. తిరునాళ్ల ఏర్పాట్ల ఊసే అధికారులు ఎత్తడం లేదు. నేటి వరకు సమీక్షలు నిర్వహించలేదు. ఈ తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించినా.. ఏటా నిధులు విడుదల చేయడం లేదు. దీంతో దాతల విరాళాల పైనే వివిధ శాఖలు ఏర్పాట్ల కోసం ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

లక్షలాది మంది భక్తులు మహాశివరాత్రి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. కొండకు వేలాది వాహనాలు తరలి వస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరి వారి పాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ఏటా తిరునాళ్ళ సందర్భంగా ట్రాఫిక్ జామ్ ఆనవాయితీగా మా రింది. గతేడాది ట్రాఫిక్ ఇక్కట్లను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సైతం ఎదుర్కొన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.

బస్టాండ్ స్టాల్స్‌లో ఎమ్మార్పీ ఉల్లంఘన

- కనిపించని ధరల పట్టిక
- యథేచ్ఛగా అనధికార విక్రయాలు

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ స్టాల్స్‌లో ప్రయాణికులు ధరల దోపిడీకి గురవుతున్నారు. కొన్ని తినుబండారాల స్టాల్స్‌లో ఎమ్మార్పీ ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోంది. దీంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆయా ఫిర్యాదుల నేపథ్యంలో గతంలో విజిలెన్స్ సభ్యులు, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించి.. దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు ప్రకటించారు. రెండు రోజుల కిందట బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జి సాంబశివ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేసిన సందర్భంలోనూ నిబంధనలు పాటించని తీరు బట్టబయలైంది. ఎమ్మార్పీ ధరల పట్టికలు లేకపోవడం, కొన్ని దుకాణాల్లో అనధికారికంగా తినుబండారాలు విక్రయించడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని



ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని ఓ స్టాల్

వస్తువుల అమ్మకాలకు మాత్రమే అనుమతులు తీసుకొని ఇతర వస్తువులను కూడా విక్రయించడం వెలుగు చూశాయి. గతంలోనూ ఆర్టీసీలో ఓ యూనియన్ నాయకుడే ధరల దోపిడీకి గురవడంతో.. ఆగ్రహంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెనాల్టీ విధించడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు ఉదాసీన వైఖరి, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరశి బస్టాండ్‌లో స్టాల్స్ యజమానులకు ఉల్లంఘనలు అలవాటుగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్టాల్స్‌లో ఎమ్మార్పీ పట్టిక ఏర్పాటు చేయాలి. టెండర్‌లో పేర్కొన్న వస్తువులను మాత్రమే విక్రయించాలి. కొందరు స్టాల్స్ యాజమానులతో అధికారులు కుమ్మక్కై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులూ లేకపోలేదు. రూ.20 కూల్ డ్రింక్స్ బాటిల్‌కు రూ.30లు వసూలు చేస్తున్నారు. ఇక వాటర్ బాటిల్స్‌లోనూ అంతే అదనంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువునా దోపిడీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో స్టాల్స్ వ్యాపారుల దందా మూడు బిస్కెట్ ప్యాకెట్లు, ఆరు వాటర్ బాటిల్స్ అన్నట్లుగా ఉంది. ఇక బస్టాండ్‌లో తాగునీటికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కావాల్సిన బ్రాండ్ల వాటర్ బాటిళ్లు ఇక్కడ దొరకవు.. ఏదో నాసిరకం కంపెనీల వాటర్ బాటిల్స్ పెట్టి విక్రయిస్తున్నారు. బస్టాండ్‌లో గతంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు మూలన పడ్డాయి.

ఆకస్మిక తనిఖీలతోనే..

బస్టాండ్‌లో గతంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకపోవడంతో కొందరు స్టాల్స్ యాజమానులు చెప్పిందే ధరగా సాగుతోంది. ఆకస్మిక తనిఖీలు చేస్తేనే దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనకు చెక్ పడుతుందని ప్రయాణికులు అంటున్నారు.

తేనేటీగల పెంపకంపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

లాంఫాం(తాడికొండ)జనవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు, రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆన్‌లైన్‌లో తేనేటీగల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సును చేపట్టిందని రిజిస్ట్రార్ డాక్టర్ ఎంజీ రమణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తేనెటీగల పెంపకంతో పాటుగా, చిరుధాన్యాలు - ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, సేంద్రీయ సూత్రీకరణ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2 నెలల కోర్సుకు, రూ.1,500 కోర్సు ఫీజును చెల్లించాలన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, ఐపాడ్‌లు ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 80960 85560 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.

శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి వారి దేవస్థానము
పొన్నూరు పట్టణం, గుంటూరు జిల్లా, ఫోన్ : 08643-247099
ఇ-టెండరు కమ్ సీల్డు టెండరు ప్రకటన

గుంటూరు జిల్లా, పొన్నూరు పట్టణము నందు వేంచేసియున్న శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి వారి దేవస్థానము వినియోగార్థం 2026-27 సవత్సరమునకు ఈ దిగువ తెలిపిన ఐటమ్‌ల సప్లయ్‌కి గాను ప్రభుత్వ రంగ సంస్థలు, హోల్‌సేల్ వర్తకులు, సూపర్ బజారుల వారల నుండి 'ఇ' టెండరు లేదా సీల్డు టెండర్లు మరియు దేవస్థానమునకు చెందిన 60X40 సైజు గల ఎ1 షాపును అద్దె కొరకు 2026-28 వరకు ఇ-టెండర్లు, సీల్డు టెండర్లు, బహిరంగ వేలము జరుగును. 'ఇ'-టెండర్లు దాఖలు చేయువారు ది. 06.01.2026 నుండి https//tender.apeprocurement.gov.in ద్వారా వివరములు తెలుసుకోనవచ్చును. టెండర్లు దాఖలు చేయవచ్చును. సీల్డు టెండర్లు దాఖలు చేయువారు దేవాలయ కార్యాలయము నందు టెండరు షెడ్యూలు ది. 18.01.2026 సాయంత్రం గం. 5.00ల లోపు కొనుగోలు చేసి పూర్తి చేసిన టెండర్లు ది. 19.01.2026 సాయంత్రం గం.5.00ల లోపు దేవస్థాన కార్యాలయము నందు గల టెండరు బాక్స్ నందు దాఖలు చేయవలెను. ది. 20.01.2026 ఉదయం గం.11.00లకు టెండర్లు తెరువబడును. 1. షెడ్యూలు దాఖలా సరుకుల సప్లయ్ టెండరు షెడ్యూలు రేటు రూ. 2000/-లు, డిపాజిట్టు రూ. 1,00,0000/-లు, 2. ఎ1 షాపునకు టెండరు షెడ్యూలు రేటు రూ. 2,000/-లు, డిపాజిట్టు రూ.1,00,0000/-లు, 3. పూలు, దండలు సప్లయ్ చేయుటకు, 4. ఎలక్ట్రికల్ సామానులు సప్లయ్ చేయుటకు, 5. నూతన వస్త్రములు సప్లయ్ చేయుటకు, 6. పుస్తకములు వగైరాలు ప్రింట్ చేయుట, పై టెండర్లకు టెండరు షెడ్యూలు రేటు రూ. 500/- లు, డిపాజిట్టు రూ. 1,000/- లు చెల్లించవలెను.

టెండరు షరతులు ఇతర వివరములు కొరకు పై దేవస్థానం కార్యాలయము నందు సంప్రదించగలరు.

స్థలము :పొన్నూరు
తేది. 06.01.2026

సం/- జి.వి. అమర్‌నాథ్,
కార్యనిర్వహణాధికారి



ఉద్యోగావకాశాలు

➾ రియల్ ఎస్టేట్ కంపెనీలో లేడి టెలికాలర్స్ కావలెను. ఆఫీస్ టైమింగ్స్ 10am to 5pm. Salary : 10k to 15k PM అడ్రస్ : బ్రాడీపేట, 2/12, Phone : 9493049444
AJG-277206

➾ TATA కంపెనీ లో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్స్ కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. సంప్ర॥ 94908 66938.
AJG-239745

రియల్ ఎస్టేట్

➾ నూతన సంవత్సర శుభాకాంక్షలు, గుంటూరు జిల్లాలో శ్రీ భమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్ మీ లతీష్ గౌడ్, సెల్: 9848986831
SJAA-347

PLOT FOR SALE

➾ అతి తక్కువ ధరకే గుంటూరు జిల్లా, అంగలకుదురులో నాలుగు సెంట్లు స్థలం అమ్మకానికి కలదు. ఒక సెంట్ 5 లక్షలు. సంప్ర॥ 9515520741.
AAA-10423

మీ సర్టిఫికెట్స్ పోయినవా?

➾ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్: 98491 85616.
AJG-277033

CHANGE OF NAME

CHANGE OF SURNAME

➾ **I Called POTHURI RUKMINI (OLD SURNAME)** to **POTTURI RUKMINI (NEW SURNAME)** W/o.Potturi Narayana Babu Resident of Flat No.301, Devapuram, 2nd Line, Bommarillu Apartments, Guntur, Guntur Dist-522002, Andhra Pradesh. I have Changed my SURNAME to POTTURI RUKMINI W/o. Potturi Narayana Babu, Here after my SURNAME is known as POTTURI RUKMINI
AJB-259923

CHANGE OF SURNAME

➾ I Called POTHURI NARAYANA BABU (OLD SURNAME) to POTTURI NARAYANA BABU (NEW SURNAME) S/o. Potturi Veera Raghavaiah Resident of Flat No.301, Devapuram, 2nd Line, Bommarillu Apartments, Guntur, Guntur Dist-522002, Andhra Pradesh. I have Changed my SURNAME to POTTURI NARAYANA BABU S/o. Potturi Veera Raghavaiah, Here after my SURNAME is known as POTTURI NARAYANA BABU
AJB-259924

CHANGE OF SURNAME

I Called POTHURI SRINIVASA NAGA VENKATA KRISHNA KISHORE (OLD SURNAME) to POTTURI SRINIVASA NAGA VENKATA KRISHNA KISHORE (NEW SURNAME) S/o.Potturi Narayana Babu Resident of Flat No. 301, Devapuram, 2nd Line, Bommarillu Apartments, Guntur, Guntur Dist-522002, Andhra Pradesh. I have Changed my SURNAME to POTTURI SRINIVASA NAGA VENKATA KRISHNA KISHORE S/o. Potturi Narayana Babu, Here after my SURNAME is known as POTTURI SRINIVASA NAGA VENKATA KRISHNA KISHORE
AJB-259922

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➾ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 83338 33368
AJB-259987

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 91103 23914
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 97048 67908
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ :
99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

అర్బన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

● 21వ బ్రాంచ్‌ను వినుకొండలో ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలను వినుకొండ ప్రజలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు. వినుకొండ పట్టణం లాయర్ స్ట్రీట్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ బ్యాంకు 21వ బ్రాంచ్‌ను సోమవారం అర్బన్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాస యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు 70 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. పట్టణ ప్రాంత ప్రజలకు ఎంతో మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. బ్యాంకు చైర్మన్ శ్రీనివాసయాదవ్ బ్యాంకు అభ్యున్నతికి అందించిన సేవలు ఎనలేనివన్నారు. 15 ఏళ్ల క్రితం 8 బ్రాంచ్‌లుగా ఉన్న బ్యాంకు సంస్థకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస యాదవ్ 10 ఏళ్లలో 21 బ్రాంచ్‌లను చేసి దినదినాభివృద్ధికి కృషి చేశారన్నారు. రూ.380 కోట్లు టర్నవర్ ఉన్న బ్యాంకును 10 ఏళ్లలో రూ.1,100 కోట్లకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. నగదు డిపాజిట్‌పై అన్ని బ్యాంకులు కంటే 3శాతం అదనంగా వడ్డీ, తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళి యాదవ్, కూటమి నాయకులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో అంతర్జాతీయ నాటక మహోత్సవం

● వచ్చే నెల 6, 7, 8, 9,10 తేదీల్లో నిర్వహణ





వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

యడ్లపాడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : భారత్ రంగ్ అంతర్జాతీయ 25వ నాటక మహోత్సవానికి గుంటూరు వేదిక కానుంది. తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక), యడ్లపాడు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్‌ఎస్‌డీ) సంయుక్తంగా ఈ నాటక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 6, 7, 8, 9, 10 తేదీల్లో ఈ మహోత్సవాలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదిక కానుంది. నాటక మహోత్సవం ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు సోమవారం వెల్లడించారు. ప్రజా సమస్యలే ఇతివృత్తంగా, తెలుగుదనాన్ని తెలియచేసే తెలుగు నాటక రంగ గొప్పతనాన్ని, ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేసేందుకు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) శ్రీకారం చుట్టిందన్నారు. నాటి సాంప్రదాయాల్ని నేటి సాంకేతిక పరిజ్ఞానంతో మేళవించి నూతన సాంస్కృతిక విధానాలతో భవిష్యత్ ప్రయోగాలకు నాంది పలకడమే వేదిక లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో మొదటిసారి విద్యుత్ చార్జీల తగ్గింపు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా



మాట్లాడుతున్న టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా

నరసరావుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ చార్జిలు తగ్గింపు అనేది మొదటిసారిగా కూటమి ప్రభుత్వంలో చూస్తున్నామని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షేక్ జానీ సైదా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జిలు భారం తగ్గించి కూటమి ప్రభుత్వం ప్రజలను ఆదుకుంటుందన్నారు. ట్రూఅప్ చార్జిల భారం ప్రజలపై వేయకుండా రూ.4500 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ట్రూ అప్‌చార్జిలు పేరుతో 11 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. వినియోగదారులపై విపరీతమైన ఆర్థిక భారాన్ని మోపిందన్నారు. సీఎం చంద్రబాబానాయుడు విద్యుత్ చార్జిలు తగ్గించి కోనుగోళ్లలో రూ.వేయి కోట్లు ఆదా చేసిందన్నారు. ట్రూఅప్ చార్జిలు తగ్గించడం చేతకాని వైసీపీ చేసే విమర్శలను ప్రజలు ఛీత్కరించుకుంటన్నారన్నారు.

చేదుకో కోటయ్య.. చేరుకునేది ఎలాగయ్యా!



నిరుపయోగంగా దాతలు విరాళంగా ఇచ్చిన ఈ ఆటో



మూసివేసిన దాతలు నిర్మించిన అన్నదాన మండపం

(5వ పేజీ తరువాయి)

దర్శించుకొనేందుకు పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. కానీ, ఆ దిశగా దేవదాయశాఖ చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు.

నిధులు ఎలా.. ?

తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల జరగటం లేదు. తిరునాళ్ళకు ప్రభుత్వం ప్రత్యేక పండుగ హోదా కల్పించింది. కానీ కొన్నేళ్లుగా నిధులు విడుదల చేయడం లేదు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మాత్రమే రూ.10 వేలు విడుదల చేసి చేతులు దులుపుకుంటోంది. ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా సమీక్షా సమావేశాల్లో నిధుల సమస్యలను ప్రస్తావిస్తున్నా.. శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభిస్తేనే సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

ఆరుద్రోత్సవ ఏర్పాట్లలో విఫలం

ఇటీవల జరిగిన ఆరుద్రోత్సవం ఏర్పాట్లు చేయడంలో దేవస్థాన వర్గాలు విఫలమయ్యాయి. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఇక్కట్లు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లు ఎలా ఉంటాయోనన్న సందేహం భక్తుల్లో నెలకొంది.

భక్తుల విరాళాలు ఇచ్చారు.. వినియోగం మరిచారు

దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన మండపం నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన తేళ్ల శ్రీధర్, సుధాకర్ విరాళాలు ఇచ్చారు. మండపం ప్రారంభించినా.. వినియోగించడాన్ని దేవస్థానం విస్మరించింది. ఇంకా పాత అన్నదాన మండపంలోనే భక్తులకు అన్నదానం చేస్తున్నారు. కొత్త అన్నదాన మండపానికి తాళం వేశారు. భక్తులు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ-ఆటోను విరాళంగా దాతలు దేవస్థానంకు అందజేశారు. దీనినీ వినియోగించడం లేదు. ఆటో పనిచేయడంలేదని దేవస్థానం అధికారులు తెలిపారు. అయితే పనిచేయని ఆటో విషయం దాతల దృష్టికి తీసుకువెళ్లితే ఆటోను పునరుద్ధరించే అవకాశం ఉన్నా.. ఈ దిశగా దేవస్థానం వర్గాలు స్పందించడం లేదు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

మాచర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని రామా టాకీస్ లైన్ ఆంధ్ర బ్యాంకు ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పట్టణంలోని 13వ వార్డుకు చెందిన అడిగొప్పుల శ్రీనివాసరావు (55) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం నాలుగో ఫ్లోర్‌లో నీరు కొడుతుండగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసరావును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించేది రైతులే

● రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి



గ్రామసభలో మాట్లాడుతున్న డైరెక్టర్ భూలక్ష్మి

దుగ్గిరాల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందించగలిగేది రైతులేనని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం దుగ్గిరాల గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న భూలక్ష్మి మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో పంటలు పండించడం ద్వారా.. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. విచక్షణ రహితంగా పురుగు మందులు చల్లి పెంచిన పండ్లు, కూరగాయలు ఒకటి, రెండు రోజులకే చెడిపోతున్నాయన్నారు. తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందిస్తే.. సంపద షెడ్లకు తరలించి వర్మికంపోస్ట్ తయారుచేసి గ్రామ ప్రజలకు అందించవచ్చన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసనేని శ్రీఅనిత మాట్లాడుతూ.. స్వచ్ఛ దుగ్గిరాలగా గ్రామానికి అవార్డు తెచ్చిపెట్టిన అధికారులు, నాయకులను స్ఫూర్తిగా తీసుకుని.. స్వచ్ఛ దుగ్గిరాల మండలంగానూ తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మంత్రి నారా లోకేశ్ స్వచ్ఛ మంగళగిరి చేసేందుకు.. ప్రౌడ్ ఆఫ్ మంగళగిరి కింది అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. డీఎల్‌డీఓ కుసుమశ్రీదేవి, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, పీ-4 రాష్ట్ర కమిటీ సభ్యుడు జంపాల సుబ్బారావు , మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, సర్పంచ్ బాణావత్ కుషీబాయి, వల్లూరు నరసింహారావు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి మడుగులో విద్యార్థి మృతదేహం

● బలమైన గాయాలు

● హసానాబాద్‌లో బాలుడి హత్య? కలకలం

క్రోసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసానాబాద్ సమీపంలోని కొండల్లో షేక్ ముజావర్ ఖలీల్(11) అనే బాలుడి మృత దేహాన్ని కనుగొన్నారు. ఖలీల్ హసానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఘటనా స్థలంలో కత్తి లభ్యం కావటం, మృత దేహంపై బలమైన గాయాలు ఉండటంతో ఖలీల్‌ను ఎవరో హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృత దేహం కొండల్లోని నీటి మడుగులో పడి ఉంది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు మీడియా సమావేశంలో వెల్లడించిన కథనం మేరకు.. షేక్ ముజావర్ ఖలీల్, మరో ఇద్దరు స్నేహితులు కలసి సమీపంలోని కొండ గుట్టలు ఉన్న ప్రదేశానికి రేగి కాయల కోసం ఆదివారం వెళ్లారు. కొంత సేపటికి ఇద్దరు స్నేహితులు తాము వెళ్తున్నామని ఖలీల్‌తో అన్నారు. వారిని వెళ్లమని.. తాను తరువాత వస్తానని మృతుడు ఖలీల్ చెప్పాడు. తరువాత ఖలీల్ కానరాలేదు. సోమవారం ఉదయం కొండల్లోని నీటి ముడుగులో ఖలీల్ మృత దేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పరిశీలించగా బలమైన గాయాలు, కత్తితో బలంగా పొడిచినట్టు ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. ఘటనా స్థలంలో కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు. బాలుడితో ఎవరో ఘర్షణ పడి బలంగా కత్తితో గాయ పరిచినట్టు భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో అనుమానాస్పదంగా కొందరు సంచరించినట్టు కూడా ఆధారాలు లభించాయన్నారు. బాలుడిని ఎవరు హత్య చేశారు అనేది.. మిస్టరీగా ఉందని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరించినట్లు వెల్లడించారు. పూర్తి దర్యాప్తు చేసి తదుపరి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఖలీల్‌తో పాటు రేగి కాయలు కోసం వెళ్లిన మృతుడి స్నేహితులను కూడా ప్రశ్నించారు. గ్రామస్తులు దీనిని హత్యగా భావిస్తున్నారు. పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్ఐ పి.రవి బాబు ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ వెంకట్రావు

గంజాయి కట్టడికి ప్రత్యేక నిఘా

● ఏడుగురు నిందితుల అరెస్టు

● గురజాల డీఎస్పీ జగదీష్

పిడుగురాళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గురజాల డివిజన్ పరిధిలో గంజాయి సాగు, విక్రయాలపై పటిష్ట నిఘా పెట్టినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం పిడుగురాళ్లలోని కళ్లం టౌన్‌షిప్ సమీపంలో కొందరు గంజాయితో ఉన్నారన్న సమాచారంతో ఆకస్మికదాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. పట్టణానికి చెందిన వెన్ను తిరుమలరావు, సాదుపాటి రాజేష్, నూన్సావత్ శివకుమార్‌నాయక్, సాదుపాటి గోపి, షేక్ బాబావలి, తాడిమళ్ల దివ్యబాల, డేగల శిరీష, స్కూటీని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. దాచేపల్లికి చెందిన సాకేటి తిరుపతి నారంనాయుడు, పిడుగురాళ్లకు చెందిన మామిడిశెట్టి మణికంఠ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వివరించారు. ఒడిశా, విశాఖపట్టణం ప్రాంతాల్లో కేజీ రూ.5 వేలకు గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ రూ.10 వేలకు విక్రయిస్తున్నారని, పది గ్రాముల ప్యాకెట్ రూ.300 అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. సీఐ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, నాగరాజు, సిబ్బందిని అభినందిస్తూ రివార్డుకు సిఫార్సు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ దంపతులతో వేదపండితుల బృందం

నృసింహుని సేవలో మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్

మంగళగిరి సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మారిషస్ దేశాధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ సోమవారం ఉదయం సతీసమేతంగా మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. ఎగువ సన్నిధిలో దేవదాయ శాఖ అధికారులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పానకాల నృసింహస్వామికి పానకం నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ధరంబీర్ గోకుల్ దంపతులు దిగువ సన్నిధిలో లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో వేదపండితులు ఆశీర్వచనాలను అందజేసి.. క్షేత్ర మహత్యాన్ని వివరించారు. అధికార యంత్రాంగం దేవస్థానం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, దేవదాయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్, ఈవో కె.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

రొంపిచర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామిరెడ్డిపాలెం సమీపంలో సోమవారం తెల్లవారు జామున విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. లారీలో అక్రమంగా రవాణా అవుతున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ షాపులకు వచ్చిన బియ్యాన్ని యధాతదంగా లారీలోకి లోడుచేశారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బియ్యం లారీని రొంపిచర్ల పోలీసులకు అప్పగించారు. విజిలెన్స్ అధికారులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

వంద అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ



తాలూకా సెంటర్‌లో జాతీయ జెండాను ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి, ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు

సత్తెనపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండాను సోమవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు, భీమినేని వందనాదేవి, తాతా జయ ప్రకాష్ నారాయణ, కోమటినేని శోభారాణి, దరువూరి నాగేశ్వరరావు, చల్లంచర్ల లక్ష్మీతులసీ, అంకాళ్ళ ప్రభుదాసు, పూజల వెంకట కోటయ్య, చలపతిరావు, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్చియార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	49,746
అమ్మకాలు	45,171
నిల్వ	9,810

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	18000
నెంబరు. 5	12000	17000
273	---	----
341	11000	18500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	18000
దేవనూరు డీలక్స్	11000	19000
ఆర్మూరు	10000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	11000	16000
273	----	----
341	11000	18000
4884	-----	-----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
బ్యాడిగి 355	10000	17000
దేవనూరు డీలక్స్	-----	-----
తాలుకాయలు	5000	8500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00


కార్యకర్తలతో ఎమ్మెల్యే నసీర్

కార్యకర్తల త్యాగాలతోనే టీడీపీ బలోపేతం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎండనక, వాననక పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి కార్యకర్త కృషి వెలకట్టలేనిదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కార్యకర్తల త్యాగం, కష్టం, అంకితభావాన్ని గౌరవిస్తూ సోమవారం సాయంత్రం తూర్పు కార్యాలయంలో కార్యకర్తల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలను ఎమ్మెల్యే స్వయంగా సత్కరించి ఉత్తమ కార్యకర్తల సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తెలుసుకొని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలమన్నారు.

చైతన్యంతోనే హిందూ ధర్మపరిరక్షణ

గుంటూరు(తూర్పు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందువులలో చైతన్యం మరింతగా పెంపొందించాలని అప్పుడే ధర్మ పరిరక్షణ జరుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ప్రచార విభాగ ప్రముఖ్ అవ్వారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సంపత్‌నగర్, రామనామ క్షేత్రంలో సోమవారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. దేశంలో వివిధ రూపాలలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి హిందూ సమాజం జాగురుకులై ఉండాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా దేశ సమైక్యతకు సమర్ధవంతమైన కీలకపాత్ర పోషించిందంటే యువతే కారణమన్నారు. విశిష్ట అతిథిగా శివశక్తి వ్యవస్థాపకుడు సుగ్గన కరుణాకర్ మాట్లాడుతూ ఇటువంటి సమ్మేళనాలతో హిందువుల మధ్య ఐక్యత మరింతగా పెరుగుతుందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణురాలు యద్దనపూడి అనురాధ మాట్లాడుతూ పిల్లలకు ధర్మాచరణపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు. రామనామక్షేత్రం కార్యదర్శి లీలా సుందరి మాట్లాడుతూ క్షేత్రం వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జరిగే ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు భారతి స్వామి మాట్లాడుతూ ధర్మాచార్యుల సూచనలను పాటిస్తూ ధర్మం వైపు సమాజం పయనించాలన్నారు. కార్యక్రమాన్ని పత్రి వేణుగోపాల్ సమన్వయం చేయగా, జాగు శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్ర, అప్పిశెట్టి రంగారావు, రావిపాటి సాంబశివరావు, కపిలవాయి బద్రీనాధ్ తదితరులు వ్యవస్థల నిర్వహణ జరిపారు.



మాట్లాడుతున్న అవ్వారి శ్రీనివాసరావు, వేదికపై హిందూ సంఘ నాయకులు

టీడీపీ కార్యకర్తకు నిత్యావసరాలు అందజేత

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 23వ డివిజన్ తెలుగుదేశం సీనియర్ నాయకుడు వేశపోగు యోహాను ఆరోగ్య సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతోన్న నేపథ్యంలో కాపు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాస్, శ్రీ సాయినాద్ ఓల్డ్ ఏజ్ హోమ్ సొసైటీ ఛైర్మన్, కాపునాయుడు యూత్ అధ్యక్షుడు తులసీ అరుణ్, టీడీపీ జిల్లా కార్యదర్శి, కాపు నాడు మహిళా పశ్చిమ అధ్యక్షురాలు గంటా మౌళికలు అండగా నిలిచారు. యోహాను కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులు అందించి తాము అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంటా పెద్దబ్బాయ్, తోట అక్కి, అనిశెట్టి నాగేశ్వరరావు, వడ్డేగూడెం గోపి, పులి పృథ్వీరాజ్ తదితరులున్నారు.

బ్రెయిన్ బీ క్విజ్ పోటీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య), జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో సైతం జాతీయ స్థాయిలో రాణించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. అమరావతి రీజినల్ బ్రెయిన్ బీ 2026 ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో నిర్వహించిన బ్రెయిన్ బీ క్విజ్ పోటీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు వై.జితేంద్ర సాయి, ఎ.రిషిక్ సాయి ప్రణవ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థులను రామకృష్ణ అభినందించారు. ఆయన మాట్లాడుతూ జితేంద్ర సాయి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రిషిక్ సాయి ప్రణవ్ రెండో స్థానంలో నిలిచారని చెప్పారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 36 గంటల ఏఐ హ్యాకథాన్

గుంటూరు విద్య, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, పైథాన్ గురు, సూపర్విటీ సంస్థల సహకారంతో 36 గంటల పాటు నిర్వహించిన 'ఏఐ హ్యాకథాన్' విజయవంతంగా ముగిసిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుంచి సుమారు 300 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలు విజ్ఞాన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిరంతరంగా 36 గంటల పాటు కొనసాగగా, విద్యార్థులు కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ ఆధారిత సమస్యలకు వినూత్న పరిష్కారాలను ప్రతిపాదించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

లాలాపేట చిన్న మౌలా పంజాలో ఉరుసు

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): లాలాపేటలోని చిన్న మౌలా పంజా అషుర్‌ఖానాలో హజరత్ సయ్యద్ షా ఔలియా దర్గా షరీఫ్, హజరత్ సిద్దిక్ బాబా, సిద్దిక్ అమ్మజాన్ దర్గాలో ఉరుసు మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గా ముతవల్లి షేక్ ఖాదర్‌బాబా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. దర్గాకు ప్రత్యేక అలంకరణలతో నూతన శోభను తీసుకొచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ యూసుఫ్, కాలీంబేగ్, షేక్ మీరా, షఫీ తదితరులున్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

● డీఆర్వో ఖాజావలీ ● పీజీఆర్ఎస్‌కు 385 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలీ, డ్వామా పీడీ శంకర్ తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను డీఆర్వో ఖాజావలీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డ్వామా పీడీ శంకర్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మితో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లో 173, ఇతర సమస్యలపై 212 మొత్తం 385 అర్జీలు అందాయి. డీఆర్వో ఖాజావలీ మాట్లాడుతూ ఆన్‌లైన్, విడిగా అందుతున్న ప్రతి అర్జీ పై ఆడిట్ పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయల కోఆర్డినేటర్ మోహనరెడ్డి, ఆర్డీవో శ్రీహరి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డీడీ సత్యనారాయణ చౌదరి, డీఎఫ్‌వో హిమశైలజ, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన పాల్గొన్నారు.

● చినకాకాని వద్ద ఉన్న వక్ఫ్ భూముల్లో ఏర్పాటు చేస్తున్న ఇండిస్ట్రియల్ ఐటి పార్క్, ఎకనామిక్ కారిడార్‌పై ముస్లీం పెద్దలతో చర్చలు జరపాలని కోరుతూ ముస్లిం సమైఖ్య వేదిక ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ఈ భూములపై అభిప్రాయ సేకరణకు రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వేదిక అధ్యక్షుడు సలావుద్దీన్, చందన్, బాషా, వలీ తదితరులు ఉన్నారు.

● సరైన ప్రత్యామ్నాయం చూపకుండా స్థానిక కాకుమానువారితోటలో కార్మిక శాఖకు సంబంధించిన స్థలంలో యానాదుల నివాసాలను తొలగిస్తున్నారని ప్రజా, దళిత సంఘాల నాయకులు డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. మరోచోట నివాసాలను ఏర్పాటు చేసి, వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జూపూడి శ్రీనివాసరావు, ముత్తయ్య, నల్లపు నీలంబరం తదితరులు ఉన్నారు.

● ప్రకృతి వ్యవసాయంతో ఉపాధి పొందుతున్న రైతులకు రూ.10 వేలు అందజేయాలనే కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ఈ పంటలకు ల్యాబ్ పరీక్షలు నిర్వహించి రైతులకు సర్టిఫికెట్‌లు అందించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు, రైతులు ఉన్నారు.


జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నగర మేయర్ రవీంద్ర తదితరులు

కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో సంక్రాంతి సంబరాలు

గుంటూరుకార్పొరేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొరిటిపాడు వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజీ ఆధ్వర్యంలో ట్రాక్‌లో సంక్రాంతి సంబరాలు రెండు రోజులు పాటు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ముగ్గులు, నడక, మహిళల మ్యూజికల్ ఛైర్ పోటీలు, భోగీ మంటలు, పిల్లలకు భోగీ పండ్లు పోయటం, గంగిరెద్దుల నృత్యాలు, హరిదాసు భజన, కోలాట కార్యక్రమం జరిగాయి. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర చేతుల మీదుగా బహుమతి ప్రదానాలు చేశారు. అనంతరం ట్రాక్ నందు నూతనంగా నిర్మించిన జిమ్ బిల్డింగ్ ఓపెనింగ్ చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు 10 రోజుల ముందే ఇక్కడ తేవటం ఆనంద దాయకం అని తెలిపారు.. వద్రాణం హరిబాబు మాట్లాడుతూ పల్లెటూరి వాతావరణం కనిపించేలా సంక్రాంతి సంబరాలు చేయటం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్. కమిటీ కార్యవర్గం సెక్రటరీ బెజవాడ శివరామకృష్ణరెడ్డి, కోటేశ్వరరావు, గంగాధర్, గురుపాదం, శింగంశెట్టి కోటేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు, కందుల వెంకయ్య పాల్గొన్నారు.

చుట్టుగుంట వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు


ప్రమాణస్వీకారం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చుట్టుగుంట వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం పోలేరమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తుమ్మల నాగేశ్వరరావు, సూరసాని వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా గోళ్ళ ప్రభాకరరావు, ట్రెజరర్‌గా నాగిశెట్టి రమేష్, ఉపాధ్యక్షులుగా అడుసుమల్లి శ్రీధర్, కామినేని రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీలుగా మద్దు శ్రీనివాసరావు, కేవీ రంగనాధ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా మరో 21 మందిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ ను ప్రభుత్వ పెద్దలతో పాటు ప్రైవేటు సంస్థల సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వాకర్స్, సభ్యులు ఉన్నారు.

ఏపీ యూఎస్ డైరీ ఆవిష్కరించిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు (విద్య) జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీ యూఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మ, డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఏ బీసీ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి

ఆంజనేయులు సేవలు ఎనలేనివి : అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇటు రాజకీయంగానే కాక వర్తక వాణిజ్య విభాగాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక రంగాలలో కూడా చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రశంసించారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరాలులోని స్వగృహానికి వెళ్ళి ఆతుకూరి దంపతులను దుశ్శాలువా, పట్టు వస్త్రాలతో అప్పిరెడ్డి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవానంద్, పరిశపోగు శ్రీనివాసరావు, నాయకులు నాగిరెడ్డి, భాగ్యారావు, నర్సిరెడ్డి, సింగు నరసింహారావు, చిన్న, ప్రేమ్, శ్రీను నాయక్, సోము, గిరి తదితరులున్నారు.


ఆతుకూరి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

వేంకటేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి విరాళం


ఆలయ ఏసీ సుభద్రకు విరాళం అందజేస్తున్న దాతలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్‌లోని లాలాపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేయాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర వెల్లడించారు. గుంటూరు అరండల్ పేటకు చెందిన లంకే సనత్ కుమార్ దేవస్థాన పునర్నిర్మాణానికి సోమవారం రూ.1,05,116 అందజేసినట్లు ఆమె తెలిపారు.


అదుపులోకి తీసుకున్న వాహనంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగరం రైల్వే గేట్ వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని నడుపుతున్న బల్లాల అంజిబాబును అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా మరో వాహనాన్ని నడుపుతున్న కుంటిగర్ల ఏడుకొండలుని అదుపులోకి తీసుకుని 40 బస్తాలను స్వాధీనం చేసుకునానరు. మొత్తం 4.5 టన్నుల బరువున్న 90 బస్తాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి నుంచి 2 సెల్‌ఫోన్‌లు కూడా స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

సుమధురంగా మాండొలిన్ కచేరీ

గుంటూరు (తూర్పు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి 179వ ఆరాధన సంగీత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధాన కచేరీలలో భాగంగా ప్రముఖ విద్వాంసులు విశ్వాస్ హరి మాండొలిన్‌పై త్యాగరాజ కృతులను సుమధురంగా పలికించి సంగీతాభిమానులను అలరించారు. మృదంగంపై బుర్రా శ్రీరామ్, ఘటంపై కే.వీ. రామకృష్ణ సహకారంతో కచేరీ అత్యంత మధురంగా సాగింది. సంస్థ ఉపాధ్యక్షుడు గిరిజాశంకర్ కార్యదర్శి కృష్ణకిషోర్ కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేసిన ట్రంప్ సుంకాలు

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల విధించిన సుంకాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 2025 సంవత్సరం జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల విశ్లేషణ సభ ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రంప్ సుంకాలతో భారత దేశంలో రొయ్యలు, దుస్తుల తయారీ పరిశ్రమలతో పాటు వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ ఆంక్షల వలన భారత విద్యార్థులు నష్టపోయారని, ఉపాధి కల్పనలో నష్టం జరిగిందన్నారు. అమరావతి రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గూడవల్లి నాగేశ్వరరావు, విద్యావేత్త ఆర్వి సింగరయ్య, దయాసాగర్, విశ్లేషకులు ఇ చంద్రయ్య తదితరులున్నారు.


ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో మిమిక్రీతో అలరించిన ఆర్టిస్టు కాసుల కృష్ణంరాజును పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వికాస్ హాస్పటల్స్ చైర్మన్ గళ్ళా రామచంద్రరావు


పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గును పరిశీలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వికాస్ హాస్పటల్స్ చైర్మన్ గళ్ళా రామచంద్రరావు తదితరులు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యేల ఘన స్వాగతం

● నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఏటుకూరు బైపాస్ రోడ్డులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక ప్రాంగణంలో జరుగుతున్న మూడో తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు సోమవారం గుంటూరు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆమె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీతో మహాసభల ప్రాంగణానికి తరలివెళ్లారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. తదనంతరం ముఖ్యమంత్రితో కలిసి ఆమె సభలో పాల్గొన్నారు.



హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, మొహమ్మద్ నసీర్

సీఎంకు ఎమ్మెల్యే నసీర్ ఘన స్వాగతం

పరాయి భాషల హోరుకూ, పాశ్చాత్య జోరుకూ వెన్నుచూపని వెలుగు రేఖ తెలుగు భాష అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ప్రపంచ తెలుగు మహోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఆయన ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుండెను కలిపే శ్వాస తెలుగు భాష అని చెప్పారు. తెలుగు గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు మహాసభలు రేపటి తెలుగు వెలుగుకు తొలి పొద్దు అని అన్నారు. పిల్లలతో తెలుగులో మాట్లాడాలని సూచించారు.

ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మన్నవ


బొకే అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒక్క వేదికపైకి తీసుకువచ్చి, తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, వారసత్వ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించడమే ఈ మహాసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశవిదేశాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు, మేధావులు, యువత ఈ కార్యక్రమానికి హాజరై, మహాసభలను విజయవంతం చేశారని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన చైర్‌పర్సన్


సీఎంకు పూలు అందజేస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు సోమవారం గుంటూరు వచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పూల బొకేతో స్వాగతం పలికారు. నూతన సంవత్సరం వేళ మొట్టమొదటిసారి జిల్లాకు విచ్చేసిన సీఎంకు చైర్‌పర్సన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కుటుంబం గురించి సీఎం ఆరా తీశారు.

ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర, కుర్రా అప్పారావు

గుంటూరు(తూర్పు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ, ప్రాంగణంలో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికు గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలను అందజేశారు.



మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనడానికి గుంటూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.
- గుంటూరు (ఆంధ్రజ్యోతి)


అంజుమన్ ఆస్తుల పరిరక్షణకు ఐక్యతే మార్గం

● జమీయతుల్ ఉలమా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తీ బాసిత్

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అంజుమన్ ఇ ఇస్లామియా ఆస్తుల పరిరక్షణ ముస్లిం సమాజం సామాజిక బాధ్యత, దీనికి ఐక్యమే ప్రధాన మార్గమని జమీయతుల్ ఉలమా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తి బాసిత్ అన్నారు. నల్లచెరువు మదరసాల్లో జమీయతుల్ ఉలమా ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజుమన్ ఆస్తుల పరిరక్షణ అంశంపై ముస్లిం సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి మంగళవారం సాయంత్రం పోత్తూరువారి తోట రెండవ లైన్‌లోని మజ్లిసుల్ ఉలమా కార్యాలయంలో కీలక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ ఖాదర్, హాఫిజ్ ఆతికుర్ రహ్మాన్, అంజుమన్ ఇస్లామియా ట్రస్ట్ మాజీ సభ్యులు పర్వేజ్, ముస్లిం సమైక్య వేదిక నాయకులు అబ్దుల్ కలాం, యాసీన్ ఖాజావలి తదితరులున్నారు.


ఐక్యత చాటుతున్న ముఫ్తీబాసిత్, గులాం రసూల్ తదితరులు





తెలుగు మహాసభలలో ఆహూతులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు



సభలో పంచెకట్టుతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



సీఎం చంద్రబాబుని సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్, వేదికపై పలువురు ప్రముఖులు

తెలుగుకు పట్టాభిషేకం

(5వ పేజీ తరువాయి)

పునరుద్ధాటన, భాషా పరిరక్షణకు సంకల్ప ఘంటిక, భావి తరాలకు అప్పగించవలసిన వారసత్వానికి పునః ప్రతిజ్ఞగా చరిత్రలో నిలిచిపోతాయి.

మాతృ భాష పరిరక్షణ మన బాధ్యత

'ఘన చరిత్ర కలిగిన మన మాతృ భాషను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలి. సంక్రాంతికి ముందే మనకు అమ్మ భాష పండుగ వచ్చింది. మాతృ భాషకు మనం ఇచ్చే గౌరవ వందనమే ఈ ప్రపంచ తెలుగు మహా సభలు.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల చివరిరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని తలపెట్టిన ఆంధ్ర సారస్వత పరిషత్‌ను అభినందించారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన ఎన్టీఆర్ పేరును ఈ వేదికకు పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషకు ఎంతో ఘన చరిత్ర ఉందని.. వందలాది భాషలున్న మన దేశంలో కేవలం 6 భాషలకే ప్రాచీన హోదా లభించిందని, అందులో తెలుగు ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో తెలుగు మాట్లాడేవారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే వారి సంఖ్య 10 కోట్లకు పైగానే ఉందని, ఈ సభలకు 40 దేశాల నుంచి ప్రతినిధులు రావడం సంతోషదాయకమన్నారు. ఇలాంటి సభలు తెలుగు భాష పరిరక్షణకు, భాష గొప్పదనాన్ని చాటేందుకు ఉపయోగపడతాయన్నారు. తమిళనాడు, కర్నాటక, ఒడిశా, బెంగాల్‌లో కూడా తెలుగు చదివే విద్యార్థులు ఉన్నారన్నారు. ఏ భాష తక్కువా కాదు... ఎక్కువా కాదు. మాతృభాష అమ్మతో సమానమన్నారు. భాష అనేది మన సంస్కృతిని ముందుకు తీసుకు వెళతుందని, మన అస్తిత్వాన్ని కాపాడుతుందన్నారు. అమ్మ భాషే లేకపోతే మన జీవితాలకు, మన జాతికి అర్థమే ఉండదని ముఖ్యమంత్రి అన్నారు. తెలుగు మహాసభలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. విలువలు నేర్పేది సంస్కృతి అని.. ఆ సంస్కృతికి మూలమైన భాషాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే వివిధ దేవాలయాల్లో ఆస్థాన విద్వాంసులను, ఆస్థాన కవులను నియమించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రపంచ మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీగా పరిగణిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

● మాతృభాష ద్వారా మానవ విలువలు

మాతృభాష ద్వారా భావితరాలకు మానవ విలువలను అందజేయాలని గోవా గవర్నర్ పూసపాటి గజపతిరాజు కోరారు. మారిన పరిస్థితుల్లో అదెంతో కష్టతరమైనదిగా ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని భావితరాలకు విలువలు అందించాలన్నారు.

● మమ్మీ, డాడీ అనగానే మురిసిపోవద్దు

మమ్మీ, డాడీ అంటే మురిసిపోయే తల్లిదండ్రులు ముందు మారాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు హితవు పలికారు. అమ్మ, నాన్న అన్న మాటల మాధుర్యాన్ని తెలుసుకోవాలన్నారు. పిల్లలకు తెలుగు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరభాషా వ్యామోహంపై సొంత అనుభవాన్ని చెబుతూ తనదైన శైలిలో అందరికీ చురకలు వేశారు.

● తెలుగు భాషా పరిరక్షణ ప్రతి తెలుగువాడి బాధ్యత

తెలుగు భాషా పరిరక్షణ ప్రతి తెలుగువాడి బాధ్యత అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన తెలుగు భాష కేవలం సంభాషణ మాధ్యమం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, గుర్తింపు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలుగు భాష శతాబ్దాలుగా ప్రతిధ్వనిస్తున్న మన పూర్వీకుల స్వరమని, వేల సంవత్సరాల సాహిత్య సంప్రదాయాన్ని నింపుకున్న మహా సముద్రమని ఆయన కొనియాడారు. పరిశోధనల ప్రకారం తెలుగు నేర్చుకున్న పిల్లల్లో జ్ఞాపకశక్తి, సృజనాత్మకత, విషయ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుందన్నారు. తాను 25ఏళ్ల అమెరికాలోనే ఉన్నా.. తెలుగు భాషపై ఉన్న ప్రేమే ఈ రోజు ఈ వేదికపై మాట్లాడేలా చేసిందని పెమ్మసాని పునరుద్ఘాటించారు. భాష చనిపోతే సంస్కృతి చనిపోతుందని, సంస్కృతి పోతే మన గుర్తింపే మాయమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పుకాదని, తెలుగును మర్చిపోవడం తప్పేనని, రెండు భాషలూ రెండు కళ్లలాంటివని స్పష్టం చేశారు. ఈ మంత్రి నిమ్మల రామానాయుడు, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు తెలుగు సారస్వత పరిషత్ సభ్యులు సన్మానం చేశారు. సీఎం చంద్రబాబు తరం మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో మారిషస్ అధ్యక్షుణ్ణి సీఎం సత్కరించారు. మారిషస్‌లో నివసిస్తున్న తెలుగువారి యోగక్షేమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు.

భాష అంతరిస్తే.. జాతి అంతరించినట్లే

ఒక జాతి చరిత్ర, సంస్కృతి, వారసత్వం, ఆలోచనలకు ప్రాణం లాంటిది భాష అని.. అదే అంతరిస్తే జాతి పూర్తిగా అంతరించినట్లేనని భారత సర్వోన్నత న్యాయస్థానం విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ పేర్కొన్నారు. తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. పరాయి భాషపై వ్యామోహం పెంచుకోవద్దని సూచించారు. తెలుగును అభ్యసిస్తే ఉద్యోగులు రావని చేస్తున్న విష ప్రచారాన్ని అడ్డుకోవడంలో భాషాభిమానులు విఫల మవుతున్నారన్నారు. భాషతో సంస్కృతి విరాజిల్లుతుందని, అంతే తప్ప భాషకు ఉద్యోగానికి సంబంధం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఆంగ్లేయుల పాలన, ఇంగ్లీషు భాష నుంచి విముక్తి పొందామనే సంతోషంపడే లోపే ప్రపంచకరీణ, ఒప్పందాల పేరుతో తిరిగి దేశంలో ఇంగ్లీషు ప్రవేశించిదన్నారు. దీనిని అడ్డుపెట్టుకుని విద్య, వైద్య, కార్మిక శాఖ రంగంలోని ఈ శక్తులు చొరబడి ఆంగ్ల భాషాను రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్రాలలో మాతృ భాషాను బోధించే పాఠశాలలు లేవని ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఇటువంటి విధానాలను అడ్డుకోకపోతే మరోసారి బానిసలుగా మారిపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య తెలుగులో జరగాలని, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విధిగా తెలుగు భాషా శాఖను ఏర్పాటు, సినిమా, ఇతర వినోద రంగాల్లో ప్రక్షాలన, తెలుగులోనే శాసనాలు, ఉత్తర్వుల జారీ, సాహితివేత్తలను, కళాకారులను గుర్తించి.. మాతృ భాషకు సంబంధించిన శాఖల పటిష్టం, నిధుల కేటాయింపు.. ఇతర సమస్యలపై ముగింపు సభలలో ఆయన తీర్మానాలను ప్రవేశపెట్టి, వాటిని ప్రభుత్వానికి అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.

నేను సీఎం చంద్రబాబునాయుడుని కలవగలనా?

● అని మారిషస్ అధ్యక్షుడు నన్ను అడిగారు



మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనాల్సిందిగా మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్‌తో తాను వీడియో కాల్‌లో మాట్లాడానని.. అప్పుడు ఆయన తాను తప్పక వస్తానని.. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడుని తాను కలవగలనా అని ప్రశ్నించారని తెలుగు మహాసభల నిర్వాహకుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. చంద్రబాబుని కలవగలనా అని ఒక దేశాధ్యక్షుడు అడిగారంటే ఆయన మీద విదేశాల్లో ఎంత గౌరవం ఉందో ఆలోచించుకోవాలన్నారు. అలానే ఒకసారి తను, బాలమురళీకృష్ణ భవనాల గురించి మాట్లాడుతుంటే అప్పుడు చంద్రబాబు.. శ్రీనివాస్ బిల్డింగ్‌లు గురించి కాదు కెపాసిటీ బిల్డింగ్ గురించి మాట్లాడాలన్నారని గుర్తు చేసుకొన్నారు. అది ఆయనకున్న దార్శనికత అని కొనియాడారు. ఇటీవల తాను టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో టీడీ జనార్దన్‌ని కలిశానని.. అప్పుడు ఆయన మనస్సు ఫౌండేషన్ వాళ్లని పరిచయం చేశారని చెప్పారు. తెలుగు భాషని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం అన్నారని.. ఆయన స్ఫూర్తితో మూడు కోట్ల తెలుగు భాషతో ఉన్న పేజీలను వాళ్ల డిజిటలైజేషన్ చేశారన్నారు.

● ముగింపు సభలో విశిష్ట అతిథిగా జస్టిస్ బొప్పిడి కృష్ణమోహన్, విశ్వ హిందీ పరిషత్ న్యూఢిల్లీ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు, ఏపీ అధికార భాష సంఘ అధ్యక్షుడు పి.త్రివిక్రమ రావు, తెలుగు అకాడమీ సంస్కృతి చైర్మన్ ఆర్డీ విల్సన్, నాటకరంగ సంస్థ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, 20 సూత్రల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ నటుడు సాయికుమార్, వైడీ రామారావుకు సేవా, ఇతర రంగాలలో సేవలు అందించిన ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలను, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, గాయకులు మనో, కుంచే రఘులకు సంగీత రంగంలో పురస్కారాలు ప్రదానం చేశారు.

తెలుగు భాషకు శతాబ్దాల చరిత్ర



తెలుగుభాష పూర్వం నుంచే ఉందని.. ఈ భాషని రక్షించుకోవాలని ప్రతి ఒక్కరూ నొక్కి చెబుతున్నారంటే దాని ఔన్నత్యం గురించి వేరేగా చెప్పాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర పోలీసు కంప్లయింట్ అథారిటీ చైర్మన్ బి.శివశంకరరావు పేర్కొన్నారు. కొన్ని వేల సంవత్సరాల చరిత్రలో శాసనాలు, సాహిత్యగ్రంథాలలో తెలుగు సజీవంగా ఉదన్నారు. ప్రాకృతం, సంస్కృతం శాసనల్లో తెలుగుపదాలు దొర్లాయని, చోళుల శాసనాల్లో తెలుగు లిఖితమైన ఆధారాలు లభించాయన్నారు. 6వ శతాబ్దం నాటికే తెలుగు పదాలు కనిపించాయని, 11 నుంచి 17 శతాబ్దాల మధ్యన తెలుగు ఆదికవులు నన్నయ్య, శ్రీనాథుడు వంటి వారు తెలుగు ప్రబంధశైలిని తీసుకురాగా నేటికీ అది వాడుకలో ఉందన్నారు.

తెలుగుతో తెలుగుదేశం పార్టీకి అవినాభావ సంబంధం

● రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాషకు కితాబిచ్చింది శ్రీ కృష్ణదేవరాయలు. ఆయన కంటే ముందే ఇటాలియన్ ఆఫ్ ఈస్టు అని ఇటలీ దేశ అన్వేషకుడు నికోలోడి అన్నారు. 1420లోనే తెలుగు భాషకు కితాబిచ్చారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అరుదైన, అందమైన, అద్భుతమైన, అమ్మ భాష తెలుగు. భాష ఉనికిని ముందుకు తీసుకెళ్లడంలో ఈ మహాసభలు ఎంతో దోహదం చేస్తాయి. తెలుగు, తెలుగుదేశం పార్టీని విడదీయలేమన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఆ రోజున ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాతనే తెలుగు భాషకు గుర్తింపు వచ్చింది. అంతకు ముందు తెలుగువారంటే మదరాసీలు, సాంబారీలు అని పిలిచే పరిస్థితుల్లో తెలుగువారి గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబు తెలుగువారి ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెబుతున్నారు. ఈ రకంగా తెలుగుదేశం, తెలుగు భాషకు అవినాభావ సంబంధం ఉంది.

ఇతరులను చూసి నేర్చుకోవాలి

మాతృభాష విషయంలో ఇతర దేశాల పద్దతులను తప్పకుండా అలవరుచుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 18 భాషల్లో ప్రావీణ్యం సంపాందించారని గుర్తుచేస్తూ.. మాతృ భాషాను విస్మరించకుండా.. ఇతర భాషాల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు.

మానవ జీవితాన్ని ఎంచే స్థాయికి మొబైల్ వెళ్లకూడదు

● భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

● మలినేనిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

వట్టిచెరుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ, గాయత్రి సదన్ భవన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే మార్గదర్శకమని, పండుగలు కేవలం ఉత్సవాలుగా కాకుండా తరతరాలకు విలువలను బదిలీ చేసే వారసత్వాలుగా భావించాలని పిలుపునిచ్చారు. నేటి తరం మొబైల్ ఫోన్‌ల వినియోగంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్‌లు జ్ఞానం, సమాచారం, సాంకేతిక అభివృద్ధికి ఉపయోగపడాలే కాని మనిషి ఆలోచనలను, విలువలను దూరం చేసే స్థాయికి చేరకూడదన్నారు. మొబైల్ మానవ చేతిలో ఉండాలే కాని మన జీవితాన్ని ఎంచే స్థాయికి తెచ్చుకోకూడదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గురువులు సమాజంలోని పెద్దల పట్ల గౌరవాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. మహిళలు విద్య, సాంకేతికత, పరిశోధన, నాయకత్వ రంగాల్లో ముందుకు రావటం దేశ భవిష్యత్‌కు అత్యంత కీలక పరిణామమన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు పరస్పరం సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్‌ను అందిపుచ్చుకోవటం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు రాజమార్గ మవుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి ఉన్నత విద్య మాజీ కమిషనర్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చు కోవాలన్నారు. పెద్దల పట్ల గౌరవం, కుటుంబ విలువలు నిలబడినప్పుడే సమాజం స్థిరంగా ఉంటుందన్నారు. అనువాదిని ఏ-1 ఏఐసీటీసీ సీఈవో బుద్ద చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటల్‌జెన్స్ డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మాతృ భాషలో సాంకేతికత, విద్య, సంస్కృతి ఆధారిత సంస్కరణలు భవిష్యత్ తరాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావును, అలాగే పుల్లడిగుంటలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్న క్యాంటీన్ ద్వారా అన్నార్తులకు నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉప్పుటూరి చిన రాములును మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు తదితరులు 40 బృందాలుగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అలాగే ప్రాంగణంలో గంగిరెద్దులు, ప్రభలు, భోగి మంటల కార్యక్రమాలతో పండుగ వాతావరణం సంతరించుకుంది.



మలినేనిలో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు



గాయత్రి సదన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, డాక్టర్ లక్ష్మీనారాయణ



నృత్యం చేస్తున్న మలినేని కళాశాల విద్యార్థినులు



మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తదితరులు

8న సారస్‌కు రానున్న ముఖ్యమంత్రి





గుంటూరు రెడ్డి కాలేజ్ సమీపంలోని సారస్ ప్రాంగణం, ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సారస్ - అఖిల భారత డ్వాక్రా బజార్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 8న విచ్చేస్తారని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సారస్(సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శన శాల ఏర్పాట్లను మంత్రి సోమవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో సారస్ వేదిక వద్ద సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుంచి ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని చెప్పారు. ఒక మినీ భారత సమ్మేళనంగా జరుగుతుందని చెప్పారు. దీని వల్ల ఈ ప్రాంత స్వయం సహాయక సంఘాలు దేశంలో ఇతర ప్రాంతాల్లో ఆయా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను గురించి తెలుసుకుంటారని, విభిన్న ఆలోచనలకు నాంది అవుతుందన్నారు. సారస్‌కు మంచి బ్రాండింగ్ జరగాలని, పర్యావరణ హిత కార్యక్రమంగా నిలవాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో వస్తారనే అంచనా నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీ సమస్యలు తలెత్తకుండా, మొబైల్ నెట్వర్క్, వైఫై సమస్యలు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నాలెడ్జి పెవిలియన్ ఏర్పాటు చేస్తూ ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రతి రోజు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. విమెన్ ఫ్రెండ్లీ, ఎకో ఫ్రెండ్లీ వాతావరణంలో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామని వివరించారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, డా.బూర్ల రామాంజనేయులు, సెర్ప్ సీఈఓ వి.కరుణ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి అమరేంద్ర ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు కేఎల్‌యూ జట్టు

● సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్స్ నేడు

తాడేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్- 2026లో 8 జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెమీ ఫైనల్స్ సోమవారం రాత్రి కూడా కొనసాగాయి. ఐదు రౌండ్‌లు పూర్తయ్యే సరికి కేఎల్‌యూ జట్టు చెన్నై భారతీయార్ వర్సిటీ జట్టుపై విజయం సాధించి సెమీ ఫైనల్‌లోకి అడుగు పెట్టింది. కాకినాడ జేఎన్‌టీయూ జట్టుపై కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ జట్టు విజయం సాధించింది. వీటితోపాటు మరో ఆరు జట్లు సెమీఫైనల్స్‌లో తలపడనున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఫైనల్స్ మ్యాచ్ నిర్వహిస్తామని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు.



భారతీయార్ వర్సిటీ జట్టుతో తలపడుతున్న కేఎల్‌యూ జట్టు

బెట్టింగ్ అప్పుల భయం..

● రాజధానిలో నెల్లూరు వాసి హల్‌చల్

తుళ్లూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నెల్లూరు జిల్లా వ్యక్తి రాంబాబు సోమవారం హల్‌చల్ చేశాడు. వెలగపూడి రాష్ట్ర సచివాలయం దగ్గర్లో మల్కాపురం జంక్షన్‌లో ఉన్న టవర్ ఎక్కి.. బెట్టింగ్ యాప్ వల్ల రూ.80 లక్షలు పోగొట్టుకున్నానని.. న్యాయం చేయాలని.. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తతత నెలకొంది. పోలీసులు వచ్చి అతడిని కిందకు దించారు. అప్పులు తీర్చుకోవడం కోసం కిడ్నీ అమ్మేందుకు.. హైదరాబాద్ వెళ్లినట్టు పోలీసులకు అతను చెప్పాడు. అప్పుల వాళ్లు తనను ఇబ్బంది పెడుతున్నారని చెప్పుకొచ్చాడు. లాయర్‌లు ఐపీ పెట్టామనానరని తెలిపాడు. అయితే అతని మానసిక పరిస్థితి సరిగా లేదని తుళ్లూరు పోలీసులు చెప్పారు.

విజ్ఞాన్‌లో ఘనంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన

గుంటూరు(విద్య), జనవరి 5(ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ కళలను విద్యార్థులకు చేరువ చేసే లక్ష్యంతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని విజ్ఞాన్ వర్సిటీలో సోమవారం ఘనంగా నిర్వహించామని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిగాంచిన ప్రముఖ భరత నాట్య నృత్య కళాకారిణి డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భారతీయ శాస్త్రీయ నృత్యానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన కళాకారిణిగా డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్‌కు విశేషమైన పేరు ఉందని వైస్ చాన్సలర్ పేర్కొన్నారు.



డాక్టర్ బాలాదేవి చంద్రశేఖర్ నృత్య ప్రదర్శన

ఉచితాలతో తీవ్ర నష్టం


(5వ పేజీ తరువాయి)

తల్లిదండ్రులు కూడా ఒప్పుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయేందుకు. ఈ సభ సాక్షిగా నిలవాలని కోరారు.

మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని మరిచిన వారు పరిపూర్ణుడు కాదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. సభలు, వేదికలలో సంస్కృతిని ప్రదర్శిస్తే దానికి అనుగుణంగానే భాష విరాజల్లుతుందన్నారు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలన్నారు. మన చరిత్ర, మన హాస్యం, మన సామెతలు మన భాష ద్వారానే తెలుస్తుందని అన్నారు. గుడిలో, బడిలో, అమ్మ బడిలో మాతృభాషనే మాట్లాడాలని.. నాన్న, అమ్మ, తాతయ్య, అమ్మమ్మ, మావయ్య, బావ మరదల పిలుపులో ఉన్న మాధుర్యం.. మమ్మీ, డాడీలలో ఉండదన్నారు. ఇంగ్లీష్‌లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని అనేది అపోహ మాత్రమనేని ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము, నేను, ప్రధాన న్యాయమూర్తులు అందరూ మాతృభాషలోనే అభ్యసించి ఈ స్థాయికి చేరుకున్నామని గుర్తుచేసుకున్నారు.

ఇతర దేశాల మాదిరిగానే మన దేశంలోనూ సాంకేతిక విద్య, ఇతర విద్య, కోర్సులు వారి మాతృభాషలోనే ఉండేలా మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. మాతృభాషలో ఉత్తర్వులు, పాలనా, పరిపాలన న్యాయస్థానాలలో తెలుగు భాషను అమలు చేయాలని, దీనిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు గతంలోనే సూచించినట్టు తెలిపారు. రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలు గుర్తించారన్నారు. సుదీర్ఘ చరిత్ర కల్గిన తెలుగు భాషాను పరిరక్షించేందుకు సంస్కృతి, సంప్రదాయాలను మరింతగా వెలుగులోకి తీసుకురావాలన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఈ ఏడాది సంక్రాంతిని వేడుకలకు ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. మాతృభాష మర్చిపోతే శ్వాస పోయినట్టేనని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.

తెలుగు బలహీన పడుతుంటే భయాందోళనల మధ్య ఇలాంటి సభలు నిర్వహించి తెలుగు భాష పట్ల మమకారాన్ని, అభిమానాన్ని పెంచుతూ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్తుకు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. అనంతరం మహాసభల ఏర్పాటులో కృషి చేసిన నిర్వాహకులను ఆయన ఘనంగా సత్కరించారు.



నిద్ర మాత్రల పట్ల కొన్ని అపోహలు, అవాస్తవాలు, భయాలు అలుముకుని ఉన్నాయి. కానీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, వైద్యుల పర్యవేక్షణలో వాడుకుంటే నిద్రమాత్రలతో ప్రయోజనాలను పొందే వీలుంది. అయితే అన్ని ప్రయత్నాలూ విఫలమై, చివరి ప్రత్యామ్నాయంగానే వీటిని ఎంచుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు

నిదురపో హాయిగా...

నిండైన ఆరోగ్యానికి కంటి నిండా నిద్ర అత్యవసరం. కానీ ఒత్తిడిలు, ఆందోళనలు, మానసిక సమస్యలు నిద్రను దూరం చేసి, ఆరోగ్యాన్ని కుదేలు చేస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు అంతిమ ప్రత్యామ్నాయంగా నిద్ర మాత్రల మీద ఆధారపడక తప్పదు. ఇలాంటి సందర్భాల్లో వైద్యులను సంప్రతించి, వాళ్ల సూచించినంత కాలం, సూచించిన మోతాదుల్లో మాత్రలను వాడుకోవచ్చు. అయితే అంతకంటే ముందు ఈ మాత్రల ఆవశ్యకత గురించి కూడా తెలుసుకోవాలి.

నిద్ర మాత్రలు ఎవరికి?

తీవ్రమైన నిద్రలేమి... అంటే రోజుల తరబడి నిద్ర పట్టకపోవడం, ఫలితంగా దైనందిన జీవితం, జీవనశైలి దెబ్బతింటున్నప్పుడు వైద్యులను సంప్రతించి పరిస్థితిని వివరించాలి. కొందరు పడక మీదకు చేరుకోగానే నిద్రలోకి జారుకోలేరు. ఇంకొందరికి పడుకోగానే నిద్ర పట్టినా, తరచూ మెలకువ అయిపోతూ ఉంటుంది. ఇంకొందరికి తడవలు తడవలుగా నిద్రపడుతూ ఉంటుంది. ఈ లక్షణాలన్నిటినీ వైద్యులకు స్పష్టంగా వివరించాలి. అలాగే నిద్ర పట్టకపోడానికి కూడా పలు రకాల కారణాలుంటాయి. కొందర్లో తీవ్ర ఒత్తిడి, ఆందోళనలుంటాయి. గుండెదడ, చమటలు పట్టడం, గాభరా లాంటి లక్షణాల కారణంగా నిద్ర సమస్య వేధిస్తున్నప్పుడు యాంగ్జయిటీ డిజార్డర్ చికిత్సలో భాగంగా, వ్యతిరేక ఆలోచనలతో నిద్రకు దూరమయ్యే మానసిక కుంగుబాటు చికిత్సలో భాగంగా కూడా వైద్యులు నిద్ర మాత్రలను

సురక్షితమైన మాత్రలు

కేవలం నిద్ర లక్ష్యంగా కాకుండా ఒత్తిడి, ఆందోళనలను వదిలించడం ద్వారా నిద్రకు దోహదపడే పరోక్ష మందులు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. కుంగుబాటు ప్రభావాన్ని తగ్గించేలా మెదడులోని సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచే మందులతో సానుకూల స్వభావాన్ని పెంచడం ద్వారా కూడా నిద్ర పట్టేలా చేయవచ్చు. అలాగే యాంటీ డిప్రెసెంట్స్ మందులు కూడా కొంత మత్తును కలిగిస్తాయి. అవి నిద్రమాత్రలు కాకపోయినా కొంతమేరకు నిద్రకు దోహదపడతాయి. అలాగే కాంబినేషన్ మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. తాజాగా దుష్ప్రభావాలు తక్కువగా, సత్ఫలితాలు ఎక్కువగా ఉండే సురక్షితమైన నిద్ర మాత్రలు కూడా అందుబాటులోకొచ్చాయి.



సూచిస్తూ ఉంటారు. అలాగే పలురకాల మానసిక రుగ్మతల్లో ఇతర మందులతో పాటు నిద్రమాత్రలను కూడా సూచిస్తారు.

నిద్రమాత్రలతో ప్రయోజనాలున్నాయి

నిద్ర తగ్గితే రక్తపోటు పెరుగుతుంది. మధుమేహం, హృద్రోగాలు లాంటి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు మరింత ఇబ్బంది పెడతాయి. కాబట్టి కంటి నిండా నిద్ర దూరమైనప్పుడు నిద్రమాత్రలను వాడుకోవచ్చు. అలాగని దీర్ఘకాలిక రుగ్మతలున్నవాళ్లందరూ తప్పనిసరిగా నిద్రమాత్రలు వాడుకోవలసిన అవసరం లేదు. ఒత్తిడి, ఆందోళనల కారణంగా మధుమేహం అదుపులోకి రానప్పుడు, వాటి వల్ల నిద్రపట్టని పరిస్థితి తలెత్తి, మధుమేహం మరింత పెరిగే ప్రమాదం ఉన్నప్పుడు నిద్ర మాత్రలు వాడుకోవచ్చు.

అలవాటు పడడం

నెలల తరబడి నిద్రమాత్రలు వాడుకున్నప్పుడు, మాత్ర వేసుకోనిదే నిద్ర పట్టని పరిస్థితి తలెత్తవచ్చు. ఈ సమస్య తలెత్తినప్పుడు, వైద్యుల దృష్టికి తీసుకువెళ్లి, క్రమేపీ మోతాదును తగ్గించుకుంటూ నిద్ర మాత్రల అవసరం లేకుండా నిద్ర పట్టే స్థితికి చేరుకోవచ్చు. అలాగే నిద్రమాత్రలు మానుకోవాలని అనుకుంటున్న వాళ్లు వైద్యుల సలహా తీసుకోకుండా, అకస్మాత్తుగా వాటిని ఆపేయడం కూడా సరికాదు. నిజానికి క్రమం తప్పక వైద్యులను కలుస్తూ, నిద్రమాత్రల మోతాదులు, కాలపరిమితుల గురించి చర్చిస్తూ అవసరమైనంత కాలమే వాటిని వాడుకోవాలి. నిద్రమాత్రలు మానుకునే దశలో విత్‌డ్రాయల్ సింప్టమ్స్ కనిపిస్తాయి. నిద్ర పడుతూ మెలకువ అవుతూ కొంత ఇబ్బందికి లోనైనా కంగారు పడకుండా, నిద్రపోయే ప్రయత్నం చేస్తూ ఉంటే, పరిస్థితి గాడిలో పడుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా కంటినిండా నిద్రకు దోహదపడే ఇతరత్రా ప్రత్యామ్నాయాలన్నిటినీ ప్రయత్నించి, అంతిమంగా ఈ మాత్రలను తాత్కాలిక పరిష్కారంగా ఎంచుకోవాలి.

అంతిమ ప్రత్యామ్నాయం మాత్రమే!

అలసటకు లోనైన శరీరం తప్పక విశ్రాంతిని కోరుకుంటుంది. అలాగే రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలను వదిలించుకోడానికి కూడా శారీరక శ్రమ ఉపయోగపడుతుంది. కాబట్టి నిద్ర సమస్యతో బాధపడే ప్రతి ఒక్కరూ నడక లాంటి తేలికపాటి వ్యాయామాలను ఎంచుకోవచ్చు. అలాగే ధ్యానం, యోగాలతో మానసిక ఒత్తిడి తొలగి, కంటి నిండా నిద్ర పడుతుంది. నిద్రకు ఆటంకం కలిగించే అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా పాటించాలి. అలాగే ఇతరత్రా రుగ్మతల ఫలితంగా నిద్రాభంగం కలుగుతున్నప్పుడు వాటిని కూడా చికిత్సలతో సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

దుష్ప్రయోజనాలు స్వల్పమే!

ఎక్కువ మోతాదులతో కూడిన నిద్రమాత్రలను దీర్ఘకాలం వాడుకున్నప్పుడు కొంతమేరకు దుష్ప్రభావాలను భరించవలసి వస్తుంది. కాబట్టి కొన్ని వారాలు నెలల పాటు వాడుకున్న తర్వాత, మోతాదును తగ్గిస్తూ నిద్ర మాత్రల మీద ఆధారపడే పరిస్థితిని వైద్యులు సరిదిద్దుతూ ఉంటారు. సాధారణంగా నిద్రమాత్రలతో ప్రారంభంలో తేలికపాటి నిస్సత్తువ, నిద్రమత్తు లాంటివి పగటి పూట వేధిస్తూ ఉంటాయి.

డాక్టర్ శివ రాజు
సీనియర్ కన్సల్టెంట్
ఫిజీషియన్ అండ్
డయాబెటాలజిస్ట్,
కిమ్స్ హాస్పిటల్, సికింద్రాబాద్.



పోషకాలు - వాస్తవాలు

విదేశీ పండ్లు శ్రేష్ఠమా?

కివి, డ్రాగన్, స్టార్, ప్యాషన్ ఫ్రూట్స్, బ్లూ బెర్రీ, అవకాడో... ఒకప్పుడు ఈ పండ్లన్నీ విదేశాలకే పరిమితం. కానీ ఇవన్నీ ఇప్పుడు మన దేశంలో కూడా విరివిగా పండుతూ, అందరికీ అందుబాటులోకొచ్చేశాయి. అయితే మన పండ్లలో లేని పోషకాలు ఈ పండ్లలో ఉంటాయా? వీటిని తినడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయా?

చక్కెర మోతాదులు తక్కువగా ఉండడం, కొత్త తరం ఈ విదేశీ వంగడాల పట్ల మక్కువ కనబరుస్తూ ఉండడం వల్ల, రెస్టారెంట్లలో స్మూదీలు, పండ్ల రసాలు, ఐస్‌క్రీమ్స్‌లో వీటి వాడకం పెరిగింది. దేశీయ పండ్లతో పోలిస్తే, ఈ విదేశీ పండ్ల ఖరీదు కూడా కాస్త ఎక్కువే! అయినా పోషకాలు ఎక్కువగా ఉంటాయనే ఆలోచనతో వీటి మీద ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. ఈ పండ్లు కచ్చితంగా ఆరోగ్యానికి మేలు చేసేవే! వీటన్నింట్లో పోషకాలు సమృద్ధిగానే ఉంటాయి. అయితే మన పండ్లలో దొరకని పోషకాలు వీటిలో దొరుకుతాయని అనుకోవడం అపోహ మాత్రమే! యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజలవణాలు మన పండ్లలోనూ ఉంటాయి.

ప్రత్యామ్నాయాలున్నాయి

డ్రాగన్, లిచిలలో సి విటమిన్‌తో పాటు కాపర్, పొటాషియం మొదలైన పోషకాలన్నీ ఉంటాయి. అవకాడొలో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి. కాబట్టి శరీర దారుఢ్యం మీద దృష్టి పెట్టేవాళ్లు అవకాడొ శాండ్‌విచ్, స్ప్రెడ్‌లను ఎంచుకుంటూ ఉంటారు. కీటో డైట్ అనుసరించేవారు కూడా వీటిని తీసుకుంటూ ఉంటారు. డ్రాగన్, రాంబుటాన్, స్టార్ ఫ్రూట్స్‌లో చక్కెరలు తక్కువ కాబట్టి మధుమేహులు ఈ పండ్లను ఎంచుకుంటూ ఉంటారు. బ్లూబెర్రీస్‌లో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించి, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, క్యాన్సర్‌ను నివారించే ఇమ్యూనిటీ బూస్టర్స్ ఎక్కువగా ఉండడం వల్ల ఈ పండ్లను విరివిగా తింటున్నారు. ప్యాషన్ ఫ్రూట్‌లో కూడా రోగనిరోధకశక్తిని పెంచే కారకాలుంటాయి. దీన్లో విటమిన్ సి కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి డిజర్ట్స్‌లో, కాక్‌టెయిల్స్‌లో కలుపుతూ ఉంటారు. అయితే ప్రస్తుతం ఈ పండ్లన్నిటినీ మన దేశంలోని చల్లని ప్రదేశాల్లో పండించడం మొదలుపెట్టారు.




పోషకాలు సమంగా...

విదేశీ పండ్లను తినాలనుకోవడం తప్పు కాదు. వాటిలోని పోషకాలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నది కూడా మంచి ఆలోచనే! అయితే ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టి, వాటినే తినవలసిన అవసరం కూడా లేదు. నిజానికి విదేశీ పండ్లలో దొరికే పోషకాలన్నీ మన పండ్లలో కూడా దొరుకుతాయి. ఆ పండ్లకు సాటి రాగలిగే దేశీయ పండ్లన్నీ మనకు ముందు నుంచే ఉన్నాయి. ఆయా రుతువుల్లో పండే పండ్లన్నీ ఆయా కాలాల్లో మన ఆరోగ్యానికి రక్షణ కల్పించే పోషకాలను సమృద్ధిగా కలిగి ఉంటాయి. ఉదాహరణకు చలి కాలంలో లిచిలతో సమానంగా రేగు పండ్లు కూడా దొరుకుతాయి. డ్రాగన్‌లో కంటే నేల ఉసిరితో విటమిన్ సి ఎక్కువగా దొరుకుతుంది. సీమచింతకాయలో ఎక్కువ పీచు, విటమిన్ సి ఉంటాయి. స్టార్ ఫ్రూట్, బ్లూబెర్రీస్‌కు బదులుగా పసుపు రంగు ఉసిరిలో, వాక్కాయ, జామకాయల్లో విటమిన్ సి సమృద్ధిగా దొరుకుతుంది. అవకాడొ బదులు అరటిపండ్లు తినొచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌కు బదులుగా జామ పండ్లు తినొచ్చు. తాటి ముంజెలకూ రాంబుటాన్‌కూ అంతగా వ్యత్యాసం ఉండదు. రెండింట్లో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణాలుంటాయి. రెండింట్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి వీటిలో ఏ పండును తిన్నా పొందే ఆరోగ్య ప్రయోజనాలు సమానంగానే ఉంటాయి.

దేశీయ పండ్లలో...

జామ, సీతాఫలం, దానిమ్మ, అరటి పండ్లలో దొరికే పోషకాలు విదేశీ పండ్లలో దొరికే పోషకాలకు ఏమాత్రం తక్కువ కాదు. కాబట్టి ఎక్కువ ధర పలికే విదేశీ పండ్లకు బదులుగా అందుబాటు ధరల్లో దొరికే ప్రత్యామ్నాయ దేశీయ పండ్లను నిరభ్యంతరంగా ఎంచుకోవచ్చు. కొన్ని విదేశీ పండ్లలో కొన్ని పోషకాలు కాస్త ఎక్కువ మోతాదుల్లో ఉండొచ్చు. అంతే సమానమైన పోషకాలను పొందడం కోసం అవే పోషకాలు కలిగిన దేశీయ పండ్ల మోతాదును పెంచుకుంటే సరిపోతుంది.

డాక్టర్ సుజాత స్టీఫెన్,
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట్, హైదరాబాద్



మైక్రో ప్లాస్టిక్స్

ఈ ప్రత్యామ్నాయాలు ఆరోగ్యకరం

మనం ఆరోగ్యకరమైనవి అనుకునే కొన్ని పదార్థాల్లో కూడా మైక్రోప్లాస్టిక్స్ ఉంటున్నాయి. వాటిని ఆహారం నుంచి తొలగించి, ప్రత్యామ్నాయ పదార్థాలను ఎలా ఎంచుకోవాలంటే...

5 మిల్లీమీటర్ల కంటే చిన్నవిగా ఉండే ప్లాస్టిక్ పరమాణువులైన మైక్రోప్లాస్టిక్స్ మనం తినే ఉప్పు, సముద్రాహారం, పండ్లు, కూరగాయలు, తేనెల్లో కూడా ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా శుద్ధి చేసిన, ప్యాకెట్లలో నిల్వ చేసిన పదార్థాల్లో వీటి పరిమాణం ఎక్కువ. కలుషిత పదార్థాలు, పారిశ్రామిక శుద్ధీకరణ, ప్లాస్టిక్ ప్యాకెట్లలో నిల్వ చేయడం వల్ల వీటిలోకి మైక్రోప్లాస్టిక్ చేరుకుంటున్నాయి కాబట్టి పదార్థాల నిల్వకు మరింత సురక్షితమైన నిల్వ పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే మైక్రోప్లాస్టిక్ ముప్పు పొంచి ఉండే పదార్థాలకు ఆరోగ్య ప్రత్యామ్నాయాలను కూడా ఎంచుకోవచ్చు.



సముద్రాహారం:

రొయ్యలు, పీతలు లాంటి గుల్ల చేపలు మైక్రోప్లాస్టిక్స్‌ను శోషించుకునే స్వభావాన్ని ఎక్కువగా కలిగి ఉంటాయి. కాబట్టి వీటికి బదులుగా పెద్ద చేపలను ఎంచుకోవాలి

టేబుల్ సాల్ట్:

ఉప్పు ఉత్పత్తి... మైక్రోప్లాస్టిక్ రేణువుల సాంద్రతకు ప్రధాన కారణం. కాబట్టి సముద్రపు ఉప్పుకు బదులుగా అయొడైజ్డ్ సాల్ట్ తీసుకోవచ్చు

బాటిల్డ్ వాటర్:

ప్లాస్టిక్ సీసాల్లో నిల్వ చేసే మంచినీళ్లకు బదులుగా కార్బన్/యుఎఫ్ ఫిల్టర్లు కలిగిన ఫిల్టర్ వాటర్ శ్రేయస్కరం. ఈ నీళ్లను స్టెయిన్‌లెస్ స్టీల్ సీసాల్లో, బిందెల్లో నిల్వ చేసుకుని తాగాలి

తేనె:

శుద్ధి ప్రక్రియలో భాగంగా తేనెలో కూడా మైక్రోప్లాస్టిక్స్ కలుస్తాయి. కాబట్టి గాజు సీసాల్లో దొరికే ముడి తేనె తీసుకోవాలి. ప్లాస్టిక్ సీసాల్లో దొరికే ప్యాకేజ్డ్ బ్రాండ్స్ వాడకం మానేయాలి

టీ బ్యాగ్స్:

నైలాన్‌తో తయారయ్యే టీ బ్యాగ్స్‌ను వేడినీళ్లలో ముంచగానే మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతాయి. కాబట్టి టీపొడిని వేడి నీటిలో మరిగించి తాగడం ఆరోగ్యకరం.

పిస్తాతో ఆరోగ్యం మీ గుప్పిట్లో...

పోషకాల గని: పిస్తాపప్పులో ప్రొటీన్లు, పీచుపదార్థంతోపాటు మోనోఅన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. కీలకమైన విటమిన్లు, మినరల్స్ వీటికి 'సూపర్ ఫుడ్' హోదాను కట్టబెట్టాయి.



గుండెకు రక్షణ కవచం: శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీనివల్ల రక్తపోటు నియంత్రణలో ఉండి, గుండె జబ్బుల ముప్పు తప్పుతుంది.

బరువు తగ్గాలనుకునే వారికి వరం: పిస్తాలో ఉండే పీచు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. దీనివల్ల అనవసరమైన చిరుతిళ్లపై వ్యామోహం తగ్గుతుంది. ఫలితంగా బరువు సులభంగా అదుపులోకి వస్తుంది.

పేగు ఆరోగ్యం భద్రం: పిస్తాపప్పులు ప్రిబయాటిక్స్‌గా పనిచేస్తాయి. ఇవి మన పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందించి, జీర్ణవ్యవస్థను చురుగ్గా ఉంచుతాయి.

కంటి వెలుగుకు భరోసా: వయసు పెరగడం వల్ల వచ్చే కంటి చూపు సమస్యలను నివారించడంలో పిస్తా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే ల్యుటిన్, జియాక్సాంథిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు చూపును మెరుగు పరుస్తాయి.

పరిశోధన

మృదులాస్థి పునరుద్ధరణ సాధ్యమే!



వృద్ధాప్యంతో సంబంధం ఉన్న ఒక ప్రొటీన్‌ను నిరోధించడం వల్ల, వయసు పైబడిన ఎలుకల్లో అరిగిపోయిన మృదులాస్థిని పునరుద్ధరించగలిగినట్టు స్టాన్‌ఫోర్డ్ పరిశోధకులు తాజాగా పేర్కొన్నారు. ఇంజెక్షన్ ద్వారా సాగే ఈ చికిత్స... మృదులాస్థిని పునర్నిర్మించడంతో పాటు, ఎసిఎల్ టేర్స్ లాంటి మోకీళ్ల గాయాల వల్ల తలెత్తే కీళ్ల అరుగుదలకు కూడా అడ్డుకట్ట వేస్తుందని పరిశోధకులు వివరిస్తున్నారు. ఈ చికిత్సకు సంబంధించిన మాత్ర ఆధారిత వెర్షన్‌ను ఇప్పటికే కొన్ని వైద్య ప్రయోగాల్లో పైబడే వయసుతో కూడిన కండరాల బలహీనత చికిత్సలో ఉపయోగించడం జరిగింది. ఈ చికిత్స సత్ఫలితాలను కనబరిచింది. అలాగే కీళ్ల మార్పిడి సమయంలో సేకరించిన మోకీలి కణజాలం ఈ చికిత్సకు సానుకూలంగా స్పందించింది. ఈ ఫలితాల ఆధారంగా పైబడే వయసు ఫలితంగా లేదా కీళ్ల అరుగుదల ఫలితంగా కోల్పోయిన మృదులాస్థిని, ఇంజెక్షన్ లేదా మాత్రల ద్వారా పునరుద్ధరించి, మోకీళ్లు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు అడ్డుకట్ట వేయొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

అవగాహన

జ్వరం-జరభద్రం



అన్ని రకాల జ్వరాల్లో ఒళ్లు వెచ్చబడినా, జ్వరంతో పాటు తలెత్తే భిన్నమైన లక్షణాల ఆధారంగా జ్వరం రకాన్ని కచ్చితంగా కనిపెట్టవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

వైరల్ ఫీవర్

విపరీతమైన జ్వరంతోపాటు జలుబు, దగ్గు, తలనొప్పి, ఆయాసం, చమటలు పట్టడం ఉంటే వైరల్ ఫీవర్‌గా భావించాలి. ఒళ్లంతా ఎర్రటి మచ్చలు కూడా కనిపించవచ్చు. ఈ లక్షణం ఉంటే వైరల్ హెమరేజింగ్ ఫీవర్ అనుకోవాలి. ఈ జ్వరం తాలూకు వైరస్, దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

టైఫాయిడ్ ఫీవర్

జ్వరంతోపాటు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, కామెర్లు, గుండె కొట్టుకునే వేగం తగ్గడం ప్రధానమైన లక్షణాలు.

డెంగ్యూ

విపరీతమైన జ్వరంతోపాటు కీళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు ఉంటాయి. కొందరిలో రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య త్వరితంగా పడిపోతూ ఉంటుంది. ఇలాంటప్పుడు విరేచనం, మూత్రంలో రక్తం కనిపిస్తుంది. ముక్కులో నుంచి, లేదా దంతాలు శుభ్రం చేసుకునేటప్పుడు చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది. కొందర్లో పొట్టలో విపరీతమైన నొప్పి ఉంటుంది. ఇది అంతర్గత రక్తస్రావానికి సూచన. తలనొప్పితోపాటు శరీరంలో ఒక వైపు పక్షవాతం లక్షణాలు కనిపిస్తే మెదడులో రక్తస్రావం అవుతున్నందుకు సూచనగా భావించాలి. ఇది ఎంతో తీవ్రమైన పరిస్థితి.

చలికాలం వేధించే జ్వరం

చలికాలంలో ఎక్కువమందిని బాధపెట్టే జ్వరం - 'సైనసైటిస్ ఫీవర్'. జ్వరం, తలనొప్పి, జలుబు, ముందుకు వంగినప్పుడు తలనొప్పి ఎక్కువవడం, తల బరువుగా ఉండడం మొదలైన లక్షణాలు సైనసైటిస్ ఫీవర్‌లో కనిపిస్తాయి. సైనస్‌లు సున్నితంగా ఉన్నా, నాసికా ద్వారం వంకరగా ఉన్నా (డీవియేషన్ ఆఫ్ నాసల్ సెప్టమ్) తరచుగా జలుబు చేస్తూ, క్రమేపీ ఇన్‌ఫెక్షన్ పెరిగిపోయి సైనసైటిస్ ఫీవర్‌గా మారుతుంది.

జ్వరం వస్తే వైద్యులను కలవాల్సిందేనా?

జ్వరం...లో గ్రేడ్ (99.5 డిగ్రీలు) ఉంటే ఫర్వాలేదు. కానీ శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 101 డిగ్రీలకు మించిపోయి పారాసిటమాల్ తీసుకుంటున్నా తగ్గుతూ, పెరుగుతూ, అదే పరిస్థితి రెండు రోజులపాటు కొనసాగితే వైద్యులను తప్పక సంప్రతించాలి. అలాగే జ్వరంతోపాటు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ఎర్రని మచ్చలు, దగ్గు, జలుబు, తలనొప్పి, చలి మొదలైన లక్షణాలు కూడా ఉన్నా తీవ్రంగా పరిగణించి వైద్య సహాయం తీసుకోవాలి.

మలేరియా

విపరీతమైన జ్వరంతోపాటు మత్తు, వాంతులు, తీవ్రమైన తలనొప్పి, చూపులో తేడా ఉండడం, పలకరిస్తే స్పందించకపోవడం లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకరోజు శరీర ఉష్ణోగ్రత చాలా తీవ్రంగా పెరిగిపోయి, మరుసటి రోజు తగ్గిపోవడం... మళ్లీ పెరిగిపోవడం.... ఇలా జ్వరంలో హెచ్చుతగ్గులు కనిపిస్తూ ఉంటే దాన్ని మలేరియా జ్వరంగా భావించాలి. మలేరియా ఫాల్సిఫారం లేదా వైవాక్స్ అనే రెండు రకాల జ్వరాలుంటాయి. వీటిలో ఫాల్సిఫారం తాలూకు మలేరియా మెదడుకూ పాకి 'సెరెబ్రల్ మలేరియా'నూ కలిగిస్తుంది.

ముత్యాల ముగ్గు





ఎస్.ఆర్. జ్యోతి
తిరుపతి

23 చుక్కలు
13 వచ్చే వరకు
సందుచుక్క



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫోటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33

ఈ-మెయిల్ :
features@andhrajyothy.com

జ్యోతికి ప్రభుత్వ సాయం

అంతర్జాతీయ పోటీల సన్నద్ధతకు రూ. 30.35 లక్షలు

చెక్‌ను అందజేసిన మంత్రి లోకేశ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): 'నా ఆవేదనను అర్థం చేసుకోండి' అంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన యర్రాజి జ్యోతి కథనానికి స్పందన లభించింది. అంతర్జాతీయస్థాయిలో అద్భుతంగా రాణిస్తున్నా, తన ప్రతిభకు తగిన ప్రోత్సాహం దక్కడం లేదంటూ విశాఖపట్నానికి చెందిన అథ్లెట్ జ్యోతి గతనెల 25న ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వాపోయింది. ఈ విషయాన్ని శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఏడాది జరిగే కామన్వెల్త్, ఆసియా క్రీడల సన్నద్ధత కోసం ఆమెకు రూ. 30.35 లక్షలు ప్రకటించింది. ఈ మేరకు తన కుటుంబసభ్యులతో కలిసి జ్యోతి.. మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో సోమవారం కలుసుకుంది. ఈ సందర్భంగా ఆమెకు లోకేశ్ చెక్‌ను అందజేశారు. భవిష్యత్‌లో జ్యోతి మరిన్ని అద్భుత విజయాలు సాధించేలా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు, జ్యోతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





మళ్లీ పెళ్లి చేసుకోనున్న ధవన్

న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ (40) మరోసారి వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నాడు. ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్ (36)తో ధవన్ ఏడాది కాలంగా సహజీవనం చేస్తున్నాడు. సోఫీ అబుధాబిలోని ఓ సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తోంది. అయితే వచ్చే నెలలో ఈ జోడీ వైభవంగా పెళ్లి చేసుకోవాలనుకుంటోంది. గతంలో ధవన్‌కు ఆస్ట్రేలియాకు చెందిన కిక్ బాక్సర్ ఆయేషా ముఖర్జీతో వివాహమైనప్పటికీ 2023లో విడాకులు తీసుకున్నాడు. వీరికి 11 ఏళ్ల కుమారుడున్నాడు. ధవన్‌కంటే ముందు తొలి వివాహంలో ఆయేషాకు ఇద్దరు కుమార్తెలున్నారు.

ఆ నలుగురే..

డబ్ల్యూపీఎల్ 3 రోజుల్లో

విదేశీ స్టార్ల బలంతో గుజరాత్ జెయింట్స్

విదేశీ స్టార్ ప్లేయర్లపైనే ఎక్కువగా ఆధారపడిన జట్టు గుజరాత్ జెయింట్స్.. ఆష్లే గార్డ్‌నర్, బెత్ మూనీ, సోఫీ డివైన్, జార్జియా వేర్హామ్‌లు మూలస్తంభాలుగా జట్టును తీర్చిదిద్దారు. వీరి అనుభవం, దూకుడుతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలని గుజరాత్ భావిస్తోంది. అయితే, చెప్పుకోదగ్గ భారత క్రికెటర్లు లేకపోవడం వారికి పెద్ద లోటే!



బలాలు: కెప్టెన్ గార్డ్‌నర్, బెత్ మూనీ, సోఫీ, జార్జియా జట్టుకు ప్రధాన బలం అనడంలో సందేహం లేదు. లీగ్‌లో మూనీ ఎంతో నిలకడైన ప్రదర్శన చేస్తుండగా.. గార్డ్‌నర్ తన పవర్ హిట్టింగ్‌తో అలరిస్తోంది. సోఫీ ఆల్‌రౌండ్ నైపుణ్యం జట్టుకు ప్లస్ కాగా.. వేర్హామ్ లెగ్ స్పిన్‌తోపాటు మంచి ఫినిషర్ కూడా. ఎక్కువ మంది మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉండడంతో ఈసారి టైటిల్ ఫేవరెట్ జట్లలో గుజరాత్‌ను ఒకటిగా పరిగణిస్తున్నారు. బౌలింగ్‌లో పేసర్ రేణుక, టిటాస్ సాధు ప్రధాన వనరులు.

బలహీనతలు: బలంగా చెప్పుకొన్న ఆ నలుగురు విదేశీ ఆటగాళ్లే జట్టుకు బలహీనతగా మారే అవకాశం ఉంది. గార్డ్‌నర్, మూనీ, డివైన్, వేర్హామ్‌లో ఎవరు గాయపడినా.. ఆ లోటును భర్తీ చేసే స్థాయి ప్లేయర్లు టీమ్‌లో లేరు. దీంతో టీమ్ సమతుల్యం దెబ్బతినే చాన్సులున్నాయి. ప్రత్యర్థులు భారత బ్యాటర్లను టార్గెట్ చేసే అవకాశం ఎక్కువగా ఉంది. స్పెషలిస్ట్ విదేశీ బౌలర్లు లేరు. గత మూడు సీజన్లలోనూ జెయింట్స్ ప్రదర్శన తడబడుతూనే సాగింది.

జట్టు

విదేశీ: బెత్ మూనీ (వికెట్ కీపర్), ఆష్లే గార్డ్‌నర్ (కెప్టెన్), జార్జియా వేర్హామ్, సోఫియా డివైన్, డాని వ్యాట్, కిమ్ గార్త్.

స్వదేశీ: భారతి ఫుల్మాలి, కనికా అహూజా, ఆయుషి సోనీ, కాష్వీ గౌతమ్, తనూజ కన్వర్, టిటాస్ సాధు, రేణుక సింగ్, అనుష్క శర్మ, యాస్తిక భాటియా, శివాని సింగ్, హ్యాపీ కుమారి, రాజేశ్వరి గైక్వాడ్.

షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జనవరి 10	యూపీ	నవీ ముంబై
జనవరి 11	ఢిల్లీ	నవీ ముంబై
జనవరి 13	ముంబై	నవీ ముంబై
జనవరి 16	బెంగళూరు	నవీ ముంబై
జనవరి 19	బెంగళూరు	వడోదర
జనవరి 22	యూపీ	వడోదర
జనవరి 27	ఢిల్లీ	వడోదర
జనవరి 30	ముంబై	వడోదర

బంగ్లాలో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం

ముస్తాఫిజుర్‌ను తప్పించడంపై నిరసన

ఢాకా: ఐపీఎల్ నుంచి తమ దేశ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తప్పించడంతో.. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కారాలు మిరియాలు నూరుతోంది. అందుకు నిరసనగా తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిషేధిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. ఐపీఎల్ మినీ వేలంలో ముస్తాఫిజుర్‌ను కోల్‌కతా కొనుగోలు చేసింది. అయితే, బంగ్లాలో హిందువులపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తున్న పలు హిందూ సంఘాలు.. ఆ దేశ ఆటగాళ్లను బ్యాన్ చేయాలని పిలుపునిచ్చాయి. దీంతో బీసీసీఐ.. రెహ్మాన్‌ను విడుదల చేయాలని కోల్‌కతా ఫ్రాంచైజీని ఆదేశించింది. అయితే, సహేతుకమైన కారణం చెప్పకుండా తమ ఆటగాడిపై వేటువేయడాన్ని బంగ్లా తప్పుబడుతోంది. అందుకు ప్రతిచర్యగా ఐపీఎల్ ప్రసారాలను బ్యాన్ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. భారత గడ్డపై టీ20 వరల్డ్‌కప్ ఆడబోమని, తమ మ్యాచ్‌ల్ని మరో చోటికి తరలించాలని ఐసీసీకి బంగ్లా లేఖ రాసింది.

నష్టమేమీ లేదు: బంగ్లాలో ఐపీఎల్ ప్రసారాలు ఆపితే భారత క్రికెట్‌కు, ఐపీఎల్‌కు నష్టం లేదని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ఇలాంటి స్పందన వస్తుందని ముందుగానే ఊహించామని చెప్పారు. భారత నిర్ణయాల్లో ఎటువంటి మార్పు ఉండదన్నారు.

శతక్కొట్టిన రూట్

- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 384
- ఆస్ట్రేలియా 166/2
- యాషెస్ చివరి టెస్ట్



సిడ్నీ: గత టెస్ట్ మాదిరిగా కాకుండా యాషెస్ సిరీస్ చివరి మ్యాచ్ ఐదు రోజులు కొనసాగేలా కనిపిస్తోంది. ఈ ఐదో టెస్ట్‌లో ఓవర్‌నైట్ స్కోరు 211/3తో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 384 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు 72 పరుగులతో ఆడుతున్న రూట్ ఆస్ట్రేలియా గడ్డపై తన అత్యుత్తమ స్కోరు (160) సాధించాడు. అయితే బ్రూక్ (84) సెంచరీ మిస్సయ్యాడు. నేసర్ నాలుగు, బోలాండ్, స్టార్క్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో రోజు ఆఖరికి 166/2 స్కోరు చేసింది. హెడ్ (91), నేసర్ (1) క్రీజులో ఉన్నారు.

లబుషేన్ మెడ పట్టుకున్న స్టోక్స్: రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్, ఆసీస్ బ్యాటర్ లబుషేన్ మధ్య మాటల యుద్ధం జరిగింది. తన ఓవర్‌ను పూర్తి చేసి వెళ్తున్న స్టోక్స్‌నుద్దేశించి లబుషేన్ ఏదో అన్నాడు. దానికి స్టోక్స్... లబుషేన్ మెడచుట్టూ చేతులు వేసి 'నోర్మూసుకో.. అని అనడమేకాదు ఓ అసభ్య పదంతో అతడిని దూషించాడు. అంపైర్లు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది.

3 టెస్ట్‌ల్లో అత్యధిక శతకాలు (41) చేసి పాంటింగ్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచిన రూట్. సచిన్ (51), కలిస్ (45) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

చెలరేగిన వైభవ్



- 8 వికెట్లతో భారత్ గెలుపు
- రెండో వన్డేలోనూ సౌతాఫ్రికా చిత్తు

బెనోని: వైభవ్ సూర్యవంశీ (24 బంతుల్లో ఫోర్, 10 సిక్స్‌లతో 68) అదిరే అర్థ శతకంతోపాటు పేసర్ కిషన్ సింగ్ (4/46) నిప్పులు చెరగడంతో.. దక్షిణాఫ్రికాతో అండర్-19 వన్డే సిరీస్‌ను యువ భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ సొంతం చేసుకొంది. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల (డ/లూ పద్ధతి) తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. జాసన్ రౌల్స్ (114) శతకం సాధించాడు. ఛేదనలో ప్రతికూల వాతావరణం కారణంగా లక్ష్యాన్ని 27 ఓవర్లలో 174 పరుగులకు కుదించారు. ఈ లక్ష్యాన్ని భారత్ 23.3 ఓవర్లలో 176/2తో ఛేదించింది. అర్ధ శతకం సాధించిన వైభవ్‌ను మైకేల్ పెవిలియన్ చేర్చాడు. వేదాంత్ త్రివేది (31 నాటౌట్), అభిజ్ఞాన్ (48 నాటౌట్) 81 పరుగులు జోడించడంతో.. భారత్ మరో 21 బంతులు మిగిలుండగానే గెలిచింది. సిరీస్‌లోని మూడో, ఆఖరి వన్డే బుధవారం జరగనుంది.



ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్ల గౌరవార్థం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ముంబైలో జరిగిన ఈవెంట్‌లో సారథులు హర్మన్‌ప్రీత్ (2025 వన్డే వరల్డ్‌కప్), దీపిక (2025 అంధ మహిళల టీ20 ప్రపంచకప్), రోహిత్ శర్మ (2024 టీ20 ప్రపంచ కప్)లతో నీతా అంబానీ.

జేఎస్‌డబ్ల్యూతో నీరజ్ తెగదెంపులు

న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌తో బంధానికి స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ముగింపు పలికాడు. ఈ నేపథ్యంలో తానే కొత్తగా వేల్ స్పోర్ట్స్ పేరిట అథ్లెట్ మేనేజ్‌మెంట్ సంస్థను నెలకొల్పాడు. నీరజ్ జాతీయ స్థాయి నుంచి ఒలింపిక్, వరల్డ్ చాంపియన్‌గా ఎదగడంలో జేఎస్‌డబ్ల్యూ కీలకంగా వ్యవహరించింది. ఇకనుంచి నీరజ్‌కు సంబంధించిన పోటీల ప్రణాళికలు, బ్రాండ్ ఒప్పందాలను వేల్ స్పోర్ట్స్ చూసుకుంటుంది.

మనోజ్ కొఠారి ఇకలేరు



కోల్‌కతా: భారత క్యూ స్పోర్ట్స్ దిగ్గజం, జాతీయ చీఫ్ కోచ్ మనోజ్ కొఠారి (67) తుదిశ్వాస విడిచారు. వారంరోజులుగా తమిళనాడు, తిరునల్వేలిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్.. సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 1990లో ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌గా నిలిచిన మనోజ్‌కు భార్య, కుమారుడు సౌరవ్, కూతురు శ్రేయ ఉన్నారు. సౌరవ్, శ్రేయ కూడా అంతర్జాతీయ బిలియర్డ్స్ ప్లేయర్లే.

బిజినెస్

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Ph: 99120 10888



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,37,400 ▲	1,25,950 ▲	2,56,500 ▲
విజయవాడ	1,40,000 ▲	1,29,000 ▲	2,43,000 ▲
విశాఖపట్నం	1,40,210 ▲	1,26,350 ▲	2,65,000 ▲
రాజమండ్రి	1,37,400 ▲	1,25,950 ▲	2,37,000 ▲
ప్రొద్దుటూరు	1,40,500 ▲	1,29,260 ▲	2,40,500 ▲
ముంబై	1,36,168 ▲	1,24,730 ▲	2,37,063 ▲

2030 నాటికి ఫార్మా పరిశ్రమ రూ.12 లక్షల కోట్లకు ..

ఫార్మెక్సిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశ ఫార్మా పరిశ్రమ జోరుకు తిరుగులేదని భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. ప్రస్తుతం 6,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న పరిశ్రమ టర్నోవర్ 2030 నాటికి 13,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.12 లక్షల కోట్లు)కు చేరే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్‌కు వివరించింది. గత ఆర్థిక సంవత్సరం 9.4 శాతం వృద్ధి రేటుతో 3,047 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.74 లక్షల కోట్లు) చేరిన ఔషధ ఎగుమతులు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరింత పెరుగుతాయని కూడా వివరించింది. ప్రస్తుతం దాదాపు 150కు పైగా దేశాలు మన దేశం నుంచి ఔషధాలు దిగుమతి చేసుకుంటున్నట్టు తెలిపింది.

నవ గ్లోబల్ నుంచి రూ.450 కోట్లు

నవ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సింగపూర్‌లోని అనుబంధ సంస్థ నవ గ్లోబల్ పీటీఈ లిమిటెడ్ షేర్ల బైబ్యాక్ నవ లిమిటెడ్‌కు కలిసి రానుంది. ఈ బైబ్యాక్ ద్వారా తమకు ఐదు కోట్ల అమెరికా డాలర్ల (సుమారు రూ.450 కోట్లు) నగదు అందుతుందని నవ లిమిటెడ్ ప్రకటించింది. నవ గ్లోబల్ పీటీఈ లిమిటెడ్ కంపెనీ.. నవ లిమిటెడ్‌కు పూర్తి అనుబంధ కంపెనీ. ఈ బైబ్యాక్ తర్వాత కూడా సింగపూర్ అనుబంధ సంస్థ ఈక్విటీలో తమకు 100 శాతం ఈక్విటీ వాటా ఉంటుందని తెలిపింది. ఇండిపెండెంట్ వాల్యుయేషన్ ప్రకారమే నవ గ్లోబల్ పీటీఈ లిమిటెడ్ కంపెనీ తన షేర్ల బైబ్యాక్ ప్రకటించిందని నవ లిమిటెడ్ పేర్కొంది.

మార్కెట్‌కు ట్రంప్ షాక్

సెన్సెక్స్ 322 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 446 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 322.39 పాయింట్ల నష్టంతో 85,439.62 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 78.25 పాయింట్లు కోల్పోయి 26,250.30 వద్ద క్లోజైంది. వెనెజువెలాపై యూఎస్ దాడితో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడంతో పాటు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపకపోతే భారత్‌పై సుంకాలను మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం స్టాక్ మార్కెట్లకు ప్రతికూలంగా పరిణమించిందని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 10 పైసల నష్టంతో రూ.90.30 వద్ద ముగిసింది.

పదేళ్లలో 10 కోట్ల కొత్త కొలువుల కల్పన

100 మిలియన్ జాబ్స్ పేరుతో కొత్త ప్రాజెక్ట్

నాస్కామ్ సహ వ్యవస్థాపకులు హరీష్ మెహతా



నూఢిల్లీ: దేశంలో ఉద్యోగాల కల్పన కోసం పారిశ్రామిక దిగ్గజాలు కూడా చొరవ తీసుకుంటున్నారు. ఇందుకోసం '100 మిలియన్ జాబ్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రకటించారు. వచ్చే పదేళ్లలో 10 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. నాస్కామ్ సహ వ్యవస్థాపకులు హరీష్ మెహతా, ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై) వ్యవస్థాపకులు ఏజే పటేల్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ పాలసీ (సీఐపీపీ) వ్యవస్థాపకులు కే యతీష్ రజావత్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ప్రస్తుత పరిస్థితి: ఆర్థిక వృద్ధి జోరుగా ఉన్నా ప్రస్తుతం దేశంలో ఉద్యోగాల కల్పన పెద్దగా లేదు. ఏటా 1.2 కోట్ల మంది జాబ్ మార్కెట్లోకి వస్తుంటే వీరిలో సగం మందికి కూడా సరైన కొలువులు దొరకడం లేదు. ఏటా కనీసం 80 నుంచి 90 లక్షల మందికైనా ఉద్యోగాలు లభిస్తే తప్ప నిరుద్యోగ సమస్య తీరదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గ నైపుణ్యాలు అభ్యర్థుల్లో లేకపోవడం కూడా నిరుద్యోగానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక పెద్దలే ఉద్యోగాల కల్పన కార్యక్రమానికి చొరవ తీసుకోవడం విశేషం.

కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు..

- ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ
- ఉద్యోగ కల్పన కేంద్రంగా ఆర్థిక అభివృద్ధి
- ప్రాంతాలు, రంగాల వారీగా ఉద్యోగ అవకాశాల పరిశ్రమల గుర్తింపు
- ఎక్కువ ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉన్న చిన్న పరిశ్రమలు, స్టార్టప్స్‌పై ప్రత్యేక దృష్టి
- ప్రధాన నగరాలకు వెలుపల చిన్న పరిశ్రమల విస్తరణ
- ఉద్యోగాల కల్పనకు అడ్డంకిగా ఉన్న సంస్థాగత అడ్డంకుల తొలగింపు
- ప్రభుత్వ, వ్యాపార ఆలోచనా విధానాల్లో మార్పు
- ప్రభుత్వం-పరిశ్రమలు, సమాజం మధ్య సమన్వయం

రూ.50 కోట్లతో రెయిన్‌బో ట్రౌట్ చేపల కేంద్రం

స్మార్ట్‌గ్రీన్ ఆక్వాకల్చర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్మార్ట్‌గ్రీన్ ఆక్వాకల్చర్ (ఎస్‌జీఏ).. శీతల ప్రాంతాల్లో పెరిగే రెయిన్‌బో ట్రౌట్ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని కందుకూరు మండలం గూడూరు వద్ద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఉష్ణ మండల ప్రాంతంలో ఈ తరహా చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయటం దేశంలో ఇదే తొలిసారి. సోమవారం నాడు ఈ రెయిన్‌బో ట్రౌట్ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రారంభించారు. శీతల ప్రాంతాల్లో పెరిగే ఈ చేపలను ఇక్కడ అదే వాతావరణంలో రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ (ఆర్‌ఏఎస్) విధానంలో పెంచుతున్నట్లు ఎస్‌జీఏ వ్యవస్థాపకుడు, ఎండీ ఆదిత్య రిత్విక్ నర్రా వెల్లడించారు. రూ.50 కోట్లతో ఐదెకరాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,200 మెట్రిక్ టన్నులని తెలిపారు.

విస్తరణ బాటలో రివర్ మొబిలిటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇండీ బ్రాండ్ పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయిస్తున్న రివర్ మొబిలిటీ తెలంగాణలో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని అత్తాపూర్, ఆర్‌సీపురం, హైటెక్ సిటీల్లో మూడు కొత్త స్టోర్లు ప్రారంభించింది. దీంతో తెలంగాణలో తమ స్టోర్ల సంఖ్య ఆరుకు చేరినట్టు కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అరవింద్ మణి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ తమకు ఏడు స్టోర్లు ఉన్నట్టు చెప్పారు. తమ వ్యాపార వృద్ధిలో రెండు తెలుగు రాష్ట్రాలది కీలక పాత్ర అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 స్టోర్లు ఉండగా మార్చి చివరికల్లా వీటిని 80కి చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. గత రెండేళ్లలో తమ కంపెనీ దేశ వ్యాప్తంగా 25,000 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించినట్లు తెలిపారు. ఒకసారి చార్జింగ్‌తో 110 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో కొత్త ఈవీ స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకురావాలని చూస్తున్నట్లు మణి వెల్లడించారు.

సామ్‌సంగ్ అన్ని ఉత్పత్తుల్లోనూ ఏఐ

లాస్‌వెగాస్ (అమెరికా): దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ కీలక ప్రకటన చేసింది. ఇకపై తమ సంస్థ తయారు చేసే ప్రతి ఉత్పత్తితో పాటు అన్ని సేవలకూ కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను జోడించనున్నట్లు సామ్‌సంగ్ కో-సీఈఓ టీఎం రోహ్ తెలిపారు. సామ్‌సంగ్ మొబైల్ ఫోన్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలు, వేరబుల్ గ్యాడ్జెట్లు, డిస్‌ప్లేలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తయారు చేస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	620
వరంగల్	582	గోదావరి	585
చిత్తూరు	663	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	152
వరంగల్	150	గుంటూరు	157
కరీంనగర్	150	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	153
కర్నూలు	150	నెల్లూరు	158
విశాఖపట్నం	143	అనంతపురం	158
గోదావరి	152		

ఇక బ్లాక్ ఆయిల్ నుంచి డీజిల్ తయారీ

విశాఖ హెచ్‌పీసీఎల్‌లో ఆర్‌యూఎఫ్ యూనిట్ ప్రారంభం



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) మరో ఘనత సాధించింది. బ్లాక్ ఆయిల్ నుంచి డీజిల్ తయారు చేసే రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ యూనిట్ (ఆర్‌యూఎఫ్)ను సోమవారం నాడు ప్రారంభించింది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3.55 మిలియన్ మెట్రిక్ టన్నులు. దేశంలో తొలి ఆర్‌యూఎఫ్ యూనిట్ ఇదే కావడం విశేషం. హెచ్‌పీసీఎల్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 8.33 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 15 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచుకునేందుకు కొద్ది సంవత్సరాల క్రితం రూ.32,000 కోట్లతో విస్తరణ పనులు చేపట్టింది. ఈ పనులన్నీ ఆర్‌యూఎఫ్‌తో పూర్తయ్యాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న క్రూడాయిల్‌ను రిఫైనరీలో శుద్ధి చేస్తే అందులో 60 శాతం వైట్ ఆయిల్స్ (పెట్రోల్, డీజిల్) వస్తాయి. మిగిలిన 40 శాతాన్ని బ్లాక్ ఆయిల్స్‌గా వ్యవహరిస్తారు. వాటి నుంచి బిటుమిన్, ఫ్యూయల్ ఆయిల్స్, నౌకలు నడపడానికి ఉపయోగించే ఎల్‌డీఓ వంటివి తయారుచేస్తారు. క్రూడాయిల్‌లో 60 శాతం వైట్ ఆయిల్స్ పోగా మిగిలిన దానిని రెసిడ్యూగా వ్యవహరిస్తారు. దీన్ని మరింత శుద్ధి చేసి లాభదాయకమైన ఉత్పత్తులు తయారు చేయడానికి ఉద్దేశించినదే ఆర్‌యూఎఫ్ ప్రాజెక్ట్. దీనికి ఎల్‌సీ-మ్యాక్స్ యూనిట్‌గా నామకరణం చేశారు. దేశంలో ఎక్కడా ఇలాంటిది లేదు. ఇదే మొదటిది. దీనిని ఎల్ అండ్ టీ నిర్మించింది. దీనికి అవసరమైన 2,200 టన్నుల రియాక్టర్‌ను గుజరాత్‌లోని హజీరాలో తయారు చేయించి సముద్ర మార్గంలో బార్జీల ద్వారా విశాఖపట్నం తీసుకువచ్చింది. ఇప్పుడు ఈ యూనిట్ ద్వారా రెసిడ్యూ (బ్లాక్ ఆయిల్స్) నుంచి కూడా డీజిల్ తయారుచేస్తారు. అంటే క్రూడాయిల్ నుంచి దాదాపుగా 93 శాతం వైట్ ఆయిల్స్ తీస్తారు.

జూన్ నాటికి 50 డాలర్లకు క్రూడ్

ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా

న్యూఢిల్లీ: ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మరింత తగ్గవచ్చని, జూన్ నాటికి పీపా 50 డాలర్లకు దిగిరావచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్టు అంచనా వేసింది. క్రూడ్ ధరల తగ్గుదల భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలంగా పరిణమించనుందని,వార్షిక జీడీపీ వృద్ధి రేటును అదనంగా 0.10-0.15 శాతం పెంచగలదని సోమవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు కలిగి ఉన్న వెనెజువెలాపై గత వారాంతంలో అమెరికా దాడికి చేసినప్పటికీ, ముడిచమురు ధరలు అంతగా పెరగలేదని రిపోర్టు పేర్కొంది. గత వారం రోజులుగా బ్యారల్ రేటు 60 డాలర్ల స్థాయిలోనే కదలాడుతోంది. దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే సమకూరుతోంది. అంతేకాదు, మొత్తం దిగుమతుల వ్యయంలో ఇంధన బిల్లుదే అధిక వాటా. గత డేటాను బట్టి చూస్తే క్రూడ్ ధర ప్రస్తుత స్థాయి నుంచి 14 శాతం మేరకు తగ్గితే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 శాతం మేర బలపడి రూ.87.5 స్థాయికి చేరవచ్చని అంచనా వేసింది. కాగా, చమురు నిల్వలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 55 డాలర్లకు దిగిరావచ్చని యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ అంచనా వేసింది.

బొండాడ ఇంజనీరింగ్‌కు రూ.627 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్.. ఏపీ ట్రాన్స్‌కో నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన 400/220 కేవీ హిందూపూర్ సబ్‌స్టేషన్ వద్ద 225 మెగావాట్లు/450 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటు చేయనుంది. ఎల్ఓఏ అందుకున్న ఏడాదిన్నరలో పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టు విలువ రూ.627 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. బిల్ట్-ఓన్-ఆపరేట్ (బీవోవో) పద్ధతిలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది.

కోర్టు ఉత్తర్వులంటే కనీస మర్యాద లేదు!

» పవర్‌ఫుల్ వ్యక్తి కింద పనిచేస్తున్నాం.. ఏమీ చేయలేరనే భావన

» విద్యాశాఖ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల అమలులో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని హైకోర్టు ఎండగట్టింది. పవర్‌ఫుల్ వ్యక్తి కింద పనిచేస్తున్నందున తమను ఎవరూ ఏమి చేయలేరనే భావనలో ఉన్నట్లు కనపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులంటే వారికి కనీస మర్యాద లేదంది. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి బి.శ్రీనివాసరావుపై సుమోటోగా కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణకు హాజరై సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలుకాకపోవడంపై వివరణ ఇవ్వాలని శ్రీనివాసరావును నిర్దేశించింది. విచారణను నెలరోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. కేజీబీవీల్లో పార్ట్‌టైం పీజీటీలుగా పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ బాధితులు 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేసు విచారణ విషయంలో ధర్మాసనం ఆ వ్యాఖ్యలు చేసింది.

ఏడాదిలో జెన్కోకు రూ.77 కోట్లు ఆదా!

» జెన్కో ఎండీ నాగలక్ష్మి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆర్థిక విధ్వంసాన్ని సరిచేయడం ద్వారా జెన్కోలో ఒక్క ఏడాదిలో రూ.77 కోట్లు ఆదా చేయగలిగింది. విద్యుత్తు ఉత్పత్తి, ఆర్థిక వ్యవహారాలపై సంస్థ ఎండీ నాగలక్ష్మి సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌బీఐ, యూబీఐ బ్యాంకుల నుంచి క్యాష్ క్రెడిట్(సీసీ), వర్కింగ్ క్యాపిటల్ డిమాండ్ లోన్స్(డబ్ల్యూసీడీఎల్)ను 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు 9.05 శాతానికి తీసుకునేవారని, బ్యాంకు అధికారులతో సంప్రదింపుల ద్వారా 2024-25లో దానిని 8.70 శాతానికి తగ్గించడం ద్వారా ఏడాదిలోనే రూ. 60 కోట్లు ఆదా చేయగలిగామని నాగలక్ష్మి వివరించారు. అదే విధంగా చెల్లింపులు, రెన్యువల్స్‌లో ఆలస్యం కారణంగా గతంలో విధించిన రూ. 17 కోట్ల జరిమానాను కూడా బ్యాంకుల నుంచి తిరిగి పొందగలిగామన్నారు. సమీక్షలో.. జెన్కో డైరెక్టర్లు సుజయకుమార్, అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తురంగ ప్రైవేటీకరణకు కూటమి వ్యతిరేకం

» ఉద్యోగులందరి కష్టంతోనే ట్రూడౌన్ సాధ్యమైంది: గొట్టిపాటి

» ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగం ప్రైవేటీకరణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి వ్యతిరేకమని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ-2026ను సోమవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ.. విద్యుత్తు ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శామ్యూల్, ప్రధాన కార్యదర్శి నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ కులగణనపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశారా..?

» ఆ వివరాలు సమర్పించండి.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన పూర్తిచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని.. విద్య, ఉద్యోగాల్లోనూ వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. కులగణనకు సంబంధించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశారా..? లేదా..? అనే వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

కూర్చుని మాట్లాడుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. పోలవరం ప్రాజెక్టును అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా 'పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును నిర్మించాలని చూస్తోం'దని గత నెల 16న తెలంగాణ ప్రభుత్వం దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఆ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జైదీప్ గుప్తా, బల్బీర్‌సింగ్ వాదనలు వినిపించారు. 'వరద జలాల పేరుతో ఏపీ 200 టీఎంసీలను అక్రమంగా మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల వాటా ఉంది. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీలను మళ్లిస్తే తెలంగాణ వాటాకు గండి పడుతుంది. వరద జలాల పేరుతో తెలంగాణకు కేటాయించిన నీటిని తరలించుకుపోయే కుట్ర ఇది. ప్రాజెక్టు పనులను తక్షణమే ఆపాలని, అనుమతులు లేకుండా ముందుకు వెళ్లొద్దని ఇప్పటికే కేంద్ర జల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కేంద్రం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలి. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలను తరలించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టును నిలిపివేయాలి. మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్రం పరిశీలించడం సమంజసం కాదు. గోదావరి నదిలో ఏపీకి ఎగువన తెలంగాణతోపాటు మరో ఆరు రాష్ట్రాలు ఉన్నాయి' అని సింఘ్వీ తెలిపారు. సీజేఐ జోక్యం చేసుకుని ఇది జలవివాదానికి సంబంధించిన అంశమా అని ప్రశ్నించారు. కాదని సింఘ్వీ బదులిచ్చారు. గోదావరి జలాల పంపకాలు ఇప్పటికే జరిగిపోయాయని, అయితే ఏపీ పోలవరం-నల్లమల సాగర్ పేరుతో విభజన చట్టం, గోదావరి ట్రిబ్యునల్, ఇతర నిబంధనలను ఉల్లంఘిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జలవివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం జనవరి 2న హైపవర్ కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. 3 నెలల్లో కమిటీ నివేదిక ఇవ్వనుందని, అప్పటి వరకూ ప్రాజెక్టు పనులు ఆపాలని కోరారు.

సమగ్రంగా సివిల్ సూట్ వేయండి..

జల వివాదాలకు సంబంధించి కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఇచ్చేవరకు వేచిచూడాలని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారానికి వేసిన కమిటీ ముందు సమస్యను చెప్పుకోవడానికి ఉన్న అభ్యంతరం ఏమిటని తెలంగాణను ప్రశ్నించారు. ఈ నెల 2నే కమిటీ ఏర్పాటైందని.. దాని ముందు అన్ని అభ్యంతరాలూ చెబుతామని.. అయితే 3 నెలల్లో అది నివేదిక ఇచ్చేవరకూ ప్రాజెక్టుపై స్టే ఇవ్వాలని కోరారు. సీజేఐ స్పందిస్తూ.. ఈ అంశంలో తెలంగాణ రిట్ పిటిషన్ విచారణార్హం కాదని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఏదో ఒక నిర్ణయం తీసుకునే ముందు మూడు ప్రధాన పరిష్కార మార్గాలను ప్రతిపాదించారు. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలని సూచించారు.

సీజేఐ మూడు ప్రతిపాదనలు..

1. ఇది రెండు రాష్ట్రాల నడుమ తలెత్తిన జల వివాదం కాబట్టి.. రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌గా కాకుండా, ఆర్టికల్ 131 ప్రకారం 'సివిల్ సూట్' దాఖలు చేయండి. అప్పుడు.. సమగ్ర విచారణ జరిపేందుకు కోర్టుకు వెసులుబాటు ఉంటుంది.
2. కేంద్రం ఇప్పటికే ఈ వివాదంపై ఒక హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. దాని ముందు తెలంగాణ తన అభ్యంతరాలను చెప్పుకోవాలి. ఆ అభ్యర్థనలను పరిశీలించి.. అవసరమైతే ఆ ప్రాజెక్టును నిలిపివేసే (స్టే ఇచ్చే) 'నిర్ణయాధికారాన్ని' ఆ కమిటీకి కల్పిస్తూ కోర్టు ఆదేశాలిచ్చే అవకాశం ఉంది.
3. కోర్టు తీర్పుల దాకా వెళ్లకుండా.. ఇరు రాష్ట్రాల ప్రతినిధులు కలిసి కూర్చుని.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చు.

వారం గడువివ్వండి: సింఘ్వీ

సుప్రీంకోర్టు మంచి సూచనలు ఇచ్చిందని సింఘ్వీ అన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో ఖరారు చేస్తామని తెలిపారు. ఇందు కోసం వారం గడువివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ సివిల్ సూట్ దాఖలు చేస్తే.. మహారాష్ట్ర, కర్ణాటక సహా గోదావరి పరీవాహక రాష్ట్రాలన్నిటినీ ప్రతివాదులుగా చేర్చాలని సీజేఐ సూచించారు. తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు.

నా ఇల్లు నేను కట్టుకుంటుంటే మీ అభ్యంతరం ఏమిటి?

» తెలంగాణకు ఏపీ తరఫు సీనియర్ న్యాయవాదుల ప్రశ్న

పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు విషయంలో తాము ఎటువంటి నిబంధనలనూ ఉల్లంఘించలేదని ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జైదీప్ గుప్తా, బల్బీర్‌సింగ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'మా ప్రాజెక్టు కేవలం ప్లానింగ్ దశలోనే ఉంది. పీఎఫ్ఆర్, డీపీఆర్ తయారీ కోసమే సర్వేలు, టెండర్ల ప్రక్రియ చేపట్టాం. నిర్మాణాలు చేయడం లేదు. పీఎఫ్ఆర్ తయారుచేస్తే తెలంగాణకు అభ్యంతరమెందుకు? నా ఇల్లు నేను నిర్మించుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏమిటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అడ్డుపడడం ఏమిటి? రాయలసీమలో కరువు ప్రాంతానికి నీళ్లు తీసుకెళ్లేందుకు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించాం. ముందస్తుగా పీఎఫ్ఆర్ తయారు చేసుకుంటే తెలంగాణకు వచ్చిన నష్టమేంటి? చివరగా అనుమతి ఇవ్వాల్సింది కేంద్రమే కదా! ఈ ప్రాజెక్టు కోసం మేం ఏ ఉత్తర్వులు, తీర్పులనూ ఉల్లంఘించడం లేదు' అని తెలిపారు. సీజేఐ జోక్యం చేసుకుని.. పరీవాహక రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి కదా అని ప్రశ్నించారు. అయితే ఈ ప్రాజెక్టుతో ఏ ఒక్క పరీవాహక రాష్ట్రానికి నష్టం వాటిల్లదని రోహత్గీ నివేదించారు. మరో సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా జోక్యం చేసుకుని.. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, రాష్ట్ర విభజన సమయంలోనే ఈ ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పోలవరం-నల్లమలసాగర్ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టు అని స్పష్టత ఇచ్చారు. 'గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలుస్తున్న నీటిని కరవు ప్రాంతమైన రాయలసీమకు అందించాలన్నదే మా ఉద్దేశం. సముద్రంలో కలిసే నీళ్లు కూడా మేం వాడుకోకూడదా? రాష్ట్ర విభజనలో హైదరాబాద్ కోల్పోవడంతో ఏపీకి తీరని నష్టం జరిగింది. తెలంగాణ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరిపై అనేక ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చా' అని రోహత్గీ, గుప్తా ప్రశ్నించారు. దీనిపై సీజేఐ స్పందించారు. 'ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉండొచ్చు. ఒకవేళ భవిష్యత్‌లో ఈ ప్రాజెక్టు నిబంధనలకు విరుద్ధమని తేలి ఆగిపోతే.. ఇప్పుడు ఆ ప్లానింగ్, డాక్యుమెంటేషన్ కోసం చేసిన ఖర్చు సంగతి ఏమిటి? ప్రజాధనం వృథా అయినట్లే కదా' అని ప్రశ్నించారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ఫీజు 50 వేలు

» ఖరారు చేస్తూ తీర్పు వెలువరించిన హైకోర్టు

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ ఫీజును రూ.50 వేలుగా ఖరారు చేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించింది. నామినేషన్ ఫీజును ఒకేసారి రూ.30వేల నుంచి రూ.1.25 లక్షలకు పెంచడాన్ని తప్పుబట్టింది. మరోవైపు గతంలోలాగే నామినేషన్ ఫీజును రూ.30 వేలుగా ఉంచాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. అలాగే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలన్న అభ్యర్థనను కూడా తిరస్కరించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం తీర్పు ఇచ్చారు.

విజయవాడ జైలుకు జోగి సోదరులు

» ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ముగిసిన కస్టడీ

ములకలచెరువు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌ను, ఆయన సోదరుడు రామును సోమవారం విజయవాడ జైలుకు తరలించారు. ఈ కేసులో నిందితులైన జోగి సోదరులను మూడు రోజుల కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కస్టడీ గడువు ముగియడంతో ఆదివారం రాత్రి వారిని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. రాత్రి పొద్దుపోవడంతో అక్కడి నుంచి మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. సోమవారం ఉదయం మదనపల్లె సబ్‌జైలు నుంచి ప్రత్యేక బందోబస్తు మధ్య విజయవాడకు తీసుకెళ్లారు

షిబు, జినేష్‌లను కస్టడీకి ఇవ్వండి

» కోర్టులో ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

విజయవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న షిబు, జినేష్‌లను నాలుగు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు విజయవాడ ఆరో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేరళకు చెందిన వారు ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుకు భారీగా స్పిరిట్, కార్మెల్ సరఫరా చేశారు. ఆ ఇద్దరినీ ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి కొద్దిరోజుల క్రితం మదనపల్లె జైలుకు తరలించారు. తర్వాత భవానీపురం ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. వారి నుంచి మరింత సమాచారం రాబట్టడానికి నాలుగు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

రేపు మత్స్యకార సమాఖ్య ఎన్నికలు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు బుధవారం విజయవాడలోని ఆప్కాఫ్ కార్యాలయంలో జరగనున్నాయి. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశారు. సమాఖ్య చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు అదే రోజు నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన, అవసరమైతే పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,136 మత్స్యకార సహకార సంఘాలున్నాయి. రాష్ట్ర సమాఖ్య చైర్మన్, వైస్‌చైర్మన్‌ను జిల్లా సమాఖ్యల ద్వారా ఎన్నుకోవాల్సి ఉంది. ఈ పదవులపై అధికార పార్టీలో రెండు వర్గాలు పోటీ పడుతున్నట్లు సమాచారం.

ఉద్యాన పంటల వారీగా ప్రణాళికలు: అచ్చెన్న

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన రైతులు పండించే పంటలకు ప్రణాళికలను పంటల వారీగా సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో ఉద్యానశాఖపై డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'కోకో సహా అన్ని పంటల ధరలపై ముందస్తు అంచనాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించాలి. సూక్ష్మసేద్య పరికరాలు కోరిన ప్రతి ఉద్యాన రైతుకు అందించాలి. సూక్ష్మసేద్యంలో కొత్త విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలి. మామిడిలో తెగుళ్ల నివారణపై తగిన సూచనలివ్వాలి. మిర్చిసాగు, నాణ్యత, దిగుబడి, ధరలపై రైతులు, వ్యాపారులతో చర్చలు జరిపాలి' అని ఆదేశించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నటి రాశికి క్షమాపణలు చెప్పిన అనసూయ



నటి రాశికి యాంకర్ అనసూయ క్షమాపణలు చెప్పారు. ఈమేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కొన్ని రోజుల క్రితం నటుడు శివాజీ ఓ సినిమా ఈవెంట్లో మాట్లాడుతూ హీరోయిన్ల వస్త్రధారణపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అనసూయ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే తాజాగా ఈ వివాదంలోకి నటి రాశి ప్రవేశించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రాశి మాట్లాడుతూ 'ఓ కామెడీ షోలో రాశి ఫలాలు అనే పదం ఉపయోగించారు. రాశి గారి ఫలాల గురించి మాట్లాడుతున్నావా? అని లేడీ యాంకర్ అడిగింది. ఆమె అలా ఎలా అడుగుతుంది? రాశి ఫలాలు అని అనడం మామూలే. కానీ రాశి గారి ఫలాలు అనడంలో నేనున్నాను. ఆ యాంకర్ నా గురించి మాట్లాడింది. అక్కడ ఉన్న లేడీ జడ్జి కూడా నవ్వింది. నేను ఆ స్థానంలో ఉండి ఉంటే..షో ఆపేసి రాశి గారి ఫలాలు అని ఎందుకు అంటున్నారు? అని అడిగేదాన్ని. కామెడీ చెయ్యొచ్చు కానీ బాడీ షేమింగ్ చేయడానికి కన్న తల్లిదండ్రులకే హక్కు లేదు. దీన్ని లీగల్ ఇష్యూ చేద్దామనుకున్నా. అమ్మ వారించడంతో ఆగిపోయాను' అని తెలిపారు. తర్వాత సదరు కామెడీ షో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఆ యాంకర్ అనసూయనే అని స్పష్టమైంది. దీంతో రాశి వ్యాఖ్యలపై తాజాగా అనసూయ స్పందిస్తూ 'మూడేళ్ల క్రితం తెలుగు సరిగ్గా రానితనంపై చేసిన స్కిట్‌లో మీ పేరుని ఉపయోగించి నా నోటి నుంచి డబుల్ మీనింగ్ డైలాగ్ చెప్పించారు. అది రాయించి డైరెక్ట్ చేయించిన వ్యక్తుల్ని ఆ రోజే నేను నిలదీసి ఉండాల్సింది. కానీ, అప్పటికి నాకు ఉన్న శక్తి అందుకు సహకరించ లేదు. ఇప్పుడు వెనక్కి వెళ్లి దాన్ని సరిదిద్దలేను. కొన్నాళ్ల తర్వాత నాలో వచ్చిన మార్పును మీరు గమనించవచ్చు. నా బాధ్యతగా తప్పుని అంగీకరిస్తూ మీకు క్షమాపణలు చెబుతున్నాను' అని పేర్కొన్నారు.

శరవేగంగా చిత్రీకరణ



మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో పాన్ వరల్డ్ స్థాయిలో 'వారణాసి' అనే సినిమా రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. గ్లోబల్ హీరోయిన్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లోని పలు లొకేషన్లలో జరుగుతున్నట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ చిత్ర పరిశ్రమలోనే అత్యంత ఖరీదైన సినిమాగా నిలువనున్నదని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు రాజమౌళి ప్రతి విషయంలోనూ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మహేశ్‌బాబు 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్నారు. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణ మరో ఎనిమిది నెలలపాటు కొనసాగనుందని తెలుస్తోంది. 2027 మార్చిలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

క్రేజీ కల్యాణం



తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేశ్ వీకే కీలక పాత్రలో కనిపించనున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసమ్ జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. పెళ్లి చుట్టూ జరిగే ఆసక్తికరమైన కథాంశంతో ఇది రూపొందుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులనూ చిత్రం అలరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రావణ్ కటికనేని, డీఓపీ: శ్యామ్ దూపాటి, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారు



టీజీ విశ్వప్రసాద్

'మా సంస్థలోనే అతిపెద్ద చిత్రం 'రాజాసాబ్'. 'బాహుబలి'కి ముందు ప్రభాస్ ఎలా కనిపించేవారో.. ఇందులో అలానే ఉంటారు. చిత్రంలోని అన్ని అంశాలూ అలరిస్తాయి. సంజయ్ దత్, బొమన్ ఇరానీ, జరీనా వహాబ్ పాత్రలు చిత్రానికి ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ప్రభాస్ కథానాయకుడిగా ఆయన నిర్మించిన చిత్రం 'ద రాజాసాబ్'. దర్శకుడు మారుతి ఈ హారర్ థ్రిల్లర్‌ను తెరకెక్కించారు. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ నెల 9న చిత్రం విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్రం నుంచి 'నాచె నాచె' పాటను మేకర్స్ ముంబైలో విడుదల చేశారు. ఇది మిథున్ చక్రవర్తి హీరోగా నటించిన అలనాటి బాలీవుడ్ చిత్రం 'డిస్కో డ్యాన్సర్' లోని 'నాచె నాచె' సూపర్ హిట్ సాంగ్‌కు రీమిక్స్ కావడం విశేషం. ఈ కార్యక్రమంలో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ' ఇందులో వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారు. సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది' అని అన్నారు. 'ప్రభాస్ తనొక సూపర్ స్టార్ అని అనుకోరు. తనని అందరూ గొప్పగా ట్రీట్ చేయాలని భావించరు. ఈ సినిమాలో ఓ రోల్ ఉందని మారుతి ఫోన్ చేశారు. 'ప్రభాస్ నటిస్తున్నారా.. అయితే వెంటనే ఓకే చేసేయండి' అని మా ఆవిడ అన్నారు. ఆమెకు ప్రభాస్ అంటే అంతిష్టం. ఆవిడకే కాదు ఆయనంటే అందరికీ ఇష్టమే' అని బొమన్ ఇరానీ చెప్పారు. 'ఈ సినిమాలో ప్రభాస్‌తో నటించినందుకు ఆనందంగా ఉంది' అని నిధి అగర్వాల్ తెలిపారు. 'తెలుగులో అడుగుపెట్టాలనే నా కోరిక 'రాజాసాబ్'తో తీరింది' అని మాళవిక మోహనన్ పేర్కొన్నారు.

లెనిన్ తొలి గీతం

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సె జంటగా మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తోన్న చిత్రం 'లెనిన్'. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'వారెవా...వారెవా..' అంటూ సాగే తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను అనంత



శ్రీరామ్ రాయగా తమన్ స్వరాలు సమకూర్చారు. శ్వేతా మోహన్, జుబిన్ నోటియాల్ అద్భుతంగా ఆలపించారు. సినిమాలోని భావోద్వేగాలను ఈ పాట చక్కగా ప్రతిబింబిస్తోంది. కాగా, ఈ చిత్రం ఇప్పటికే 70 శాతం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. మిగతా భాగం కూడా శరవేగంగా చిత్రీకరించి ఈ ఏడాది మే 1న ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.


ఆద్యంతం నవ్విస్తుంది

అనిల్ సుంకర

'నారీ నారీ నడుమ మురారీ' పండుగ సినిమా. ప్రేక్షకులను ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతుంది' అని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్‌పై శర్వానంద్ హీరోగా ఆయన నిర్మించిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారీ'. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న విడుదలవుతోంది. తాజాగా చిత్రవిశేషాలను మీడియాతో ముచ్చటించారు అనిల్. 'సినిమాను అందరికీ నచ్చేలా వినోదభరితంగా తీర్చిదిద్దాం. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ విపరీతంగా నచ్చుతుంది. కంటెంట్‌ను నమ్మి చేసిన చిత్రమిది. అందుకే బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. శర్వానంద్ పాత్రను చాలా ఆసక్తికరంగా డిజైన్ చేశాడు దర్శకుడు రామ్ అబ్బరాజు. ఆయన కెరీర్‌కు మంచి బూస్టనిస్తుందీ చిత్రం. హీరోయిన్లు సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్స్ అద్భుతంగా నటించారు. శ్రీ విష్ణు కామియో అదిరిపోతుంది. విజువల్స్, సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తాయి. సినిమా క్షణం కూడా బోర్ కొట్టదు. ప్రేక్షకులకు మంచి ఫుల్ మీల్స్‌లా ఉంటుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుపెట్టుకునే సినిమా ఇది. విజయంపై పూర్తి నమ్మకముంది. ఈ చిత్రంతో పాటు సంక్రాంతికి విడుదలయ్యే అన్ని సినిమాలు ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆశిస్తున్నాను' అని చెప్పారు.



'భోగి' సందడి



శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం 'భోగి'. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంపత్‌నంది దర్శకుడు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. 1960 బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా కోసం ఓ భారీ సెట్ వేశారు. ఆనాటి ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నేపథ్యంలో సాగే కథ ఇది. కళాదర్శకుడు కిరణ్‌కుమార్ మన్నె రూపొందించిన ఈ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను సోమవారంనుంచి చిత్రీకరిస్తున్నారు. ఇంతకుముందెన్నడూ తను పోషించని ఓ విభిన్న పాత్రను ఇందులో శర్వా చేస్తున్నారు. భీమ్స్ సంగీత దర్శకుడు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'భోగి' చిత్రం విడుదలవుతుంది.

అమ్మవారి మహిమలు తెలిపేలా..



సుబ్బు, ప్రియాంక జంటగా తోట కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'దక్షిణ కాళీ'. సత్యవాణి మీసాల నిర్మిస్తున్నారు. హీరోయిన్ అర్చన ఇందులో అమ్మవారి పాత్రలో కనిపించనున్నారు. ఫిబ్రవరిలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదలవుతోందీ సినిమా. తాజాగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తోట కృష్ణ మాట్లాడుతూ 'అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చుతుంది' అని అన్నారు. 'సినిమాను మంచి కంటెంట్‌తో రూపొందించాము. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుంది' అని సత్యవాణి మీసాల చెప్పారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- ఇండియా నుంచి వెళ్లిన పాలకొల్లు టెకీ దంపతుల మృతి
- ఎయిర్‌పోర్టు నుంచి కారులో ఇంటికి వెళ్తూ డివైడర్‌ను ఢీకొనడంతో ఘటన.. వారి పిల్లలకు తీవ్రగాయాలు


వారం క్రితం అమెరికా వెళుతూ విమానంలో కృష్ణ కిశోర్, భార్య, పిల్లల సెల్ఫీ

పాలకొల్లు టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని వాషింగ్టన్‌లో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కొటికలపూడి కృష్ణ కిశోర్ (టిన్ను-52), భార్య ఆశ కన్నా(45) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కృష్ణ కిశోర్ కుమారుడు, కుమార్తెలకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కిశోర్ 1999లో అమెరికా వెళ్లి, అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడ్డారు. గత నెలలో కుటుంబంతో పాలకొల్లు వచ్చి, బంధుమిత్రులను కలిసి ఎంతో సంతోషంగా గడిపారు. వారం క్రితమే తిరిగి అమెరికా వెళుతూ, మార్గమధ్యంలో దుబాయ్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నట్టు ఆయన సోదరుడు కృష్ణ తెలిపారు. అక్కడి నుంచి శనివారం అమెరికా బయలుదేరిన కిశోర్ కుటుంబం, ఎయిర్ పోర్టు నుంచి ఇంటికి కారులో వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ఘోరం చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు.

కొండెక్కిన కోడి



- విశాఖలో రికార్డు స్థాయికి ధర
- బ్రాయిలర్ స్కిన్‌లెస్ కిలో 300.. బెజవాడలో 350

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కోడి మాంసం ధర రికార్డు స్థాయికి చేరింది. విశాఖలో బ్రాయిలర్ స్కిన్‌లెస్ కిలో రూ.300 పలుకుతోంది. కోస్తాలోని మిగిలిన ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే ధర ఉంది. విశాఖలో చికెన్ ధర గతంలో కిలో రూ.290 వరకూ వెళ్లింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి రూ.300కు చేరింది. బెజవాడలో ఇంకా ఎక్కువ ధర ఉంది. కొన్ని దుకాణాల్లో రూ.350కి విక్రయిస్తున్నారు. చాలాకాలంగా బ్రాయిలర్ కోళ్ల పరిశ్రమ ఇబ్బందుల్లో ఉంది. ధరలు లేకపోవడం ఇత్యాది కారణాలతో పౌల్ట్రీ రైతులు గతేడాది సెప్టెంబరు నుంచి కోళ్ల పెంపకం తగ్గించారు. కార్పొరేట్ కంపెనీలు కూడా కోళ్ల పెంపకానికి వెనకడుగు వేశాయి. చాలా ఫారాల్లో పూర్తిగా నిలిపివేయగా, మరికొన్ని చోట్ల సామర్థ్యంలో సగం, అంతకంటే తక్కువ మాత్రమే పెంపకం చేపట్టారు. దీంతో ప్రస్తుతం మార్కెట్ డిమాండ్‌కు సరిపడా కోళ్లు లేక ధర పెరిగిపోయింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ దాదాపు అన్ని చోట్ల కొరత ఉంది. శీతాకాలంలో కోడి మూడు నుంచి నాలుగు కిలోల బరువు పెరుగుతుంది. ప్రస్తుతం డిమాండ్ తీవ్రత దృష్ట్యా ఫారాల్లో రెండు నుంచి రెండుంపావు కిలోల బరువు వచ్చేసరికి అమ్మేస్తున్నారు. ఉత్తరాంధ్ర కంటే ఒడిశాలో ధర పది రూపాయలు తక్కువ ఉండటంతో శ్రీకాకుళం నుంచి విశాఖ వరకు పలువురు వ్యాపారులు ఒడిశా నుంచి కోళ్లు తెస్తున్నారు. అదే సమయంలో విశాఖ జిల్లా నుంచి గోదావరి జిల్లాలకు కోళ్లను రవాణా చేస్తున్నారు. పరిశ్రమ కుదుటపడే వరకు రైతులు, కార్పొరేట్ కంపెనీలు ఆచితూచి కోళ్ల పెంపకం చేపడుతున్నట్టు కోళ్ల వ్యాపారి తాత్రాజు అప్పారావు చెప్పారు. ప్రస్తుతం ధరలు మరికొంత పెరిగే అవకాశం ఉందన్నారు.

భార్యను ఎత్తుకెళ్లాడని నరికేశాడు

- పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి దారుణ హత్య
- సోదరులతో కలిసి వేటకొడవళ్లతో దాడి
- తనకల్లు పోలీస్ స్టేషన్ ఎదుటే ఘటన


ఈశ్వరప్ప

తనకల్లు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలితీసుకుంది. తన భార్యను ఎత్తుకెళ్లిపోయాడన్న ఆగ్రహంతో ఆమె భర్త.. తన సోదరులతో కలిసి సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్ ఎదుటే నరికేశాడు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర కథనం మేరకు, తనకల్లు మండలం మార్పురివాండ్లపల్లికి చెందిన ఇడగొట్టు ఈశ్వరప్ప(40)ను, ఇదే మండలంలోని రాగినేపల్లికి చెందిన ఎర్రి హరి.. తన సోదరులు ఎర్రి చెన్నప్ప, గంగులప్ప, శంకరప్పతో కలిసి వేటకొడవళ్లతో నరికి చంపేశారు. ఎర్రి హరి భార్య నాగ శిరీషను ఇడగొట్టు ఈశ్వరప్ప ఈ నెల ఒకటో తేదీన తీసుకుపోయాడు. హరి ఫిర్యాదు మేరకు తనకల్లు పోలీసులు గాలించి తిరుపతి జిల్లా గూడురులో ఉన్న ఈశ్వరప్ప, నాగ శిరీషతోపాటు, వారి వెంట ఉన్న నాగ శిరీష బంధువు రమ్యశ్రీని పట్టుకుని, తనకల్లు పోలీస్ స్టేషన్‌కు సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు తీసుకొచ్చారు. పోలీసు వాహనం నుంచి ఇడగొట్టు ఈశ్వరప్ప దిగగానే.. అక్కడే మాటు వేసి ఉన్న హరి, నలుగురు అన్నదమ్ములూ వేట కొడవళ్లతో నరికి పారిపోయారు. ఆ వెంటనే మహిళలు భయంతో పరుగులు తీశారు. ఈశ్వరప్పను పోలీసులు 108లో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం జరిపించి, బంధువులకు అప్పగించారు. దాడి జరిగిన వెంటనే పారిపోయిన నాగ శిరీష, రమ్యశ్రీ.. పరాకువాండ్లపల్లి వద్ద ఓ తోటలో దాక్కోగా, పోలీసులు గాలించి ఇద్దరినీ పుట్టపర్తి వన్‌స్టాప్ కౌన్సెలింగ్ సెంటర్‌కు తరలించారు. నాగ శిరీషతో ఈశ్వరప్పకు వివాహేతర సంబంధం ఏర్పడిందని, అందుకే ఆమెను తీసుకువెళ్లాడని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టామని పేర్కొన్నారు. కాగా, నెల క్రితమే ఈశ్వరప్ప భార్య విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఇప్పుడు తండ్రి హత్యతో.. ఎనిమిదో తరగతి చదువుతున్న వారి కుమార్తె దీప్తి ఒంటరిగా మిగిలిపోయింది.

రమ్యంగా రంగవల్లులు!

బాలికల నుంచి బామ్మల వరకు.. 'ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ'కి రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్య స్పందన


కనిగిరిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న 96 ఏళ్ల వృద్ధురాలు


కర్నూలు జిల్లా ఆదోనిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు(పవర్డ్ బై సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ బిస్కెట్లు.. టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా. ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ వారి భారత్‌వాసీ అగర్‌బత్తి) 2 తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3,4,5 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తోపాటు అనేక కన్సొలేషన్ బహుమతులను సొంతం చేసుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాలు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఎంపికైన 30 మంది మహిళలకు ఈ నెల 10న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ఎంపికైన 33 మంది మహిళలకు ఈ నెల 12న హైదరాబాద్‌లో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.2,40,000కు పైగా బహుమతులు, ఇంకా గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి. కాగా, ఏపీ జిల్లాల్లో ముగ్గుల పోటీల్లో పదేళ్ల వయసున్న బాలికల నుంచి 74, 96 ఏళ్ల బామ్మల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్నూలులో పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా టీజీవీ గ్రూప్ జూనియర్ చైర్మన్, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వ్యవహరించి బహుమతులు అందజేశారు. కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో తొలిసారి నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 40 మంది మహిళలు, మార్కాపురం జిల్లా కనిగిరిలో 365 మంది, గిద్దలూరులో 200 మందికిపైగా పాల్గొన్నారు. కనిగిరి పోటీల్లో 96 ఏళ్ల వృద్ధురాలు చలువాది గురవమ్మ ముగ్గు వేశారు. గత పదేళ్లుగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. బాపట్లలో 74 ఏళ్ల వృద్ధురాలు ఎం.వెంకటేశ్వరమ్మ కన్సొలేషన్ బహుమతి అందుకున్నారు.




విశాఖలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కోస్తాలో తీవ్రంగా మంచు

500 మీటర్ల కంటే తక్కువగా విజిబిలిటీ

- బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కోస్తాలోని అనేక ప్రాంతాల్లో దట్టంగా మంచు కురుస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ మంచు కొనసాగింది. గాలిలో తేమశాతం 90 నుంచి 100 వరకు నమోదైంది. కొన్నిచోట్ల ఉదయంపూట విజిబిలిటీ 500 మీటర్ల కంటే తక్కువకు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోస్తాలో అధికపీడనం కొనసాగడంతో మంచు కురుస్తోందని, మరో నాలుగు రోజులు అల్లూరి జిల్లా, పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం జిల్లా వరకు ఎక్కువగా, మిగిలిన ప్రాంతాల్లో ఒక మోస్తరుగా మంచు ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆగ్నేయ, దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. 24 గంటల్లో మరింత బలపడనుంది.

గన్నవరంలో దిగలేక హైదరాబాద్‌కు

గన్నవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు గన్నవరం విమానాశ్రయాన్ని మూసేసింది. దీంతో ఉదయం ల్యాండ్ అవ్వాల్సిన విమానాలను హైదరాబాద్ మళ్లించారు. ఢిల్లీ నుంచి ఉదయం 5.45 గంటలకు బయలుదేరిన ఎయిర్ ఇండియా 2571 విమానం సరైన సమయానికి 8.15కు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంది. ఎయిర్‌పోర్టును కమ్మేసిన దట్టమైన పొగమంచుతో పూర్ విజిబులిటీ ఉంది. దీంతో విమానం ల్యాండ్ కావడం అసాధ్యమైంది. గాలిలో ఏడు రౌండ్లు చక్కర్లు కొట్టింది. పరిస్థితి మెరుగుపడకపోవడంతో విమానం హైదరాబాద్‌లో ల్యాండ్ అయింది. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం వచ్చింది. దానిలో 270 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఎయిర్‌పోర్టులో ఒకరి దుర్మరణం

గన్నవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): లగేజ్ ట్రాక్టర్ కిందపడి ఎయిరిండియా ఉద్యోగి ఒకరు గన్నవరం విమానాశ్రయంలో దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీకే ఆదిత్య ఆనంద్ (32) కేరళలోని కోజికోడ్ ప్రాంతానికి చెందినవారు. విమానాశ్రయంలో ఎయిరిండియా సంస్థలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ విభాగంలో పని చేస్తున్నారు. సోమవారం ఉదయం గేర్‌లో ఉన్న లగేజ్ ట్రాక్టర్‌ను నడిపేందుకు సిద్ధం చేస్తుండగా, ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపు తప్పింది. అక్కడే ఉన్న ఆదిత్య ఆనంద్ ట్రాక్టర్ టైర్ల కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు.



పొలంలో హత్యకు గురైన వెంకటేశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి, ట్రాక్టర్‌పైనే రక్తపు మడుగులో గోవిందు

భగ్గుమన్న పాతకక్షలు

ప్రతీకార దాడిలో అన్నదమ్ములు బలి

- ముగ్గురిపై కత్తులతో దాడి చేసిన ప్రత్యర్థులు
- మరొక సోదరుడి పరిస్థితి విషమం
- తప్పించుకొని స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ స్టేషన్‌కు..
- ముగ్గురూ మూడు చోట్ల ఉండగా పథకం ప్రకారం వెళ్లి దాడి
- కర్నూలు జిల్లా కందనాతిలో జంట హత్యలు

కర్నూలు/ఎమ్మిగనూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పాత కక్షలు భగ్గుమన్నాయి. ప్రత్యర్థుల దాడిలో కందనాతి గ్రామానికి చెందిన అన్నదమ్ములు బోయ పరమేశ్ (35), బోయ వెంకటేశ్ (55) దారుణ హత్యకు గురయ్యారు. మరో సోదరుడు బోయ గోవిందు (36) తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రి పాలయ్యారు. మరో ఇద్దరు మహిళలు, ఐదేళ్ల బాలుడు గాయపడ్డారు. 2024లో జరిగిన తండ్రీ కొడుకుల హత్యకు ప్రతీకారంగా ఈ జంట హత్యలు జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులు పక్కా ప్రణాళికతో ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. 2024 ఫిబ్రవరి 21న కందనాతి గ్రామంలో దేవర మహోత్సవం జరిగింది. ఆ సమయంలో కుళాయి నీళ్ల పట్టుకునే క్రమంలో పక్కపక్క ఇళ్లలో ఉన్న బిక్కి నరసింహులు, బోయ వెంకటేశ్ కుటుంబాల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ.. ఇరువర్గాల దాడులకు కారణమైంది. నాటి ఆ ఘర్షణలో బిక్కి నరసింహులు, ఆయన కుమారుడు బిక్కి రవి తీవ్ర గాయాలపాలై.. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ ఘటనలో బోయ గోవిందు, బోయ వెంకటేశ్, బోయ పరమేశ్ సహా 12 మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తర్వాత వారు బెయిల్‌పై బయటకొచ్చారు. కేసు విచారణలో ఉండడంతో, శాంతిభద్రతల దృష్ట్యా ఇరువర్గాలకు చెందిన కుటుంబాలను పోలీసులు కొన్ని నెలలపాటు గ్రామంలోకి రాకుండా కట్టడి చేశారు. గత ఏడాది దసరా పండుగకు తిరిగి ఇరువర్గాల కుటుంబాలు గ్రామానికి చేరుకున్నాయి.

పక్కా ప్రణాళికతోనే హత్య: సోమవారం పక్కా ప్రణాళికతో ఈ దాడులు జరిగాయి. బోయ గోవిందు భార్య వీరేషమ్మ, ఐదేళ్ల కుమారుడు లోకేంద్రతో కలిసి ట్రాక్టర్‌పై పొలం నుంచి ఇంటికి వస్తుండగా.. సచివాలయం దగ్గరలో బిక్కి దుబ్బ నరసింహులు, బిక్కి లక్ష్మయ్య, బిక్కి వెంకటేశ్ వారి ట్రాక్టర్‌కు మరో ట్రాక్టర్‌ను అడ్డం పెట్టి గోవిందుపై గడ్డపారతో దాడి చేశారు. కడుపులోకి గడ్డపార బలంగా చొచ్చుకెళ్లింది. భర్తను కాపాడుకోవడానికి భార్య వీరేషమ్మ అడ్డుకోగా ఆమెతో పాటు లోకేంద్రకు గాయాలయ్యాయి. నిందితులు అక్కడి నుంచి బోయ పరమేశ్ (35) ఇంటికి వెళ్లి.. గోవిందు, ఆయన భార్య జయమ్మలపై మారణాయుధాలతో దాడి చేయడంతో పరమేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. అంతటితో ఆగకుండా గ్రామానికి సమీపంలోని ఆముదం పొలానికి నీళ్లు పెడుతున్న బోయ వెంకటేశ్ (55) వద్దకు వెళ్లి మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. వరుసగా జరిగిన ఈ దాడుల్లో బోయ గోవిందు ఒక్కడే గాయాలతో బయపడి, భార్య, ఐదేళ్ల కొడుకును తీసుకొని అదే ట్రాక్టర్‌పై ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం పోలీసులు కర్నూలుకు తరలించారు. గాయపడిన పరమేశ్ భార్య జయమ్మ, గోవిందు భార్య వీరేషమ్మ, కుమారుడు లోకేంద్రనూ ఆస్పత్రిలో చేర్చారు. ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు పరారయ్యారు. గ్రామంలో బందోబస్తును రెట్టింపు చేసినట్లు డీఎస్పీ భార్గవి మీడియాకు వివరించారు.

గిన్నిస్ స్పీడ్‌తో రోడ్

వేగంగా బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం

- పుట్టపర్తి మండలంలో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్
- 4 గిన్నిస్ రికార్డులకు ప్రయత్నం
- నిరంతరాయంగా ఏడు రోజుల్లో 52 కి.మీ రోడ్డు


రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న అత్యాధునిక యంత్రాలు


జాతీయ రహదారి నిర్మాణానికి పూజలు నిర్వహిస్తున్న రాజపథ్ ఇన్‌ఫ్రాకాన్ ఎండీ జగదీష్ కదం దంపతులు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఫొటోలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, తదితరులు

పుట్టపర్తి రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు గిన్నిస్‌రికార్డు సాధించే వేగంతో సాగుతున్నాయి. ఒకేసారి నాలుగు గిన్నిస్ రికార్డులను సాధించాలనే లక్ష్యంతో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం వానవోలు-వంకరకుంట మధ్య నిర్మాణ సంస్థ రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సోమవారం ఉదయం 9.30కు పనులను ప్రారంభించింది. దేశ రహదారి నిర్మాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు జాతీయ రహదారి-544జీ పనులను వేదికగా చేసుకుంది. ప్యాకేజీ-2 కింద ఈ పనులను చేపట్టామని ఆ సంస్థ సీఎండీ జగదీశ్ కదం, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ అధికారి ఆర్‌కే సింగ్ తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డితో కలిసి పూజలు నిర్వహించి, రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ భారీ పనుల్లో 600 మందికి పైగా కార్మికులు, ఇంజనీర్లు పాల్గొంటున్నారు.

ఇవే ఆ రికార్డులు

- ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఏడు రోజుల్లో నిరంతరాయంగా 52 కి.మీ. బిట్యుమినస్ రోడ్డును నిర్మిస్తారు.
- అత్యంత ఎక్కువ మొత్తంలో నిర్మాణ సామగ్రిని వినియోగించడం.
- 24 గంటల్లో అత్యంత పొడవైన రోడ్డు నిర్మాణం.
- 24 గంటల్లో అత్యంత ఎక్కువ బిట్యుమినస్ కాంక్రీట్‌ను ఉపయోగించడం.

గతంలోనూ రికార్డులు

పుణెకు చెందిన రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ గతంలోనూ మూడు రికార్డులను సాధించింది. 24 గంటల్లో 39.691 కి.మీ. బిట్యుమినస్ కాంక్రీట్ రోడ్డును నిర్మించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నెలకొల్పింది. జాతీయ రహదారి 53పై 75 కి.మీ. సింగిల్ లేన్ బిట్యుమినస్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణంలోనూ గిన్నిస్ రికార్డును సాధించింది. 2022 జూన్ 3 నుంచి 7 వరకు మహారాష్ట్రలోని అమరావతి జిల్లా నుంచి అకోలా వరకు 42.2 కి.మీ. రెండులేన్ల రోడ్డును (84.4 కి.మీ. సింగిల్ లేన్ పొడవుకు సమానం) 105 గంటల 33 నిమిషాలలో పూర్తి చేసి రికార్డు సొంతం చేసుకుంది. సత్యసాయిబాబా ఆశీస్సులతో, గత రికార్డుల స్ఫూర్తితో కొత్త రికార్డులు సృష్టిస్తామని సంస్థ జీఎం పురుషోత్తం ధీమా వ్యక్తం చేశారు.

బిట్యుమినస్ రోడ్డు ఇలా..

దీనినే అస్ఫాల్ట్ రోడ్డు అని కూడా పిలుస్తారు. వాహనాలకు అనువైన, మృదువైన రోడ్డుతో పాటు మన్నికైన నిర్మాణానికి బిట్యుమిన్‌ను ఉపయోగిస్తారు. ముడి చమురు నుంచి వచ్చే జిగటగా ఉండే నల్లటి, చిక్కటి పదార్థమే ఈ బిట్యుమిన్. రాయిని బాగా క్రష్ చేసి దానికి ఇసుక, కంకరతో పాటు తారులా ఉండే బిట్యుమిన్‌కు కలుపుతారు. దీంతో రోడ్డు ఉపరితలం దృఢంగానూ, మృదువుగానూ ఉంటుంది. వాటర్‌ప్రూఫ్‌గానూ మారుతుంది. ఖర్చు తక్కువతో పాటు ఈ రోడ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయవచ్చు.



తమిళనాడులో విజయ్ పార్టీతో బీజేపీ పొత్తు?

న్యూఢిల్లీ, జనవరి 5: తమిళనాడులో నటుడు విజయ్ పెట్టిన టీవీకే(తమిళగ వెట్రి కళగం) పార్టీతో పొత్తు పెట్టుకునే అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. తాజాగా తమిళనాడులో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీఎంకే వ్యతిరేకులందరినీ ఒక్క తాటిపైకి తేవాలన్న సందేశం ఇచ్చేందుకే అన్నాడీఎంకే అధినేత పళనిస్వామిని కలవలేదని ఆ వర్గాలు తెలిపాయి. తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతున్న టీవీకేతో పొత్తు అవకాశాలను బీజేపీ తీక్షణంగా పరిశీలిస్తోందని పేర్కొన్నాయి. 'ఎన్డీయే కేవలం ఒక పార్టీకి, ఒక నేతకు పరిమితం కాకూడదని, ఏఎంఎంకే, పీఎంకే, అలాగే, అన్నాడీఎంకేలోని అసంతృప్త నేతల వరకు డీఎంకే వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకతాటిపైకి తేవాలని నొక్కి చెప్పడమే పళనిస్వామిని కలవకపోవడంలో ఉద్దేశం' అని బీజేపీ నేత ఒకరు చెప్పారు.

బోర్డు నిర్ణయం మేరకే.. భోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి!

- పాలకమండలి చెప్పిందే అమలు చేశా
- కల్తీ నెయ్యి కేసులో సింఘాల్ వాంగ్మూలం



అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): "అప్పట్లో టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయం మేరకే భోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలుకు ముందుకెళ్లాం. ఈ విషయంలో నాపై వ్యక్తిగతంగా ఎవరూ ఒత్తిడి చేయలేదు." అని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్నారు. అప్పట్లో పాలకమండలి తీసుకున్న నిర్ణయం మేరకు లడ్డూ తయారీ సహా ఇతర అవసరాలకు భోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చేశారు. అయితే ఇది కల్తీదని తేలడంతో ఈ వ్యవహారంపై అప్పటి ఈవో(ప్రస్తుతం కూడా) సింఘాల్‌ను సిట్ అధికారులు రెండు రోజుల కిందట ప్రశ్నించారు. లీటరు పాలు కూడా కొనుగోలు చేయని భోలేబాబా డెయిరీకి కోట్ల కిలోల నెయ్యి సరఫరా టెండర్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించగా.. అప్పట్లో బోర్డు నిర్ణయం తీసుకుందని, తాను ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఆ నిర్ణయాన్ని అమలు చేశానని చెప్పినట్లు తెలిసింది. సింఘాల్‌తో పాటు మరో ముగ్గురిని ప్రశ్నించిన అధికారులు.. వారి వాంగ్మూలాలను రికార్డు చేశారు.

'పరకామణి'లో సంస్కరణలపై హైకోర్టుకు టీటీడీ నివేదిక

పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తామన్న కోర్టు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టనున్న సంస్కరణలపై టీటీడీ సోమవారం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులు జారీచేస్తామని న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం ఆయన స్పందిస్తూ.. పరకామణి చోరీ ఘటనపై ఇప్పటికే చాలా వరకు దర్యాప్తు పూర్తయిందని గుర్తుచేశారు. ఇందులో వేర్వేరు అంశాలు ఇమిడి ఉన్నందున.. కేసుల నమోదుపై సుప్రీంకోర్టు తీర్పులను అధ్యయనం చేసి రావాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించారు. పరకామణిలో జరిగిన చోరీకి సంబంధించిన నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఆలయ ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్‌అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీష్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని హైకోర్టు గతంలో సీఐడీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. పరకామణిలో సంస్కరణలపై తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని కోర్టు టీటీడీని ఆదేశించింది. శాశ్వత సంస్కరణల్లో భాగంగా కానుకలను వర్గీకరించడం, విదేశీ కరెన్సీని గుర్తించడం, విలువైన లోహాలు, రాళ్లను వేరు చేసేందుకు ఏఐ, అత్యాధునిక సాంకేతికత వ్యవస్థ ఏర్పాటు విషయంలో 8 వారాల్లోపు ముసాయిదా రూపొందించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా.. టీటీడీ తరఫున న్యాయవాది శ్రీనివాసబాబా వాదనలు వినిపించారు.

ఇది జగన్ దిగజారుడుతనం

- చేయని పనులకు క్రెడిట్ తీసుకోవడమా..?: గంటా
- ఎయిర్‌పోర్టుకు బీజం వేసింది చంద్రబాబే

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



భోగాపురం ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులపై మాజీ సీఎం జగన్ క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించడంపై టీడీపీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. జగన్‌ను ఉత్తరాంధ్ర ద్రోహిగా, అభివృద్ధి కార్యక్రమాల నిరోధకుడిగా అభివర్ణించారు. విశాఖలో విలేకరుల సమావేశంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... "చేయని పనులు తానే చేశానని చెప్పుకొని క్రెడిట్ కొట్టేయడానికి జగన్మోహన్‌రెడ్డి యత్నించడం ఆయన దిగుజారుడుతనానికి నిదర్శనం. భోగాపురం విమానాశ్రయం, గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల క్రెడిట్ తనదేనంటూ జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2015లో ఫిబ్రవరి 12న విజయనగరం పర్యటనలో సీఎం చంద్రబాబు భోగాపురం విమానాశ్రయం ప్రకటన చేశారు. ఆ ఏడాది ఏప్రిల్ నుంచే భూసేకరణ ప్రారంభమైంది. అదే ఏడాది అన్ని అనుమతులూ వచ్చాయి. నాడు విజయనగరం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నేనే భూసేకరణ పనులు పర్యవేక్షించా. 'విశాఖ విమానాశ్రయంలో మధ్యాహ్నం వేళ ఈగలు తోలుకుంటున్నారు. భోగాపురంలో మరో విమానాశ్రయం దేనికి?' అంటూ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఇప్పటికీ ట్రోల్ అవుతున్నాయి. అయినా జగన్మోహన్‌రెడ్డి... కూటమి ప్రభుత్వం చేసిన పనుల క్రెడిట్ తీసుకోవాలని చూడడం సిగ్గుచేటు" అని గంటా అన్నారు.

నాడు రైతులను రెచ్చగొట్టింది జగన్ అండ్ కో: మంత్రి కొండపల్లి

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి బీజం వేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాడుభూములు ఇచ్చిన రైతులను జగన్ రెచ్చగొట్టి ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా వ్యవహరించారని.. ఇవన్నీ నేడు వీడియోల రూపంలో ప్రత్యక్షంగా జనం చూస్తున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి వ్యతిరేకి జగన్: అచ్చెన్న



'భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పూర్తి క్రెడిట్ సీఎం చంద్రబాబుకే దక్కుతుంది. ఈ ఎయిర్ పోర్టు కర్త, కర్మ, క్రియ అంతా ఆయనే' అని మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. నాడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వ్యతిరేకంగా జగన్ రైతులను రెచ్చగొట్టి అడ్డుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎయిర్‌పోర్టు పనులు నిలిపేసి ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఏళ్ల తరబడి వెనక్కి నెట్టారు. ఇప్పుడు పనులు పూర్తయ్యే దశకు రాగానే తానే చేశానని జగన్ చెప్పుకోవడం ఫేక్ రాజకీయానికి నిదర్శనం.. అని అన్నారు. ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మాట్లాడుతూ... '2019 మే నాటికే దాదాపు 2,500 ఎకరాల భూ సేకరణ పనులు పూర్తయ్యాయి. అందుకు దాదాపు రూ.670 కోట్లు వెచ్చించారు. తర్వాత 2019-2024 మధ్య కాలంలో మిగిలిన భూ సేకరణ, ఆర్అండ్ ఆర్ పనులకుగాను రూ.249 కోట్లు వెచ్చించారు' అని తెలిపారు.

'భోగాపురం' కర్త, కర్మ, క్రియ బాబే: కలిశెట్టి



అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నాడు.. ఎర్ర బస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్టా అని ప్రశ్నించిన జగన్.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ తమదేనని అనడం సిగ్గుచేటని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మట్లాడారు. కొబ్బరికాయ కొట్టగానే క్రెడిట్ రాదని జగన్ గ్రహించాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబు ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

సీమ లిఫ్ట్ ఆగిపోయింది జగనే వల్లే: ఎంఎస్ రాజు



మడకశిర, అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత జగన్‌కు, ఆపార్టీ నేతలకు లేదు. సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆగిపోవడానికి కారణం ముమ్మాటికీ జగనే' అని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో వ్యాఖ్యలు చేశారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి వెనక్కు తీసుకోవాలి. జగన్ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు ఆయన పత్రికలో బాబు, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాశారు' అని పేర్కొన్నారు.

చిన్నపిల్లాడిని అడిగినా చెబుతాడు

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు జగన్ హయాంలోనే 2020లోనే ఆగిపోయిందని అందరికీ తెలుసని మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. 'వాస్తవాలు దాచినా దాగదు. రాయలసీమ లిఫ్ట్ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆపిందని వైసీపీ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2024 ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ఆగినట్లు ఒక్క ఆధారం చూపించాలి. తెలంగాణ సీఎంతో మాకు ఉన్న రిలేషన్స్ వేరు, రాష్ట్ర ప్రయోజనాలు వేరు' అని మంత్రులు స్పష్టం చేశారు.

నామినేషన్ పద్ధతిపై రూ.10 లక్షల వరకు పనులు

- 'ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణపై జల వనరుల శాఖ నిర్ణయం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టు యాజమాన్య నిర్వహణ కోసం నామినేషన్ పద్ధతిలో ఇప్పటి వరకు రూ.ఐదు లక్షల దాకా విలువైన పనులు అప్పగిస్తున్నారని.. ప్రస్తుతం అంచనా వ్యయం పెరగడంతో ఈ విలువను పది లక్షల రూపాయలకు పెంచాలని సాగునీటి యాజమాన్య సంఘాలు చేసిన అభ్యర్థనపై జల వనరుల శాఖ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు నామినేషన్ విధానంలో పనులు పది లక్షల దాకా అప్పగించవచ్చంటూ జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులకు సూచిస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మెమో జారీ చేశారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయండి

- సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదార పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు, సమయపాలన పాటించడం లేదు. అధిక శాతం రేషన్ డిపోల్లో కాటాల్లో లోపాలు, తూకంలో మోసాలకు పాల్పడుతుండటంతో కార్డుదారులు నష్టపోతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ దుకాణదారులపై చర్యలు తీసుకోవాలి.. అని కోరారు.

దగదర్తి టీడీపీలో వర్గపోరు

- ఓ వర్గం దాడిలో క్లస్టర్ ఇన్‌చార్జికి గాయాలు

దగదర్తి(బిట్రగుంట), జనవరి 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దగదర్తి మండల కేంద్రంలో టీడీపీ నేతల వర్గపోరులో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల సురేశ్ గాయాలపాలవగా, కావలి వైద్యశాలకు తరలించారు. బాధితుడు సురేశ్ సోమవారం ఘటనపై మీడియాతో మాట్లాడారు. 'మాలేపాటి కుటుంబీకుల రాజకీయ భవిష్యత్తుకు నేను అడ్డుగా ఉన్నానని, నన్ను శాశ్వతంగా తొలగించాలనే ఉద్దేశంతో మారణాయుధాలతో దాడి చేశారు. మాలేపాటి సుధాకర్ నాయుడు, ఆయన అనుచరులు సుమారు 30 మంది కర్రలు, ఇనుపరాడ్లు, మారణాయుధాలతో దాడికి దిగారు' అని పేర్కొన్నారు. కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్సై జంపాని కుమార్ పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారికి నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

భాష అంతరిస్తే..జాతి అంతరించినట్టే!

- మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్య



ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఒక జాతి చరిత్ర, సంస్కృతి, వారసత్వం, ఆలోచనలకు ప్రాణం లాంటిది భాష అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. అదే అంతరిస్తే జాతి పూర్తిగా అంతరించినట్లేనని స్పష్టం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తెలుగును అభ్యసిస్తే ఉద్యోగాలు రావని చేస్తున్న విషప్రచారాన్ని అడ్డుకోవడంలో భాషాభిమానులు విఫలమవుతున్నారని అభిప్రాయపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో మాతృభాషను బోధించే పాఠశాలలు కూడా లేవని, ఏపీలో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. మన సామెతలు, వ్యంగ్యాలు, ఛలోక్తులకు దూరమవుతున్నామన్నారు. పిలల్లకు తెలుగుపై మమకారం పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. ప్రాథమిక విద్య తెలుగులో జరగాలని, ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విధిగా తెలుగు భాషా శాఖను ఏర్పాటు చేయాలని, శాసనాలు, ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలనే తీర్మానాలు చేసి ప్రభుత్వానికి అందజేయాలని తెలుగు మహాసభల నిర్వాహకులకు ఆయన సూచించారు.

తెలుగుపై మక్కువ పెంచాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పిల్లలకు తెలుగు భాషపై మక్కువ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఇందుకోసం ఇంట్లో అందరూ తెలుగులోనే మాట్లాడటం, రాయడం, చదవడం చేయాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సోమవారం ఆయన మాట్లాడుతూ పిల్లలు ఏ సిలబస్ చదివినా ద్వితీయ భాషగా తెలుగు ఉండేలా చూడాలని సూచించారు. తెలుగు భాషపై మక్కువ పెంచుకునేలా పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏ భాషలో చదువుకొన్నా ఉద్యోగావకాశాలు వస్తాయన్న నమ్మకాన్ని పెంపొందించగలగాలన్నారు. తెలుగు కోసం ఎన్నో సేవలు చేసిన మహనీయుల విగ్రహాలను అమరావతి లో ఏర్పాటు చేసి, వారి గురించి పిల్లలకు తెలియజేయాలన్నారు.



ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదిక మీద కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గోవా గవర్నర్ అశోక్ గజపతి, ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు, గజల్ శ్రీనివాస్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు

మన భాషను మరవొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అవుతారు. కవిత్రయం నుంచి అష్టదిగ్గజాల వరకు, గురజాడ నుంచి శ్రీశ్రీ, దాశరథి వరకు ఎందరో మహానుభావులు తెలుగు భాష కోసం పని చేశారు. వేమన, సుమతీ, భాస్కర పద్యాలను మరిచిపోలేం. అన్నమయ్య, వెంగమాంబ, మొల్ల వంటి వారు భక్తి మార్గంలో తెలుగుకు వెలుగు తెచ్చారు. తొలిభాషా ప్రయుక్త రాష్ట్రాన్ని తీసుకువచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరువలేం. తెలుగు జాతంటే మదరాసీలు కాదు.. తెలుగువారు అని ప్రపంచానికి చాటి చెప్పిన అన్న ఎన్టీఆర్, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసే సమయంలో ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావు, దినపత్రికను నెలకొల్పి, తెలుగు భాషకు సేవలందించిన రామోజీరావు త్యాగాలను మరువలేం. జ్ఞానపీఠ అవార్డులతో తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని చాటిన విశ్వనాథ, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ గొప్పవారు." అని ఆయన తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

మాతృభాషను మర్చిపోవద్దు

"ప్రస్తుత సమాజంలో ఇంగ్లీషు చాలా అవసరం. అలాగని మాతృ భాషను మర్చిపోవద్దు. అమెరికాలో ఉన్నా కేంద్ర మంత్రి పెమ్మసాని వారి పిల్లలను పెంచినట్లు పెంచితే తెలుగు భాషకు ఎలాంటి ప్రమాదం ఉండదు. టెక్నాలజీ వల్ల మాతృభాషకు ప్రమాదం ఏమీ ఉండదు. ఇంకా చెప్పాలంటే భాషలను కాపాడుకోవడం మరింత సులభం అవుతుంది. తెలుగు జాతి టెక్నాలజీలో ముందుండాలి.."

అందుకే ఏటా నారావారి పల్లెకు..

"తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోనే భాషా రక్షణ సాధ్యమవుతుంది. అందుకే ఎన్ని పనులు ఉన్నా ఏటా నారావారి పల్లెకు వెళ్లి అక్కడ గడపాలని నా భార్య భువనేశ్వరి కోరారు. ఆ సంప్రదాయాన్ని 20 ఏళ్లుగా కొనసాగిస్తున్నాం." అని చంద్రబాబు తెలిపారు. సభా వేదికపైకి రాకముందు ఆయన అక్కడ ప్రాంగణంలోని పుస్తకశాలను సందర్శించారు. తెలుగు మహాసభల నేపథ్యంలో తపాలా శాఖ రూపొందించిన కవర్‌ను ఆవిష్కరించి, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి నిమ్మల రామానాయుడు, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

మారిషస్ అధ్యక్షుడితో భేటీ..

సభానంతరం మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో మారిషస్ అధ్యక్షుణ్ణి సీఎం సత్కరించారు. మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు వారి యోగక్షేమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు..

మాతృభాషతోనే మానవ విలువలు వస్తాయి: గోవా గవర్నర్ అశోక్ గజపతి

మాతృ భాషతోనే మానవ విలువలు వస్తాయని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు తెలిపారు. సోమవారం గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. "భావితరాలకు విలువలను అందించడం పెద్ద సమస్యగా మారింది. చక్కని కార్యాచరణ ప్రణాళిక ద్వారా దీనిని అధిగమించవచ్చు. ఈ కృషిలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలి. అప్పుడే తెలుగు భాషకు న్యాయం చేయగలం." అని తెలిపారు.

పిల్లలకు తెలుగు నేర్పే బాధ్యత తల్లిదండ్రులదే : స్పీకర్

పిల్లలకు తెలుగు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు కోరారు. 'గ్రాండ్ పా అని పిలిస్తే.. మాట్లాడనని నా మనవడితో చెప్పాను. అప్పటి నుంచి తాతయ్య అని పిలుస్తున్నాడు. తెలుగువారిలో 60 శాతం మందే శ్రీరామ నవమి చేసుకుంటున్నారని నా సొంత పరిశోధనలో తెలుసుకుని ఆందోళనకు గురయ్యాను" అని ఆయన తెలిపారు.

2027లో మారిషస్... 2029లో విశాఖలో తెలుగు మహాసభలు

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ 4వ తెలుగు మహాసభలు 2027 జనవరి 8, 9, 10 తేదీల్లో మారిషస్ దేశంలో జరగనున్నాయి. ఐదో ప్రపంచ తెలుగు మహాసభలు 2029లో విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు మూడో ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు సందర్భంగా ఈ మేరకు తదుపరి సభలు జరిగే వేదికలను నిర్వాహకులు ప్రకటించారు. ప్రపంచ తెలుగు మహాసభల కోసం గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) సహకరించారంటూ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్లలో మాతృ భాషలో మాట్లాడాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గుంటూరు(తూర్పు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉచిత పథకాలతో ప్రభుత్వంతో పాటు ప్రజలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో సోమవారం సాయంత్రం జరిగిన 'మన తెలుగు భాష-అమృత భాష' సెషన్‌లో మాట్లాడారు. "ఉచితాలకు ప్రజలను అలవాటు చేస్తే ఆ వ్యవస్థ ఎక్కువ కాలం మనుగడ సాధించలేదు. ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉన్నాయనే భ్రమలోనే ప్రజలు ఉంటున్నారు. ఉచిత బస్సు మహిళలు అడగలేదు. ఏ కారణంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారో పాలకులు సమాధానం చెప్పాలి. ప్రభుత్వం వద్ద నిధులు అధికంగా ఉంటే విద్య, వైద్యం ఉచితంగా అందించాలి." అని వెంకయ్య సూచించారు. భాష బతకాలంటే ప్రతిఒక్కరూ ఇళ్లలో మాతృ భాషాలో మాట్లాడటం అవసరమన్నారు. మాతృ భూమిని, మాతృ దేశాన్ని, మాతృమూర్తిని మరిచిన వారు ఎన్నటికీ పరిపూర్ణ వ్యక్తులు కాబోరని తెలిపారు. గుడిలో, బడిలో, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. ఇంగ్లీష్ వస్తేనే రాణిస్తామనేది అపోహ మాత్రమేనన్నారు. అనంతరం మహాసభల ఏర్పాటులో కృషి చేసిన నిర్వాహకులను వెంకయ్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటక పరిషత్ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, నటుడు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జల వివాదాలకు శాశ్వత పరిష్కారం

ఇదే నా లక్ష్యం: చంద్రబాబు

- ఐక్యతతోనే తెలుగుజాతి పురోగతి
- విభేదాలు ఉండకూడదు
- రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు
- గంగా-కావేరి అనుసంధానం జరగాలి
- తెలుగు మహాసభల్లో సీఎం ఆకాంక్ష

అమరావతి/గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు శాశ్వతంగా పరిష్కారం కావాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రెండు రాష్ట్రాలూ సమైక్యంగా ఉంటేనే తెలుగు జాతి పురోగతి సాధ్యమవుతుందన్నారు. కలసి ఉంటే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని.. మన మధ్య విద్వేషాలు ఉండకూడదని సూచించారు. గోదావరి నదిలో కావలసినంత నీరుందని.. ఈ నదిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా నీటికి కొరతే ఉండదని స్పష్టంచేశారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి నదిపై తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకుంటుంటే తానెప్పుడూ అడ్డు చెప్పలేదని గుర్తుచేశారు. గుంటూరు శివారులో సోమవారం ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలను ప్రస్తావించారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి వీటి లోతుల్లోకి వెళ్లడం లేదని, ఐక్యత గురించే మాట్లాడతానని తెలిపారు. 'మనం రెండు రాష్ట్రాలుగా ఉన్నా, తెలుగే మనకు మాతృభాష. తెలుగు వారంతా ఐకమత్యంగా ఉంటేనే అగ్రస్థానంలో నిలుస్తాం. నాడు సాగునీటి వ్యవస్థకు దారి చూపింది ఎన్టీఆరే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన హయాంలో అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత నేను ముఖ్యమంత్రిగా కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేశాను. కృష్ణా డెల్టా ఆధునికీకరణతో నీటిని పొదుపు చేసి 20 టీఎంసీల నీటిని తెలంగాణకు కేటాయించి భీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశా. అలీసాగర్, గుప్త, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టాం. ఆంధ్ర ప్రాంతంలో చాగల్నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తెచ్చాం. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరు అందించాం. ప్రతి ఏడాది గోదావరి నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలోకి పోతోంది. గతేడాది కృష్ణా, గోదావరి నదుల నుంచి సుమారు 6,282 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీళ్లను తెలంగాణ వాడుకున్నా, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా నేనెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. దేశంలో నీటి సమస్యల పరిష్కారం కావాలన్నదే నా అభీష్టం. అందుకోసం నదులన్నింటినీ అనుసంధానించి నీటిని పూర్తిగా వినియోగించుకోవాలి. గంగానది నుంచి కావేరి వరకూ నదుల అనుసంధానం జరగాలి. ఏపీలో కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం జరిగింది. అలాగే రాష్ట్రంలోని అన్ని నదుల అనుసంధానమూ జరగాలి. గోదావరిలో నీళ్లు తెలంగాణ వాడుకున్నా ఇబ్బందేమీ లేదు. తెలుగు ప్రజల మధ్య విభేదాలు వద్దు. నా జీవితాశయం ఒక్కటే.. రెండు తెలుగు రాష్ట్రాలూ సహకారంతో కలిసే ఉండాలి' అని ఉద్ఘాటించారు.

'ఎర్రబస్సూ' రాదన్నది ఎవరు జగన్?

(మొదటి పేజీ తరువాయి)

'బోగస్ మాటలు' సోషల్ మీడియా సాక్షిగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో ఆయన చేసిన చేష్టలు కళ్లముందే కనపడుతున్నాయి. అయినా సరే... 'నవ్విపోదురుగాక' అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు చూసి ఉత్తరాంధ్ర మొత్తం ముక్కున వేలేసుకుంటోంది. భోగాపురంపై జగన్, ఆయన రోత మీడియా ఇప్పుడు చెబుతున్నదేమిటి... అసలు వాస్తవాలు ఏమిటి? మీరే చూడండి!

● జగన్ అనుమతులు సాధించారట

2019 ఎన్నికల ముందు అనుమతులు లేకుండా చంద్రబాబు శంకుస్థాపన చేశారని అబద్ధాలు వండి వార్చారు. జగన్ పాలనలో వేగవంతంగా అనుమతులు వచ్చాయని, 2023 మే 3న ఆయన శంకుస్థాపన చేశారని గొప్పలు చెప్పారు.

ఇదీ వాస్తవం: విశాఖ విమానాశ్రయం తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఆంక్షలతో నడుస్తోంది. నేవీ అవసరాలకు ఒకవైపు వాడుకుంటూ.. మరోవైపు పౌర విమానాలను అనుమతిస్తున్నారు. దీనివల్ల విమానయాన సంస్థలు విశాఖ రావడానికి తటపటాయించే పరిస్థితి. ఇలాగైతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని 2015లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా సముద్రం పక్కనే భోగాపురంలో విమానాశ్రయం నిర్మించాలని ప్రతిపాదించారు. అప్పట్లో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రిగా అశోక్‌గజపతిరాజు ఉండడంతో వెంటనే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. అవసరమైన అనుమతులు తీసుకున్నారు. 2019 ఫిబ్రవరిలో భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణ బాధ్యతలు జీఎంఆర్ గ్రూపునకు అప్పగించి శంకుస్థాపన కూడా చేశారు. మరింత దూరదృష్టితో ఆలోచించిన చంద్రబాబు విమానాశ్రయంతో పాటు విమానాల నిర్వహణ, రిపేర్లు, ఆపరేషన్లు (ఎంఆర్ఓ) కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని కోసం భూసేకరణకు నడుం కట్టారు. వాస్తవం ఇది. అయితే జగన్మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి రాగానే భోగాపురం విమానాశ్రయం పనులు జరగకుండా అడ్డపడ్డారు. మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయని గుర్తించి చంద్రబాబు శంకుస్థాపన చేసిన దానికే 2023లో జగన్ మరోసారి శంకుస్థాపన చేశారు.

● జగన్ భూసేకరణ చేశారట

2022లో కోర్టు కేసులు తొలగించి జగన్ సర్కారు భూసేకరణ పూర్తి చేసిందని గొప్పలకు పోయారు.

ఇదీ వాస్తవం: గత టీడీపీ హయాంలోనే భూసేకరణ చేశారు. జగన్ అడ్డుపడినా చంద్రబాబు 2,703 ఎకరాల భూమిని సేకరించారు. జగన్ 2019లో అధికారంలోకి రాగానే పనులు జరగకుండా గాలికి వదిలేశారు. భోగాపురంలో విమానాల నిర్వహణ, రిపేర్లు, ఆపరేషన్లు (ఎంఆర్ఓ) అవసరం లేదని ఒక నివేదిక తయారు చేయించి, చంద్రబాబు కేటాయించిన భూమిలో 500 ఎకరాలు వెనక్కి తీసుకున్నారు. విమానాశ్రయానికి 2,203 ఎకరాలే ఇచ్చారు. ఆ భూముల్లో కొబ్బరి,జీడి,తాటి చెట్లు కొట్టించి చదును చేసిన భూములు జీఎంఆర్‌కు అప్పగించాల్సి ఉండగా మూడేళ్లు తిప్పలుపెట్టారు. ఎన్నికల ముం దు మళ్లీ తూతూ మంత్రంగా పనులు చేపట్టారు.

● చంద్రబాబు భూసేకరణ చేయలేదట

నాడు చంద్రబాబు సర్కారు విమానాశ్రయానికి భూసేకరణ చేయలేదంటూ మరో అభాండం వేశారు.

ఇదీ వాస్తవం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భోగాపురం మండలానికి వెళ్లిన జగన్.. రైతులు ఎవరూ విమానాశ్రయానికి భూములు ఇవ్వవద్దని రెచ్చగొట్టారు. కొందరితో కోర్టులో కేసులు కూడా వేయించారు. ఇలా విమానాశ్రయం నిర్మాణానికి అడుగడుగునా అడ్డం పడ్డారు. వీటన్నింటిని అధిగమించిన చంద్రబాబు 2,703 ఎకరాల భూమిని సేకరించారు.

● ఎన్‌వోసీ ఘనత జగన్‌దేనట

2022లో జగన్ సర్కారు భూసేకరణ పూర్తి చేసిందని, అదేఏడాది కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని గొప్పలు చెప్పారు.

ఇదీ వాస్తవం: 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక... కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సైట్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ముగిసిపోయే వరకు భోగాపురం విమానాశ్రయం పనులు ఒక్కటి కూడా చేపట్టలేదు. దాంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌ఓసీ ఇవ్వడానికి నిరాకరించింది. వీటన్నింటినీ చూపించి జీఎంఆర్‌తో రాయబేరాలు నడిపారు. కాకినాడలో ఆర్థిక మండలి భూములతో లింకులు పెట్టి దారికి తెచ్చుకున్నారు. నాడు జీఎంఆర్ గ్రూపును అన్ని విధాలా ఇబ్బందులు పెట్టి.. ఇప్పుడు అభినందనలు చెప్పడం జగన్‌కే చెల్లు.

● నాశనం చేసి లక్ష్యం నిర్దేశించారట

టీడీపీ హయాంలో భోగాపురం విమానాశ్రయం పనులే జరగలేదన్నట్టుగా, జగన్ వచ్చాకే ఆయన నిర్దేశించిన లక్ష్యంతో ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తోందని, గణనీయమైన భాగం తమ హయాంలోనే పూర్తయిందని చెప్పారు.

ఇదీ వాస్తవం: 2019లో జగన్ సర్కారు వచ్చాక వివిధ ప్రధాన ప్రాజెక్టుల మాదిరిగానే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను అటకెక్కించారు. ఎన్నికల ముందు నామమాత్రంగా నత్తనడకన పనులు చేపట్టారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ మోక్షం వచ్చింది. పనులు పరుగులు తీసేలా చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. కె.రామ్మోహన్ నాయుడుకు కేంద్రం పౌర విమానయాన శాఖ అప్పగించడంతో విమానాశ్రయం నిర్మాణ పనులను ప్రతి నెల సమీక్షిస్తూ పనులు వేగంగా పూర్తి చేయడానికి కృషిచేశారు. వాస్తవానికి ఈ ఏడాది డిసెంబరు వరకూ గడువు ఉన్నప్పటికీ ఆరు నెలలు ముందుగానే పూర్తి చేయాలని జీఎంఆర్‌కు నిర్దేశించారు. జూన్ నాటికి అనుకున్నా దాని కంటే ముందే పనులు దాదాపు పూర్తి కావడంతో ఆదివారం ఎయిర్ ఇండియా విమానం విజయవంతంగా ల్యాండ్ అయింది.

● అశోక్ చొరవ

కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రిగా అశోక్‌గజపతిరాజు ఉన్నప్పుడు భోగాపురం విమానాశ్రయం మంజూరైంది. ఇప్పుడు దానికి అనుబంధంగా ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించగా...అశోక్ గజపతిరాజు తనకు వారసత్వంగా వచ్చిన 136 ఎకరాలను మాన్సాస్ ట్రస్ట్ తరఫున ఉచితంగా ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. ప్రజల నుంచి సేకరించిన భూమిలో జగన్ 500 ఎకరాలు వెనక్కి తీసుకుంటే... అశోక్ గజపతిరాజు, ఆయన కుమార్తె అదితి కలిసి సుమారుగా వేయి కోట్ల రూపాయల విలువైన భూమిని ఉచితంగా ఇచ్చారు. చంద్రబాబు, అశోక్ గజపతిరాజు, రామ్మోహన్ నాయుడుల కృషి వల్ల భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగింది.

ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెరగాలి

- జూనియర్ కళాశాలలపై


ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సమావేశం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి కార్యాలయంలో ఆర్జేడీలు, ఆర్ఐవోలు, డీఐఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. 2025 పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న జిల్లాల అధికారులు తరచూ ప్రభుత్వ కళాశాలలను సందర్శించి సంకల్ప్-2026 అమలును పరిశీలించాలన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు అనేక మార్పులతో జరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు 45 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, వాటిని సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని రంజిత్ బాషా తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు పెద్దపీట

- పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవిచౌదరి

మండపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల శాఖ ద్వారా రూ. 20 వేల కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడి గ్రామం శివారు వేములపల్లిలో సోమవారం నాలుగు రాష్ట్రాలకు సంబంధించి వక్క రైతుల అవగాహన సదస్సుకు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రంలో ఓర్వకల్లు, విశాఖ, కుప్పంలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. మహిళా సంఘాలు, యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్ ద్వారా వ్యక్తిగతంగా రూ.10 లక్షల నుంచి, గ్రూపునకు రూ.3 కోట్ల వరకు రుణాలు సబ్సిడీతో కూడినవి ఇవ్వనున్నట్టు చిరంజీవిచౌదరి చెప్పారు. ఈ పరిశ్రమలకు ఏపీఐఐసీ ద్వారా భూమి కేటాయిస్తామన్నారు. వక్క ద్వారా తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్‌తో పాటు, వక్క బెరడు ద్వారా ప్లేట్లు తయారు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలో 62 శాతం వక్కసాగు ఏపీలోనే ఉందన్నారు. వక్కకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు.



కోనసీమలో బ్లో ఔట్!



డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో బ్లోఅవుట్ అయి ఎగసి పడుతున్న మంటలు

(మొదటి పేజీ తరువాయి)

అధికార యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక, పునరావాస చర్యలు చేపట్టింది.

అసలేం జరిగిందంటే..

ఇరుసుమండ గ్రామంలోని ఈ ప్రదేశంలో 1993లో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ నిర్వహించింది. ఆ తర్వాత ఈ బావిని వదిలేసింది. అయితే ఈ బావిని ఓఎన్జీసీ సంస్థ 2024లో డీప్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్‌కు సబ్‌లీజుకు ఇచ్చింది. ఇక్కడ 'వర్క్ ఓవర్ రిగ్‌తో' ఆ సంస్థ అన్వేషణ చేపట్టి.. ఈ బావిలో అపార చమురు, గ్యాస్ నిక్షేపాలున్నట్టు గుర్తించింది. ఈ క్రమంలో గతంలోనే డ్రిల్లింగ్ పూర్తయిన ఈ బావిలో సోమవారం మరింత లోతుగా 2.7 కిలోమీటర్లు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో అధిక ఒత్తిడితో గ్యాస్ విస్ఫోటం సంభవించింది. సుమారు అరగంట తర్వాత మరో విస్ఫోటంతో భారీ శబ్ధాలతో మంటలు చెలరేగాయి. ఈ మంటలు వంద అడుగుల ఎత్తు వరకు ఎగసిపడ్డాయి. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు భయకంపితులై ఇళ్లను ఖాళీ చేసి ప్రాణభయంతో పరుగులు తీశారు. భూగర్భ పొరల్లో 30 నుంచి 40 మిలియన్ టన్నుల గ్యాస్, చమురు నిల్వలు ఉన్నట్టు అధికారులు అంచనా వేసినట్టు సమాచారం. ప్రస్తుతం డ్రిల్లింగ్ సైట్ వద్ద మంటలు వంద అడుగుల ఎత్తు, 25 మీటర్ల వ్యాసార్థంతో ఎగసిపడుతున్నాయి. దీంతో సైట్ వద్ద ఉన్న వాహనాలు, రిగ్ పరికరాలు కాలి బూడిదవుతున్నాయి. కొబ్బరిచెట్లు, పంటపొలాలు బుగ్గిపాలవుతున్నాయి. బావిలో భారీగా చమురు, సహజవాయు నిక్షేపాలు ఉన్నందున ప్రస్తుతం ఈ భారీ బ్లో ఔట్‌ను అదుపు చేయడం కష్టమేనని ఓఎన్జీసీ భావిస్తోంది. పైపులైను వ్యవస్థ కూలిపోవాలి లేదంటే మొత్తం గ్యాస్ రిజర్వాయర్ మండి పీడనం తగ్గితే తప్ప దీన్ని అరికట్టలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. మంటలను అదుపు చేసేందుకు ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న ప్రధాన పంట కాల్వ నుంచి నీటిని వెదజల్లే ప్రక్రియను అధికారులు చేపట్టారు.

24 గంటల్లో స్పష్టత..: కలెక్టర్ మహేశ్‌కుమార్

మరో 24 గంటల్లో ఈ బ్లో ఔట్ అదుపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. బ్లో ఔట్ సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్‌తోపాటు ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్వో మాధవి, ఎంపీ గంటి హరీశ్ బాలయోగి, స్థానిక ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఆ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు లక్కవరంలో మకాం వేసి పరిస్థితులను సమీక్షించారు. ముందు జాగ్రత్తగా కిలోమీటరు పరిధిలోని ఇరుసుమండతో పాటు సరిహద్దు గ్రామమైన లక్కవరం ప్రాంతంలోని కొన్ని కుటుంబాలను ఖాళీ చేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇరుసుమండ పూర్తిగా లక్కవరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేశారు. బ్లో ఔట్ భయంతో పశువులను వదిలివేసి వెళ్లిపోయారు. కొందరు బంధువుల ఇళ్లకు వెళ్లిపోగా.. మిగిలిన వారిలో 150 మంది లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లోను, 400 మంది గుబ్బలపాలెంలోను పునరావాసం పొందుతున్నారు. వీరికి సోమవారం రాత్రి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. బ్లో ఔట్ కారణంగా సోమవారం ఉదయం మలికిపురం మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇరుసుమండ, లక్కవరం, పోతుమట్ల, చింతలపల్లి, గుబ్బలపాలెం గ్రామాల్లో రాత్రి కూడా విద్యుత్‌ను నిలిపివేశారు. కాగా, ఘటనాస్థలి వద్ద జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అగ్నిమాపక శకటాలు, వాటర్ ట్యాంకులను అగ్నిమాపక సిబ్బంది మోహరించింది.

గల్ఫ్‌లో ఉలిక్కిపడిన ప్రవాసీయులు

- కుటుంబసభ్యుల క్షేమంపై ఆందోళన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఇరుసుమండలో బ్లో ఔట్ ఘటన గల్ఫ్ దేశాల్లోని ప్రవాసీయులను కలవరపాటుకు గురిచేసింది. ఇరుసుమండ, లక్కవరంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది సౌదీ అరేబియా, ఖతార్, కువైత్, యూఏఈల్లో పనిచేస్తున్నారు. గ్యాస్ లీకేజీ నేపథ్యంలో సౌదీ అరేబియాలో ఉంటున్న లక్కవరం గ్రామానికి చెందిన రమ్య.. తన తల్లి తోట అన్నపూర్ణమ్మ ఎలా ఉందోనని ఆందోళన చెందారు. అయితే తన తల్లి సురక్షిత ప్రాంతానికి చేరిందని తెలిశాక రమ్య ఊపిరి పీల్చుకున్నారు. దుబాయ్‌లో పనిచేస్తున్న గడ్డం నరేశ్ కూడా.. గ్రామంలోని తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. దుబాయ్‌లో పనిచేస్తున్న అనేకమంది తమవారి గురించి ఆందోళన చెందారని నరేశ్ వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదం వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించనప్పటికీ.. ఆర్థిక నష్టం సంభవించినట్టు ఖతార్‌లో పనిచేసే కోనసీమ జిల్లా వాసి దొండపాటి శశికిరణ్ తెలిపారు.

అవసరమైతే బావిని మూసివేస్తాం: ఓఎన్జీసీ

బ్లో ఔట్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్టు ఓఎన్జీసీ సోమవారం ప్రకటించింది. అవసరమైతే ఈ బావిని మూసివేస్తామని స్పష్టం చేసింది. మోరి-5 జీసీఎస్ పరిధిలో డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పీఈసీ ఆపరేటర్‌గా ఉన్నారని, వాళ్లే ఇక్కడ గ్యాస్ లీకేజీ సమాచారం తమకు తెలియజేశారని పేర్కొంది. ఇరుసుమండ బావి రిమోట్ ఏరియాలో, జనావాసాలకు సుమారు 500-600 మీటర్ల దూరంలో ఉందని, దీని వల్ల ప్రాణనష్టం జరగలేదని, ఎవరూ గాయపడలేదని తెలిపింది. గ్యాస్ లీకైన ప్రాంతంలో కూలింగ్ ఆపరేషన్లు ప్రారంభించినట్టు చెప్పింది. సంక్షోభ నిర్వహణ బృందాలను (సీఎంటీ) రంగంలోకి దించామని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించింది. అవసరమైతే బావికి క్యాప్ (మూత) వేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని పేర్కొంది. అంతర్జాతీయ నిపుణులను సంప్రదిస్తున్నట్టు వివరించింది. తమ సీనియర్ మేనేజ్‌మెంట్, సాంకేతిక నిపుణులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారని, నరసాపురం తదితర సమీప ప్రాంతాల నుంచి అదనపు పరికరాలు రప్పిస్తున్నామని తెలిపింది. పరిస్థితిని బట్టి మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకుంటామని వివరించింది.

బ్లోఅవుట్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా

అమలాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్ వద్ద బ్లో ఔట్ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. జిల్లాకు చెందిన ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. ఓఎన్జీసీ ప్రతినిధులతో మాట్లాడి మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు.

గుండె ఆగినంత పనైంది



"మా ఇళ్లు రిగ్‌కు సమీపంలో ఉన్నాయి. నాకు కళ్లు సరిగా కనపడవు. ఓఎన్జీసీ రిగ్ నుంచి శబ్ధాలు రావడంతో ఏదో ప్రమాదం జరగనుందని భావించి కంగారుగా చేలల్లో నుంచి పరుగెత్తి లక్కవరం చేరాను. నా భార్య లక్ష్మి, అత్త శశిరేఖ, బావమరిది నాగరాజు కంగారుగా నన్ను వెతుక్కుంటూ వచ్చారు. ఉదయం జరిగిన బీభత్సానికి గుండె ఆగినంత పనైంది."

- లంక వసంతరావు, ఇరుసుమండ, మలికిపురం మండలం

బతుకుపై ఆశను వదులుకున్నాం



"ఉదయం 10-11 గంటల సమయంలో భారీ శబ్ధాలు వచ్చాయి. తరువాత బ్లో ఔట్ జరుగుతుందని ఇళ్లన్నింటినీ ఖాళీ చేయమని చుట్టుపక్కల వాళ్లంతా హడావిడి చేశారు. దీంతో లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో తలదాచుకున్నాం. అప్పుడప్పుడూ చిన్నచిన్న గ్యాస్ లీకేజీలు వంటివి జరిగేవి. ఈరోజు జరిగిన బ్లోఅవుట్‌తో గుండె అదిరిపోయింది. బతుకుపై ఆశను వదులుకున్నాం."

- వలవల అమ్మాజీ, సర్పంచ్, ఇరుసుమండ, మలికిపురం మండలం



మలికిపురం మండలం ఇరుసుమండ పక్క గ్రామం చింతలపల్లిలోని ప్రజలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు



ఇరుసుమండ గ్రామంలో ఇళ్లకు తాళాలు వేసిన దృశ్యాలు



ఫైర్ ఫైటింగ్ సిస్టమ్ ద్వారా బ్లోఅవుట్ సంభవించిన ప్రాంతంలోకి నీటిని వెదజల్లుతున్న అగ్నిమాపక సిబ్బంది

అన్నింటా స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్

- పౌరసేవలు, పథకాలపై నిరంతరం సమీక్షించాలి: సీఎం
- స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు శాఖ క్యాలండర్ ఆవిష్కరణ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ అన్ని అంశాల్లోనూ అమలు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుతున్న పౌరసేవలు, పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. దాదాపు 800 రకాల సేవల్ని ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందిస్తున్నాయని తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు అత్యుత్తమంగా సేవలందించాలన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం చేయూత కారణంగా రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మేర ఘనవ్యర్థాలు రీసైకిల్ కావాలని సూచించారు. తడిచెత్తను కంపోస్టు తయారీకి, ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు తరలించాలన్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ పెంచేందుకు బ్యాండ్‌విడ్త్‌ను విస్తరించాలన్నారు. అనంతరం స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డ్ శాఖ 2026 క్యాలండర్‌ను మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ విజయానంద్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో పాటు రవాణా, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీ, ఆర్టీజీఎస్, ఆర్థిక, ప్రణాళిక విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గోవా గవర్నర్‌తో సీఎం మర్యాదపూర్వక భేటీ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజుతో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన అశోక్‌గజపతిరాజును సోమవారం తన అధికారిక నివాసానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ వివిధ అంశాలపై చర్చించుకున్నారు. భోగాపురంలో నిర్మించే జీఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీకి భూమిని ఇచ్చినందుకు అశోక్‌గజపతిరాజుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

గవర్నర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం విజయవాడలోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌కు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లోక్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు.

రాష్ట్ర కార్యక్రమాలుగా 24 మంది జయంతి, వర్ధంతులు!

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 24 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర కార్యక్రమాలుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 'వడ్డె ఓబన్న జయంతి జనవరి 11, త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి జనవరి 15, యోగి వేమన జయంతి జనవరి 19, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం, దామోదర సంజీవయ్య జయంతి ఫిబ్రవరి 14, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి ఫిబ్రవరి 22, మొల్లమాంబ (మొల్ల) జయంతి మార్చి 13, పొట్టిశ్రీరాములు జయంతి మార్చి 16, పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి మార్చి 28, బాబూజగ్జీవన్ రామ్ జయంతి ఏప్రిల్ 5, జ్యోతిబా ఫూలే జయంతి ఏప్రిల్ 11, అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14, మహాత్మా బసవేశ్వర జయంతి, అల్లూరి వర్ధంతి మే 7, ఎన్టీఆర్ జయంతి మే 28, అల్లూరి జయంతి జూలై 4, బళ్లారి రాఘవాచార్యులు జయంతి ఆగస్టు 2, సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఆగస్టు 16, టంగుటూరి ప్రకాశం జయంతి ఆగస్టు 23, భగవాన్ విశ్వకర్మ జయంతి సెప్టెంబరు 17, మహర్షి వాల్మీకి జయంతి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నవంబరు 11, కనకదాస్ జయంతి, పొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబరు 15' నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముంబై నుంచి ప్రత్యేక టీమ్

- బ్లో ఔట్ నియంత్రణకు సమయం పట్టొచ్చు
- డీప్ ఇండస్ట్రీస్ సామర్థ్యంపై అనుమానాలు

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇరుసుమండ బ్లోఔట్‌ను నియంత్రించడానికి మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓఎన్జీసీకి చెందిన పలు టీమ్‌లు మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా.. సోమవారం రాత్రికి కూడా అవి నియంత్రణలోకి రాలేదు. ఇరుసుమండ బావి మోరీ జీసీఎస్ పరిధిలోని 5వ నంబర్ బావి. ఇది వర్కు ఓవర్ బావి. అంటే ఇప్పటికే ఇక్కడ చమురు, సహజవాయును డ్రిల్లింగ్ చేసి వాటి ఉనికిని కూడా కనుగొన్నారు. ఇక్కడ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి కోసం డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సోమవారం ప్రాథమిక పని మొదలు పెట్టింది. ఆ సమయంలోనే గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయి. వాస్తవానికి డ్రిల్లింగ్ పూర్తయిన తర్వాత బావిలోని పైపుల నుంచి గ్యాస్ లీకవ్వకుండా ఐదు, ఆరు వాల్వులతో కూడిన బ్లోఔట్ ప్రివెంటర్ (బీవోపీ)లను అమర్చుతారు. ప్రతీ బోరులోనూ డ్రిల్లింగ్ పూర్తి చేసి, రిగ్‌ను తొలగించిన తర్వాత బీవోపీని అమర్చుతారు. మళ్లీ ఆ బావి నుంచి గ్యాస్, చమురును వెలికితీసే సమయంలో బీవోపీని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఇక్కడ అధికంగా ఉన్న గ్యాస్, చమురును వెలికి తీసే పని మొదలు పెట్టడంతో అధిక పీడనంతో గ్యాస్ లీక్ అయినట్టు చెబుతున్నారు. ఇది బీవోపీ కింద భూమిలో నాలుగైదు అడుగుల్లోనే జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదే నిజమైతే బ్లో ఔట్‌ను త్వరలోనే నియంత్రించవచ్చు. లీకేజీ బాగా లోతు నుంచి ఉంటే మరికొంత సమయం పట్టవచ్చు. ప్రస్తుతం ఓఎన్జీసీకి చెందిన సంక్షోభ నియంత్రణ బృందాలు(సీఎంటీ), ఆర్‌సీఎంటీకు చెందిన వారు నియంత్రణ పనులు మొదలు పెట్టారు.

ఓఎన్జీసీలో అంతా రహస్యమే!

ఇటీవల ఓఎన్జీసీ సమాచారాన్ని దాచేస్తుంది. గతంలో ఎక్కడ డ్రిల్లింగ్ చేసినా, అన్వేషణ చేసినా, ఏ బావిలో ఎంత చమురు ఉందో, ఎంత గ్యాస్ ఉందో కూడా వివరించేది. ఇటీవల ఎన్ని బావులు ఉన్నాయనేది కూడా చెప్పడం లేదు. ఇరుసుమండ బ్లోఔట్ విషయంలో ఓఎన్జీసీకి చెందిన కొంతమంది ప్రమాదానికి డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌దే బాధ్యత అని చెప్పారు. కానీ, చివరకు ఓఎన్జీసీకి చెందిన బృందాలు రంగంలోకి దిగాయి.

ఓఎన్జీసీ డ్రిల్లింగ్.. డీప్ ఇండస్ట్రీస్ ఉత్పత్తి..

కృష్ణా-గోదావరి(కేజీ) బేసిన్‌లో మొదట ఓఎన్జీసీ మాత్రమే చమురు, సహజవాయులను వెలికి తీసింది. తర్వాత కెయిర్న్, రిలయన్స్ వంటి సంస్థలు వచ్చేశాయి. కొద్దినెలల క్రితం జాయింట్ వెంచర్ పేరిట ఓఎన్జీసీ మోరి జీసీఎస్ పరిధిలోని పలుబావులను డీప్ ఇండస్ట్రీస్ సంస్థకు అప్పగించింది. వాస్తవానికి మోరి జీసీఎస్‌లో మోరి, కేశనపల్లి, కేశవదాసుపాలెం ప్రాంతాల్లో సుమారు 50 బావుల వరకూ ఉంటాయి. వాస్తవానికి ప్రస్తుతం బ్లోఔట్ జరిగిన ఇరుసుమండ బావిని డ్రిల్లింగ్ చేసింది ఓఎన్జీసీనే. చాలా కాలం క్రితమే ఇక్కడ డ్రిల్లింగ్ చేసి సహజవాయువులు, చమురు ఉన్నట్టు గుర్తించి.. దానికి బీవోపీని అమర్చిపెట్టింది. సోమవారం డీపీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇక్కడ ఉత్పత్తిని ప్రారంభించే ప్రయత్నాలు మొదలుపెట్టగా.. బ్లోఔట్ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ సంస్థ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పచ్చని కోనసీమలో 'అగ్ని'కీలలు!

- జిల్లా ప్రజలకు గ్యాస్ బ్లోఔట్‌ల కలవరం
- గత మూడు దశాబ్దాల్లో పలు ఘటనలు

అమలాపురం/అల్లవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్‌లో చమురు, సహజ వాయువుల నిక్షేపాలు పుష్కలంగా ఉండే కోనసీమ ప్రాంతంలో మరో గ్యాస్ బ్లోఔట్ ఆందోళనలు రేపింది. భూగర్భ గ్యాస్ పైపులైన్లు తరచూ పేలుతున్న ఘటనలతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 1995లో అల్లవరం మండలం బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పాశర్లపూడి 19ఏ ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఔట్ దేశంలోనే అతిపెద్దదిగా నిలిచింది. 2014 జూన్‌లో మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని గెయిల్ కంపెనీ పైపులైను విస్ఫోటనం ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పోగా.. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తాజాగా మలికిపురం మండలం ఇరుసుమండ ఘటన నేపథ్యంలో గతంలో కోనసీమ ప్రాంతంలో జరిగిన ప్రమాదాలను ఒకసారి అవలోకనం చేసుకుందాం..

పాశర్లపూడి.. అతిపెద్ద బ్లోఔట్: కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పాశర్లపూడి 19ఏ ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఔట్ సంభవించి 30 ఏళ్లు అయింది. అతిపెద్ద బ్లోఔట్‌గా దీన్ని గుర్తించారు. 1995 జనవరి 8 రాత్రి పాశర్లపూడి 19ఏ బావిలో డ్రిల్లింగ్ జరుగుతుండగా గ్యాస్ లీక్ ఏర్పడి పేలుడు సంభవించింది. 65 రోజులపాటు మంటలు కొనసాగాయి. 1,500 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. కోటిపల్లి సత్యనారాయణ బృందం వాటర్ అంబ్రెల్లా సాయంతో మంటల వద్దకు వెళ్లి అగ్నికీలల్లో ఉన్న పైపులైను పైభాగాన్ని కట్ చేసి పూర్తి నియంత్రణలోకి తెచ్చారు. 1995 మార్చి 15 నాటికి మంటలను పూర్తిగా నియంత్రించారు.

కొమరాడ బ్లోఔట్..: మామిడికుదురు మండలం కొమరాడ-1 (ఇ14-17 రిగ్) ఓఎన్జీసీ సైట్‌లో బ్లోఔట్ సంభవించింది. అధిక పీడనంతో గ్యాస్ ఎగసిపడడంతో ప్రమాదం సంభవించింది. 6 వేల కుటుంబాలను వేరేచోటకు తరలించారు.

దేవరపల్లిలో 20 రోజుల పాటు..

1997 ఫిబ్రవరి 19న రావులపాలెం మండలం దేవరపల్లి శివారు పితానివారిపాలెం మరో బ్లోఔట్ సంభవించింది. ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో ఎగసిపడిన మంటలు 20 రోజులు కొనసాగాయి. చెల్లూరు వరకు పైపులైన్లు వేసి.. క్రాస్ డ్రిల్లింగ్ చేసి పూర్తిగా మంటలు అదుపులోకి తెచ్చారు. అమలాపురం రూరల్ మండలం తాండవపల్లిలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్ వద్ద 2006 సెప్టెంబరు 19న భారీ విస్ఫోటనంతో బ్లోఔట్ సంభవించి, మంటలు ఎగసిపడ్డాయి. 2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని గెయిల్ కంపెనీ పైపులైను విస్ఫోటనం జరిగింది. ఈ ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పోగా, 18 మందికి తీవ్రంగా గాయపడ్డారు. వందల సంఖ్యలో మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. నగరంలో తరచూ గ్యాస్ పైపులైన్ లీకేజీలు సంభవించడంతో స్థానిక ప్రజలు భయాందోళన మధ్య జీవనం సాగిస్తున్నారు.



చంద్రబాబును కలిసిన సచివాలయ ఉద్యోగుల సంఘం నేత రామకృష్ణ బృందం

సీఎంను కలిసిన అప్సా కార్యవర్గం

- కొత్త అధ్యక్షుడు రామకృష్ణకు చంద్రబాబు అభినందన

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం(అప్సా)కు కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు గొలిమి రామకృష్ణ సహా నూతన కార్యవర్గాన్ని సీఎం అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, ప్రభుత్వం నిర్దేశించిన స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌కు పూర్తి స్థాయిలో సహకరిస్తామని సీఎంకు రామకృష్ణ తెలిపారు. ఉద్యోగులకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తామన్నారు. ఉద్యోగుల వివిధ సమస్యల పరిష్కారానికి విజ్ఞాపన పత్రాన్ని సీఎంకు అందజేశారు.

రిటైర్మెంట్ వయసు పెంపుపై ఉపసంఘం భేటీ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం అమరావతి సచివాలయంలో భేటీ అయింది. కమిటీ సభ్యులు పురపాలకశాఖ మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల రిటైర్మెంట్ వయసు పరిమితితో 2,831 మంది ఉద్యోగులు ఇప్పటికే కొనసాగుతున్నారు. దీంతో మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్‌లు, 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు పెంపుపై చర్చించారు.

ఆన్‌లైన్‌లో చికిత్స వివరాలు: సౌరబ్ గౌర్

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రోగుల చికిత్స వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ పేర్కొన్నారు. సోమవారం డీఎంఈ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. బోధనాస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనాస్పత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడాలన్నారు. వైద్యుల రోజువారీ వ్యక్తిగత పనితీరుకు సంబంధించిన పూర్తి వివరాలు రోగుల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల యాప్‌లో కనిపించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే పర్యవేక్షణ అధికారుల నుంచి చర్యలుంటాయన్నారు. త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వైద్యుల వద్దకు వెళ్లే ముందుగానే అపాయింట్మెంట్ తీసుకునే అవకాశాన్ని కల్పించాలని నిర్దేశించారు.

సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్‌గా గిరిషా

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎండీ పీఎస్ గిరిషా కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. బెంగుళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్‌గా కేంద్రం ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు డీవోపీటీ డైరెక్టర్ ఎ.కన్మణి జోయ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన గిరిషా కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు చేసుకున్న దరఖాస్తుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్‌వోసీ ఇవ్వడంతో కేంద్రం ఆయనను సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్‌గా నియమించింది.

కూటమి కోసం త్యాగాలు చేయాలి..!: నాగబాబు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కూటమిలో సర్దుబాటు కోసం కొంత మంది త్యాగాలు చేయాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ కె.నాగబాబు తెలిపారు. సోమవారం ఉదయం ఎన్ఆర్ఐ శ్రేణులతో ఆయన వర్చువల్ సమావేశంలో మాట్లాడారు. త్యాగాలు చేసిన దానికి తానూ ఒక ఉదాహరణ అన్నారు. ఇదే సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా ఎన్నో కోల్పోయారని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.